SUNDAY
విశాలాంధ్ర
స్థాపితం : 1952
సంపుటి : 66, సంచిక : 204
అక్షరాక్షరం అభ్యుదయం
ఆదివారం 14-01-2018 Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam విజయవాడ ప్రచురణ



జాలి లేని పిల్లలు

- తెగిపోతున్న బంధాలు
- ఆప్యాయతలు కరవు
- కన్నవారిని పట్టించుకోని సుపుత్రులు
- కూతుళ్లలోనూ తగ్గుతున్న మమకారం
- కోడళ్లు, అల్లుళ్ల ఆరళ్లు
- అల్లాడుతున్న వృద్ధజీవులు

7 లో

కుటుంబ వ్యవస్థకు, మానవీయ విలువలకు మరోరూపం భారతీయ సమాజం. ఉమ్మడి కుటుంబాలున్నప్పుడు వాతావరణమే వేరుగా ఉండేది. కుటుంబ సభ్యులంతా ఒకే ఇంట్లో ఉంటూ కష్టాలు, సుఖాల్లో ఒకరికి మరొకరు తోడుగా ఉండేవాళ్లు. ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది.

నేడు భోగి

మంటలకు దుంగలు, దుక్కులు లేవా...

అవినీతి ఉద్యోగుల ధనదాహం తగిలేస్తే పోలా....



కోపం కూడా మంచిదే ..

కానీ.. అనర్థాలే ఎక్కువ

- భావోద్వేగాల నియంత్రణతో ప్రయోజనాలెన్నో...
- స్వీయ సమీక్షతో మనస్సు నిర్మలం, ఆరోగ్యం పదిలం

ప్రస్తుతం సమాజంలో మనం ఎదుర్కొనే ప్రధాన సమస్య కోపం. వయసుతో నిమిత్తం లేకుండా కోపాన్ని ప్రదర్శించడం సాధారణమైపోయింది. చిన్నతనంలో పిల్లలు కావలసింది సాధించుకునేందుకు ప్రదర్శించే అస్త్రం కోపాన్ని ప్రదర్శించడమే..



Sunday Special



చల్లారని సెగ

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వ్యవహార తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తి నలుగురు సీనియర్ జడ్జీలు సృష్టించిన సంచలనం సెగలు ఇంకా చల్లారలేదు. న్యాయవ్యవస్థకే కాదు... దేశ ప్రజలను సైతం నివ్వెరపర్చిన ఈ ఘటన తాలూకు సంక్షోభం... ఒకట్రెండు రోజులలో సద్దుమణుగుతుందని అటార్నీ జనరల్ ప్రకటనయితే చేశారు కానీ... ఆ దిశగా చర్యలేవీ కన్పించలేదు. ఆరోపణలు చేసిన నలుగురిలో ఒకరైన జస్టిస్ కురియన్ ఏ మాత్రం తగ్గకుండా న్యాయం కోసమే గళం విప్పామన్నారు. బీజేపీకి చెందిన కేంద్ర మాజీమంత్రి యశ్వంత్‌సిన్హా ఒక అడుగు ముందుకేసి తన తరహాలో నిప్పులు చెరిగారు. ఇకనైనా నోరువిప్పి ప్రధానమంత్రిని ప్రశ్నించండంటూ కేంద్ర మంత్రులకు పిలుపునిచ్చారు. రాజీ కుదిర్చేందుకు సుప్రీంకోర్టు బార్‌అసోసియేషన్ రంగంలోకి దిగి, ఏడుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించింది. అయితే సమస్యపై ప్రధాన న్యాయమూర్తే చర్చలకు చొరవ తీసుకోవాలని సూచించింది.

11 లో

- పెదవి విప్పని మోడీ సర్కార్
- పట్టువీడని చీఫ్, సీనియర్లు
- కొనసాగుతున్న ఉత్కంఠ

న్యాయం కోసమే గళమిప్పాం
వెనక్కు తగ్గని జస్టిస్ కురియన్



ఇకనైనా మోడీని నిలదీయండి
మంత్రులకు యశ్వంత్ హితవు



మోడీ వికృత చేష్టల వల్లే...
సీపీఐ నేత నారాయణ



ప్రధాన న్యాయమూర్తే చొరవ తీసుకోవాలి
సుప్రీం బార్ అసోసియేషన్ సూచన

ఐటి హబ్‌గా తిరుపతి

సీఎం చంద్రబాబు



విశాలాంధ్ర - రేణిగుంట : ఐటి పరిశ్రమల హబ్‌గా తిరుపతిని తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. శనివారం తిరుపతి-రేణిగుంట రోడ్డులో జోహో సాఫ్ట్‌వేర్ కంపెనీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ అంతా నాలెడ్జి ఎకానమీదేన్నారు. తిరుపతిలో సెల్‌కాన్, కార్బన్, డిక్సన్ లాంటి కంపెనీలు వచ్చాయన్నారు. జోహో సిఇఓ శ్రీధర్, రాజు మాదిరి స్థానిక యువత ఎదగాలని, ప్రపంచంలో జోహో కేంద్రాల్లో తిరుపతి కేంద్రాన్ని బెస్ట్ కేంద్రంగా చేయాలన్నారు. తిరుపతి అభివృద్ధికి శ్రీసిటీ, ఎయిర్‌పోర్ట్స్, దగ్గరలోపోర్ట్‌లు ఉన్నాయి. అపోలో టైర్ల పరిశ్రమకు భూమి పూజ చేశామన్నారు.

మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో కొత్త కొత్త పరిశ్రమలు రావడం, ఉద్యోగాలు పెరగడం సంతోషకరమన్నారు. ఐటి మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ వైజాగ్, అమరావతి, తిరుపతి, అనంతపురంలలో 4 సైబర్ టవర్స్ కడుతున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి విజన్ వల్ల 2019 నాటికి రాష్ట్రంలో ఒక లక్ష మందికి ఐటి రంగంలో, 2 లక్షల మందికి ఎలక్ట్రానిక్ పరిశ్రమల రంగంలో ఉద్యోగాల కల్పన లక్ష్యమని చెప్పారు. రేణిగుంట ఎలక్ట్రానిక్ క్లస్టర్ అభివృద్ధికి పునాది జోహో.. 2020కు రాష్ట్రంలో విశాఖ, అమరావతి, తిరుపతి, అనంతపురంలో 4 సైబర్ టవర్లు నిర్మిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎంపి డాక్టర్ శివప్రసాద్, ప్రజాప్రతినిధులు, ఐటి కార్యదర్శి విజయానంద్, కలెక్టర్ ప్రద్యుమ్న, ఐటి సలహాదారు జెపి చౌదరి పాల్గొన్నారు.

'కృష్ణా'లో కత్తి కట్టారు



కృష్ణాజిల్లా కంకిపాడు మండలం గొడవర్రులో కోడి పందేలను ప్రారంభిస్తున్న టీడీపీ ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్

- రాష్ట్రంలోనే మొదటగా కోడి పందేలు విజయవాడలో ప్రారంభం
- ఈడ్పుగల్లులో ఎమ్మెల్యే బోడే, గొడవర్రులో ఎమ్మెల్సీ వైవీబీ
- పశ్చిమంలో 50 బరులకు నోటీసులిచ్చిన పోలీసులు
- అయి భీమవరం, ఉండిలో నేడు డింకీ పందేలు

విశాలాంధ్రబ్యూరో - అమరావతి

సంక్రాంతి కోడి పందేలకు కృష్ణాజిల్లాలో పందేల రాయుళ్లు కత్తి కట్టారు. హైకోర్టు ఉత్తర్వులు, పోలీసు ఆంక్షలను నిర్వాహకులు ఖాతరు చేయలేదు. రాష్ట్రంలోనే తొలి పందెం రాజధానికి అతి సమీపంలోనే ప్రారంభమైంది. ఈ పందేలను పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్, టీడీపీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ లాంఛనంగా ప్రారంభించారు. విజయవాడ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పెనమలూరు నియోజకవర్గంలోని కంకిపాడు మండలం ఈడ్పుగల్లు, గొడవర్రులో కోడి పందేలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈడ్పుగల్లులో ఎమ్మెల్యే బోడే ప్రసాద్ పందేలను ప్రారంభించగా, గొడవర్రులో ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ ప్రారంభించారు. కోడి పందేల నిర్వహణపై ఆంక్షలు ఉన్నాయని, పందేల బరుల వద్ద సెక్షన్ 144 ఉందంటూ జాయింట్ పోలీసు కమిషనర్ రమణకమార్ నిర్వాహకులకు చెప్పేందుకు ఈడ్పుగల్లు వెళ్లారు. జాయింట్ పోలీస్ కమిషనర్ ఉండగానే ఎమ్మెల్యే బోడే ప్రసాద్ పందేలను ప్రారంభించటం గమనార్హం. మరోవైపు ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్ స్వయంగా కోడిపుంజును పట్టుకుని పందేలకు శ్రీకారం చుట్టారు. హైకోర్టు ఉత్తర్వులు, పోలీసుల ఆంక్షలు ఉన్నప్పటికీ రాజధాని ప్రాంతంలో కోడి పందేలకు కోళ్ల కాలు దువ్వటం చర్చనీయాంశమైంది. నిర్వాహకులు కోళ్లకు కత్తులు కట్టే పందేలు నిర్వహిస్తున్నారు. పందేలకు అనుమతిలేదంటూ పోలీసులు పలు చోట్ల ఫ్లెక్సీలను ఏర్పాటు చేసినా ఎక్కడా పందేలు ఆగే సూచనలు కనిపించటంలేదు. మరోవైపు విజయవాడ పోలీస్ కమిషనరేట్ పరిధిలో

- మిగతా 2 లో

హైలో.. హైలెస్సా...



కృష్ణాజిల్లా నాగాయలంకలో సంక్రాంతి సందర్భంగా సంప్రదాయ పడవ పోటీలు మంత్రి కొల్లు రవీంద్ర, డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్, ప్రారంభించారు.

అట్టహాసంగా పతంగుల ఉత్సవం

2లో

మహావిషాదం

వేర్వేరు ప్రమాదంలో 38 మంది మృతి



9లో

చిదంబరం సహా కార్తి బంధువుల ఇళ్లలో ఈడీ సోదాలు

9లో

'ఉపాధి' బిల్లులకు

సాంకేతిక చిల్లులు

- ఎన్‌టీఆర్ పథకం కింద 8.63 లక్షల ఇళ్లు
- ఇప్పటికే 2.01 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి
- 2016-17 నుంచి పైసా రాని బిల్లులు
- కేంద్రం నుంచి రావాల్సింది రూ.5,100 కోట్లు
- లబ్ధిదారులకు రూ.1,166 కోట్ల బకాయి
- సాంకేతిక సమస్యలే ప్రధాన కారణమా...!



విశాలాంధ్రబ్యూరో - అమరావతి

ఎన్‌టీఆర్ గ్రామీణ గృహనిర్మాణ పథకం లబ్ధిదారులకు రెండేళ్లగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్) బిల్లులు రావటంలేదు. రాష్ట్రానికి 2016-17, 17-18, 18-19 సంవత్సరాలకు 8.63 లక్షల ఇళ్లు మంజూరయ్యాయి. ఈ ఇళ్లకు ఉపాధి హామీ పథకం కింద రూ. 5,100 కోట్లు కేంద్రం నుంచి రావాల్సి ఉంది. గృహనిర్మాణ పథకం కింద రూ. 150 లక్షలతో ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు ఇటుకలు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణ, ఉపాధి కూలి కింద రూ. 58 వేలు కేంద్రం ఇవ్వాల్సి ఉంది. అలాగే రూ. 2 లక్షలతో గ్రామీణ్ ఇళ్లు నిర్మించుకుంటున్న వారికి రూ. 80 వేలను ఉపాధి కింద కేంద్రం ఇవ్వాల్సి ఉంది. కాని మూడేళ్లలో ఒక్క రూపాయి కూడా రాష్ట్రానికి రాలేదు. ఇప్పటికే నిర్మాణాలు పూర్తయిన ఇళ్లకు రాష్ట్ర ప్రభుత్వం తన వాటా బిల్లులను చెల్లించగా, కేంద్రం వాటా బిల్లులు మాత్రం పెండింగ్‌లో పడ్డాయి. గృహనిర్మాణశాఖ అధికారులు పలుమార్లు ఉపాధి

- మిగతా 2 లో

ఇదీ లోకం!



కుటుంబాన్ని బలిగొన్న ఆర్థిక ఇక్కట్లు

రైలు కింద పడి ముగ్గురు కుటుంబ సభ్యుల ఆత్మహత్య

ఖమ్మంలో దుర్ఘటన

ఖమ్మం: ఖమ్మం వెంకటగిరి గేటు సమీపంలో రైల్వే ట్రాక్‌పై ఓ హోంగార్డు కుటుంబ సభ్యులు ముగ్గురు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన కలకలం రేపింది. శనివారం ఈ విషాదం చోటుచేసుకుంది. జీఆర్పీ పోలీసుల కథనం ప్రకారం..కల్లూరు మండలానికి చెందిన కాశీవిశ్వనాథ్(40), భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం యూనిట్‌లో హోంగార్డుగా పనిచేసున్నాడు. కె.విశ్వనాథ్(36) తన కుమారులు జయంత్(13), అజయ్‌కుమార్(12)తో కలసి ఆత్మహత్యకు



పాల్పడ్డాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే వీరు ఆత్మహత్య చేసుకున్నట్టు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని పోలీసులు తెలిపారు.

విశాలాంధ్ర
ప్రపంచం
2
విజయవాడ
ఆదివారం
14 జనవరి 2018

సానుకూలంగా జర్మనీ సంకీర్ణ ప్రభుత్వ చర్చలు



బెర్లిన్ : అనిశ్చితికి తెరదించే విధంగా జర్మనీ సంకీర్ణ ప్రభుత్వం జరిపే చర్చలు సానుకూల వాతావరణాన్ని కల్పిస్తున్నాయి. ఫ్రాన్స్‌కు మరింత సన్నిహిత సహకారం అందివ్వడం ద్వారా ఐరోపా కూటమికి బలమైన మద్దతు ఇస్తున్నట్లయింది. జర్మనీ ఛాన్సలర్ ఏంజిలా మెర్కెల్, క్రిస్టియన్ డెమొక్రటిక్ యూనియన్ (సీడీయూ), సీఎస్‌యూ, మార్టిన్ షుల్జ్ నేతృత్వంలోని సోషల్ డెమొక్రాటిక్ పార్టీ గత రాత్రంతా సుదీర్ఘ చర్చలు జరిపింది. భవిష్యత్తులో కొలువు దీరనున్న కొత్త ప్రభుత్వం విధివిధానాలకు సంబంధించి 28పేజీల ఒప్పందాన్ని ఖరారు చేసుకున్నాయి. ఐరోపా కూటమి నుంచి బ్రెక్జిట్ ఉపసంహరణ తరువాత కుదిరిన ఈ అవగాహన సానుకూల పరిణామంగా పరిశీలకులు భావిస్తున్నారు. చర్చల అనంతరం మెర్కెల్ మీడియాతో మాట్లాడుతూ ఇదొక ముందంజగా చెప్పారు. షుల్జ్ మాట్లాడుతూ కుటుంబాల్లో, విద్య, డిజిటల్ సవాళ్లలో రావాలని ఆకాంక్షించే మార్పుల కోరిక బలీయతను ఈ ఒప్పందం గుర్తు చేస్తోందన్నారు.

సొరంగ యుద్ధానికి సిద్ధమవుతున్న అమెరికా సైన్యం



వాషింగ్టన్ : ఆకాశ యుద్ధం చేయడం వల్ల ఉ.కొరియా అణుబాంబులను భద్రపర్చిన ప్రదేశాలను గుర్తించలేమని, ఉత్తర కొరియా మొత్తం భారీగా సొరంగాలు ఉన్నాయని సైనిక నిఘా వర్గాలు ధ్రువీకరించుకున్నాయి. ఉత్తర కొరియా సరిహద్దుల్లోనే దాదాపు 5వేల సొరంగాలు ఉన్నట్లు అమెరికా సైనిక వర్గాలు గుర్తించాయి. దీంతో వేలసంఖ్యలో అమెరికా సైనికులకు ప్రత్యేక శిక్షణను ప్రారంభించారు. సొరంగాల్లో ఏ విధంగా యుద్ధం చేయాలో ఈ శిక్షణలో నేర్పిస్తున్నారు. దీనికోసం పెంటగాన్ పెద్ద ఎత్తున సైన్యానికి ఉపయోగపడే పరికరాలను కొనుగోలు చేసింది. ప్రస్తుతం శిక్షణ పొందుతున్న సైనికులకు తోడు వాయుసేనలోని 101 ఎయిర్‌బార్న్ డివిజన్, 82వ ఎయిర్‌బార్న్ డివిజన్‌లకు కూడా ఈ శిక్షణ ఉండవచ్చని భావిస్తున్నారు. సాధారణంగా సొరంగ యుద్ధానికి ఒకటి లేదా రెండు డివిజన్లనే సిద్ధం చేస్తారు. కానీ, ఉత్తర కొరియాలోని పరిస్థితికారణంగాభారీ సంఖ్యలో సైనికులకు ఈ శిక్షణను ఇవ్వాల్సి వస్తోంది. ఉత్తర కొరియాలోని సొరంగాలు ప్రమాదకర ఆయుధాలకు అడ్డాలని అమెరికా నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. వీటిల్లో శతఘ్నులు, అణు, జీవ, రసాయన ఆయుధాలు ఉండవచ్చని భావిస్తున్నారు. ఇప్పటికే ఉత్తరకొరియా వద్ద దాదాపు 5,000 టన్నుల జీవ, రసాయన ఆయుధ నిల్వలు పోగుబడి ఉన్నట్లు నిఘా సమాచారం.

ట్రంప్ జాత్యహంకార వ్యాఖ్యలపై

54 ఆఫ్రికా దేశాలు కన్నెర్ర

బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండు



ఐక్యరాజ్యసమితి : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నోటంట మరో మారు జాత్యహంకార పలుకులు వెలువడ్డాయి. ఈ సారి ఆఫ్రికా దేశాలను ఉద్దేశించి ట్రంప్ నోరు జారారు. అమెరికాలోకి ఇతర దేశాల పౌరుల వలసలను అనుమతించే విషయమై మాట్లాడుతూ ఆఫ్రికా దేశాల పౌరులను అవమానించే పదాలను ఉపయోగించారు. ఆఫ్రికా దేశాల్లోని కొన్ని దేశాలు అత్యంత చెత్తవిగా ఆయన పేర్కొన్నారు. సంపన్న వంతమైన, శ్వేతజాతీయులైన నార్వే వంటి దేశాల నుంచి కాక అత్యంత చెత్తవి, నల్లజాతీయులుండే హైతీ, ఎల్‌సాల్వడార్ దేశాల నుంచి పౌర వలసలను ఎందుకు అనుమతిస్తున్నారంటూ శ్వేతసౌధంలో సహచర విధాన నిర్ణేతల సమక్షంలో అధికారులను ప్రశ్నించడం తీవ్ర వివాదాస్పదమైంది. దీనిపై 54 ఆఫ్రికా దేశాలు మండిపడుతున్నాయి.ఆఫ్రికా దేశాల ఐక్యరాజ్య సమితి రాయబారులు ఒక ప్రకటనలో ట్రంప్ దురహంకార, జాత్యహంకార, విద్వేష వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈవ్యాఖ్యలకు తాము దగ్భ్రమ చెందామన్నారు. ట్రంప్ నోటి దురుసు మాటల ప్రభావాన్ని సమీక్షించేందుకు ఆయా దేశాలన్నీ అత్యవసరంగా భేటీ అయాయి. నాలుగు గంటల పాటు సుదీర్ఘంగా చర్చించాయి. అనంతరం ఆమోదించిన ఏకగ్రీవ తీర్మానాన్ని ఒక ప్రకటన ద్వారా వెల్లడించాయి. ఆఫ్రికా దేశాల పౌరుల జాతి, రంగు తదితర అంశాల పట్ల అమెరికా పాలన యంత్రాంగం నిరంతరం కొనసాగిస్తున్న చులకన విధానం తమను కలచి వేస్తోందని ఆప్రకటనలో తెలిపారు. ముక్తకంఠంతో ఖండిస్తున్నట్లు ప్రకటించారు. మనుష రంగు ప్రాతిపదికా తక్కువ చేసి మాట్లాడటం హేయమైన చర్యగా విమర్శించారు. ఇందుకు ట్రంప్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అదే సమయంలో తమకు మద్దతుగా స్వరం కలిపిన అన్ని వర్గాల ప్రజానీకానికీ ధన్యవాదాలు తెలిపారు. ఈవిషయంలో తామంద రమూ ఒకే తాటిన నిలచినట్లు రాయబారి ఒకరు మీడియాకు చెప్పారు. బోత్స్వానా, సెనెగల్ దేశాల ప్రతినిధులు తమ వ్యతిరేకతను, అభ్యంతరాలను లిఖితపూర్వకంగా తెలియజెప్పేందుకు అమెరికా రాయబార కార్యాలయాన్నీ సందర్శించినట్లు తెలుస్తోంది. తనేమన్నా పడి ఉంటారులే అన్న దురహంకార ధోరణి ట్రంప్ మాటల్లో వ్యక్తమైనట్లు ఆఫ్రికా కూటమి (ఏయూ) అధ్యక్షుడు మౌసా ఫక్కీ అధికార ప్రతినిధి ఎబ్బా కలోండో తెలిపారు.

సిరియా బలగాల చేతిలో ఇడ్లిబ్ పట్టణాలు



దమాస్కస్ : ఇడ్లిబ్‌లో టర్కీ మద్దతున్న తిరుగుబాటుదారులు చేజిక్కించుకున్న అన్ని పట్టణాలనూ సిరియా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఇడ్లిబ్‌లోని వాయువ్య ప్రావిన్స్‌లోని పలు పట్టణాలను టర్కీ అండదండలున్న తిరుగుబాటుదారులు, అల్ ఖయిదాతో సంబంధాలున్న లెవంట్ లిబరేషన్ మిలిటెంట్ గ్రూపులు స్వాధీనం చేసుకుని ఒక రోజు గడిచింది. సిరియా అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్ రైట్స్ వెల్లడించిన సమాచారం ప్రకారం హమా గ్రామీణ ప్రాంతాల్లోనూ , ఇడ్లిబ్‌లోనూ మిలటరీ కార్యకలాపాలు చేపట్టిన తరువాత సుమారు 120పట్టణాలపై సైనిక నియంత్రణ సాధించాయి.

అదుపులోకి కాలిఫోర్నియా అగ్నికీలలు



వెంచుర(కాలిఫోర్నియా) : కాలిఫోర్నియా చరిత్రలో అతి పెద్దదిగా గుర్తింపు పొందిన అగ్నికీలలు ఎట్ట కేలకు అదుపులోకి వచ్చినట్లు అధికారులు తెలిపారు. కోస్తా తీరంలోని పర్వతాల మీద నుంచి దిగువకు జాలు వారిన బురద పర్వత పానువుల్లోని గృహాలను ముంచేశాయన్నారు. ఈప్రమాదంలో సుమారు 18మంది మృతి చెందినట్లు సమాచారం. లాస్ ఏంజిల్స్‌కు వాయువ్యంగా విస్తరించిన వెంచురా, శాంతా బార్బరా ప్రాంతాలను ఉవ్వెత్తున ఎగసిన థామస్ అగ్నికీలలు చుట్టుముట్టాయి.

ప్రమాద తీవ్రతను గుర్తించిన అధికారులు లాస్ పడ్రెస్ నేషనల్ ఫారెస్ట్‌లోకి సందర్శకులను ఎవరినీ అనుమతించలేదు. బలంగా వీచే ఈదురు గాలులకు అగ్నికీలలు మరింత ప్రమాదకరంగా మారాయి. 1,000కిపైగా భవనాలు, గృహసము దాయాల నుంచి పౌరులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మంటలధాటిని గుర్తించిన ప్రజలు ప్రాణభయంతో పరుగులు తీశారు. మంటలను అదుపు చేయడానికి రంగంలోకి దిగిన అగ్నిమాపక సిబ్బందిలో కోరీ ఐవర్సన్ (32) ఊపిరి ఆడక మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. కాగా, ఇటీవలె కొన్ని కుటుంబాలు తిరుగుముఖం పట్టాయన్నారు.

ఏథెన్స్‌లో కార్మిక సంఘాల నిరసన ప్రదర్శనలు



ఏథెన్స్: కార్మికుల హక్కులను హరించే విధంగా రూపొందించిన కొత్త చట్టాలు క్రూరంగా ఉన్నాయని కార్మికసంఘాలు మొదటి దఫా నిరసనన ప్రదర్శనలు, ర్యాలీలు నిర్వహించాయి. ఈప్రదర్శనల్లో సుమార 12వేల మంది కార్మికులు పాల్గొన్నట్లు పోలీసులు తెలిపారు. గ్రీకు పార్లమెంటులో దీనిపై చర్చలు జరిగాయి. కార్మికుల సమ్మెహక్కును హరించే విధంగా సంబంధిత బిల్లులో మార్పులు చేయడానికి పాలకులు ప్రయత్నిస్తున్నారని కార్మిక సంఘాలు ఆగ్రహిస్తున్నాయి. 2018లో దేశ వ్యాపితంగా 24గంటల పాటు కార్మిక సంఘాలు జరిపిన అతి పెద్ద నిరసన కార్యక్రమం ఇదే కావడం గమనార్హం. కాగా, సోమవారం ఈబిల్లుపై పార్లమెంటులో జరిగే ఓటింగులో ఎంపీలు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. కార్మిక సంఘాల నిరసన కారణంగా రవాణా నౌకలు రేవుల్లోనే నిలిచి పోయాయి. నిరసన కార్యక్రమంలో రవాణా కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్న కారణంగా రహదారుల మీద ఎక్కడి వాహనాలు అక్కడనే నిలిచిపోయాయి. ప్రైవేటు రంగ ఉద్యోగులకు ప్రాతినిధ్యం వహించే వివిధ పౌర సేవల సంఘాలూ ఈ నిరసన ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నాయి. కాఠిన్యానికి ఇక ఎంత మాత్రం తావు లేదు. హుందా జీవనం, సమ్మె హక్కు పరిరక్షణ వంటి నినాదాదాలు రాసిన బ్యానర్లు ప్రదర్శనలో పాల్గొన్న వారి చేతుల్లో కనిపించాయి. పార్లమెంటు భవనం వెలుపల బ్యానర్‌ను ప్రదర్శించేందుకు ప్రయత్నించిన కార్మికులకు, పోలీసులకు మధ్య కొద్ది సేపు వాగ్వివాదం జరిగింది. కార్మికులను నిలువరించేందుకు పోలీసులు బాష్పవాయువును ప్రయోగించారు. కార్మిక సంఘాలను బలహీన పరిచేందుకే ప్రభుత్వం ఈతరహా క్రూర చట్టాలు తెచ్చేందుకు ప్రయత్నిస్తోందని గ్రీసు కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి దిమిత్రిస్ కోత్సోంబాస్ అన్నారు. కార్మిక హక్కులను పరిరక్షించుకునేందుకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తామని ఆయన అన్నారు.

చంద్రబాబు హామీలు మోసపూరితం: జగన్



విశాలాంధ్ర - తిరుపతి కార్పొరేషన్ : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసే హామీలన్నీ మోసపూరితమైనవని వైఎస్‌ఆర్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి విమర్శించారు. శనివారం 61వ రోజు పాదయాత్ర సందర్భంగా ఆర్.సి.పురం కూడలిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో ఏ ఒక్క రైతన్నకు గాని, డ్వాక్రా అక్క చెల్లెల్లకు ఋణమాఫి చేయకుండా మోసం చేసిన ఘనత చంద్రబాబునాయుడుదేనని చెప్పారు. పేద విద్యార్థుల ఉన్నత విద్య కోసం ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ సక్రమంగా అమలు చేయక పోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు కాలేజీలకు ఫీజులు కట్టలేక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని అన్నారు. శనివారం ఉదయం రాయల్ చెరువు పేట నుంచి పాదయాత్ర ఉదయం 9 గంటలకు ప్రారంభమైంది. కుప్పంబాదూరులో విగ్రహ ఆవిష్కరణ చేసి ప్రజలకు అభినందనలు తెలుపుతూ పాదయాత్రగా రాయల్‌చెరువు కట్ట, బలిజపల్లి, పి.వి.పురం, గంగిరెడ్డి, రామిరెడ్డిపల్లె కమ్మకండ్రిగ, ఆర్.సి.పురం, నడవలూరు వరకు సాగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, చింతల రామచంద్రారెడ్డి, నారాయణస్వామి, ఎంపిలు మిథున్‌రెడ్డి, విజయసాయిరెడ్డి, స్థానిక నాయకులు మండల కన్వీనర్ బ్రహ్మానందరెడ్డి, దామోదర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, భానుకుమార్ రెడ్డి, గిరిధర్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, మురగయ్య, గురుస్వామిరెడ్డి, రఘునాధరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక చిల్లులు

(మొదటిపేజీ తరువాయి)

పెండింగ్ నిధుల కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపించినా ఫలితం శూన్యం. ఎన్‌టీఆర్ ఇళ్లను వేగవంతం చేయాలని, బిల్లుల చెల్లింపులో జాప్యం జరగకూడదని సాక్షాత్తు సీఎం చంద్రబాబు, మంత్రి కాలువ శ్రీనివాసులు పదే పదే చెబుతున్నారేగానీ, పెండింగ్ బిల్లుల ప్రస్తావనే తేవటంలేదు. గృహనిర్మాణశాఖ అధికారుల లెక్కల ప్రకారం రాష్ట్రంలో 2.01 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. వీటిలో రూరల్ హౌసింగ్ ఇళ్లకు రూ.92 వేలను, గ్రామీణ్ ఇళ్లకు రూ.1.20 లక్షలను రాష్ట్ర ప్రభుత్వం నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేసింది. ఎటొచ్చి రూరల్ హౌసింగ్‌కు సంబంధించి రూ.80 వేలు, గ్రామీణ్‌కు రూ.80 వేలలో ఒక్కపైసా చెల్లింపు జరగలేదు. మొదటి సంవత్సరంలోనే ఇళ్ల నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేసి కాపురాలు కూడా చేస్తున్నారు. కాని ఇంటి నిర్మాణం కోసం చేసిన అప్పులు మాత్రం అలానే ఉండిపోయాయి. ప్రభుత్వం నుంచి బిల్లులు వచ్చిన తర్వాత డబ్బులు ఇస్తామని సిమెంట్, ఇటుకలు, ఇసుకను లబ్ధిదారులు అప్పుకు తెచ్చుకున్నారు. ఏడాదవుతున్నా బకాయిలు చెల్లించకపోవటంతో వ్యాపారులు లబ్ధిదారులను నిలదీస్తున్నారు.

ఎన్‌టీఆర్ రూరల్ హౌసింగ్ కింద ఉపాధి చెల్లింపు ఇలా

వివరం	బిల్లు (రూపాయలలో)
ఉపాధి కూలీ (90 రూ.197)	17,730
ఇటుకల తయారీ	25,270
వ్యక్తిగత మరుగుదొడ్డి (స్వచ్ఛ భారత్)	15,000

పూర్తయిన ఇళ్ల వివరాలు

పథకం పేరు	పూర్తయినవి
ఎన్‌టీఆర్ రూరల్ హౌసింగ్ 2016-17	1,22,323
ఎన్‌టీఆర్ రూరల్ హౌసింగ్ గ్రామీణ్	18,060
ఎన్‌టీఆర్ రూరల్ హౌసింగ్ 2017-18	29,487
ఎన్‌టీఆర్ రూరల్ హౌసింగ్ గ్రామీణ్	16
ఎన్‌టీఆర్ రూరల్ హౌసింగ్ 2018-19	9,901

పశ్చిమ గోదావరికి ముందెత్తులోనే

రాష్ట్రంలోని ఒక్క పశ్చిమ గోదావరి జిల్లాకు మాత్రమే ఉపాధి హామీ పథకం కింద లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపు పూర్తయింది. ఆ జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ) ఉపాధి బిల్లులపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. దీంతో గృహనిర్మాణ పథకం ప్రారంభమైన సంవత్సరం నుంచే ఆ జిల్లాకు ఒక్కొక్కరికి రూ.58 వేలు విడుదలయ్యాయి. ఇతర జిల్లాల అధికారులు ఉపాధి బిల్లులను అప్‌లోడ్ చేయటంలో సాంకేతికపరమైన ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ప్రత్యేకంగా బిల్లులు చేసేందుకు కంప్యూటర్లు అందుబాటులో లేకపోవటం, ఉన్న సిబ్బంది క్షేత్రస్థాయి పరిశీలనకే సరిపోవటంతో ఉపాధి బిల్లులపై అంతగా దృష్టి సారించలేదు. దీంతో పశ్చిమ గోదావరి మినహా ఇతర జిల్లాల్లో ఎక్కడా ఉపాధి బిల్లుల చెల్లింపు జరగలేదని సాక్షాత్తు అధికారులే చెబుతున్నారు. మరోవైపు ఉపాధి బిల్లులు ఎలా చేయాలనే అంశంపై సిబ్బందికి సరైన అవగాహన కల్పించటంలోనూ హౌసింగ్ అధికారులు వైఫల్యం చెందారనే వ్యాఖ్యలూ ఉన్నాయి. ఇళ్ల నిర్మాణంలో ఇప్పటికే పశ్చిమ గోదావరి జిల్లా రాష్ట్రంలో ప్రథమస్థానంలో ఉంది.

ఫిబ్రవరి మొదటి వారంలో బకాయిల చెల్లింపు

ఎన్‌టీఆర్ గ్రామీణ గృహనిర్మాణ పథకం కింద లబ్ధిదారులకు బకాయిలను ఫిబ్రవరిలో మొదటి వారంలో చెల్లించేందుకు చర్యలు చేపడుతున్నట్లు హౌసింగ్ అధికారి ఒకరు తెలిపారు. మొన్నటి వరకు సాంకేతికపరమైన ఇబ్బందులతో బిల్లులు చేయలేదని, అందుకే కేంద్రం నుంచి నిధులు రాలేదన్నారు. ఇటుకలు, ఉపాధి కూలి, స్వచ్ఛ భారత్ కింద వ్యక్తిగత మరుగుదొడ్డి కోసం రూ.58 వేలు బిల్లులను అప్‌లోడు చేస్తున్నట్లు తెలిపారు. ఇదిలావుండగా, గ్రామీణ్ ఇళ్ల విషయంలో కేంద్రం వాటా రూ.80 వేలలో ఇంకా ఎలాంటి స్పష్టత రాలేదని ఆయన తెలియజేశారు.



గొడవర్రులో కోడి పందేలు చూసేందుకు తరలివచ్చిన జనం



కృష్ణాజిల్లా కంకిపాడు మండలం ఈడ్పుగల్లులో రాత్రిపూట ఫ్లడ్‌లైట్ల వెలుగులో కోడి పందేలు వేస్తున్న చిత్రం

'కృష్ణా'లో కత్తి కట్టారు

(మొదటిపేజీ తరువాయి)

కోడి పందేలు వేయకుండా పలు చోట్ల పోలీసులు అడ్డుకున్నారు. పందేల కోసం ఏర్పాటు చేసిన బరుల వద్ద సెక్షన్ 144ను అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలోనే పోలీసు అధికారులు కోడి పందేలకు అనుమతులివ్వటంపై వివక్ష చూపుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పెనమలూరు నియోజకవర్గంలో దర్జాగా పందేలు జరుగుతుంటే, ఇతర నియోజకవర్గాలలో అనుమతి ఇవ్వకపోవటంపై కొందరు ప్రజా ప్రతినిధులే అధికారుల తీరును ప్రశ్నిస్తున్నారు. ఇదిలావుండగా, సంక్రాంతి కార్యక్రమాల నిర్వహణకు పోలీసు అనుమతి తీసుకోవాలంటూ సీపీ డీ గౌతం సవాంగ్ ఆంక్షలు పెట్టటం వివాదస్పదంగా మారింది. కృష్ణాజిల్లా గుడివాడలో పందేలు ప్రారంభమయ్యాయి.

నోటీసులిచ్చినా ఆగేది లేదు

సంక్రాంతికి ఏటా కృష్ణా, గుంటూరు, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాల్లో భారీగా కోడి పందేలు జరుగుతాయి. ఏటా ఉభయ గోదావరి జిల్లాల్లోనే తొలుత కోడి పందేలు ప్రారంభమవుతాయి. కాని ఈసారి అందుకు భిన్నంగా కృష్ణాజిల్లాలో పందేలు ప్రారంభంకావటం విశేషం. ఈడ్పుగల్లు, గొడవర్రులో పందేలను ప్రజలు చూసేందుకు భారీగా ఏర్పాట్లు చేశారు. ఇదిలావుండగా, పశ్చిమ గోదావరి జిల్లాలో భారీ ఎత్తున పందేలు జరిగే 50 బరులను పోలీసులు గుర్తించారు. పందేలు నిర్వహించొద్దంటూ ఆ జిల్లా ఎస్‌పీ రవి ప్రకాష్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. అయినప్పటికీ పందేలను ఆపే ప్రసక్తేలేదని నిర్వాహకులు స్పష్టం చేస్తున్నారు. పశ్చిమంలో అయి భీమవరం, వెంప, ఉండి, కొప్పాక, శ్రీరామవరం, శ్రీనివాసపురం (జంగారెడ్డిగూడెం), గుండుగొలను, భీమడోలు, పెదవేగి, ధర్మాజిగూడెం ప్రాంతాలలో వందల కోట్ల రూపాయల పందేలు ఏటా జరుగుతాయి. అయితే హైకోర్టు ఉత్తర్వులతో పోలీసులు కోడి పందేల బరులను ట్రాక్టర్లతో తొక్కించేశారు. అయితే ఏలూరు సమీపంలోని కొప్పాకలో మాత్రం పందేనికి బరి సిద్ధమైంది. మరోవైపు బీజేపీ నేత రఘురామకృష్ణంరాజు ఆధ్వర్యంలో అయి భీమవరం, ఉండిలో డింకీలు పందేలు ఆదివారం ఉదయం ప్రారంభంకానున్నాయి. తూర్పు గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో కూడా ఆదివారం నుంచి కోడి పందేలను ప్రారంభించేందుకు నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు. కత్తులు కట్టి పందేలు వేయవద్దంటూ సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. అయితే అందుకు భిన్నంగా కత్తులు కట్టే పందేలు నిర్వహించటం గమనార్హం.

భాగ్యనగరం ఖాళీ...

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: సంక్రాంతి పండగను పురస్కరించుకుని నగరవాసులు సొంత ఊళ్లకు వెళ్లిపోవడంతో రోజూ వాహనాలతో రద్దీగా ఉండే నగర రహదారులు శనివారం బోసిపోయాయి. వరుసగా సెలవులు రావడంతో నగరంలో ఉన్నవారు ఇళ్లకే పరిమితమయ్యారు. దీంతో రోజూ రణగొణ ధ్వనులు, వాహనాల పొగతో ఉక్కిరిబిక్కిరి అయ్యే నగరవాసులకు కాస్త ఊపిరాడినట్లైంది. సికింద్రాబాద్, బేగంపేట్, ఖైరతాబాద్, అబిడ్స్, కోఠి, సుల్తాన్‌బజార్, మోజంజాహి మార్కెట్, దిల్‌సుఖ్‌నగర్, అమీర్‌పేట్, పంజాగుట్ట, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, కాప్రా, ఉప్పల్, వనస్థలిపురం తదితర ప్రాంతాలలో జనసంచారం లేక రహదారులు నిర్మానుష్యంగా మారాయి. ప్రధాన, అంతర్గత రహదారుల్లో వాహనాల రాకపోకలు పెద్దగా లేకపోవడంతో ట్రాఫిక్ పోలీసులకు విశ్రాంతి లభించినట్లైంది. నగరంలో ప్రతిరోజు వ్యాపార, వాణిజ్య సముదాయాలు వినియోగదారులతో కిటకిట లాడుతుంటాయి. సంక్రాంతి ప్రభావంతో వ్యాపార సముదాయాలు, మార్కెట్‌లు వినియోగదారులు లేక బోసిపోతున్నాయి. రాష్ట్రంలోనే ప్రధాన వాణిజ్యకేంద్రంగా పేరుపొందిన బేగంబజార్‌లో వినియోగదారుల సందడి కనిపించలేదు. కొనుగోలుదారులు లేక వ్యాపారస్తులు కాలక్షేపం చేయాల్సి వచ్చింది. నగరంలో ఇతర ప్రధాన వ్యాపార కేంద్రాలుగా పేరుపొందిన చార్మినార్, లాడ్‌బజార్, మదీన, సికింద్రాబాద్, అబిడ్స్, అమీర్‌పేట్, చిక్కడపల్లి, దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతాలలో వాణిజ్య సముదాయాలు బోసిపోయాయి. వీటితోపాటు సాధారణ వాణిజ్య కేంద్రాల్లో సైతం వ్యాపార కార్యకలాపాలు స్తంభించిపోయాయి.

అట్టహాసంగా పతంగుల ఉత్సవం

అంబారన్నంటుతున్న సంబురాలు
పిల్లలు, పెద్దల కోలాహలం
రంగురంగుల గాలిపటాలతో సందడి

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: రంగు రంగుల పతంగులు.. రకరకాల ఆకృతులు నింగీ నేలను కలుపుతూ రివ్వున ఎగిరే అంతర్జాతీయ పతంగుల పండుగ సికింద్రాబాద్‌లోని పరేడ్ మైదానంలో ఉత్సాహంగా ప్రారంభమైంది. ఈ వేడుక సరికొత్త శోభను తెచ్చిపెట్టింది. దేశ,విదేశాల నుంచి వచ్చిన పతంగుల పోటీదారులతో పరేడ్ మైదానమంతా కోలాహలంగా మారింది. ఒకవైపు స్వీట్ ఫెస్టివల్, మరో వైపు తోక ఊపుకొంటూ వయ్యారంగా నింగిని తాకే గాలిపటాలు. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా అందరికీ ఆహ్లాదాన్ని పంచుతోంది. భారీ గాలిపటాల సందడితో అంతర్జాతీయ పతంగుల ఉత్సవం వైభవంగా కొనసాగుతోంది. అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్, స్వీట్ ఫెస్టివల్‌ను ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, మంత్రి చందూలాల్, శాసనమండలి మండలి చైర్మన్ స్వామిగౌడ్ శనివారం ప్రారంభించారు. అంతర్జాతీయ స్థాయిలో కైట్ ఫెస్టివల్‌ను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో సోమవారం వరకు ఈ ఉత్సవం జరగనుంది. ఈ ఏడాది సింగపూర్, థాయిలాండ్, కొరియా, జపాన్, చైనా సహా మొత్తం పది దేశాల నుంచి కైట్ ఫ్లయర్స్ బృందాలు, భారత్‌లోని వివిధ రాష్ట్రాల నుంచి 40 కైట్ ఫ్లయర్ బృందాలు పాల్గొనటం విశేషం. ఈ ఉత్సవాల్లో తొలిసారిగా రిమోట్ కంట్రోల్‌తో పతంగులను ఎగురవేసే దృశ్యాలను చూడవచ్చు. రాత్రివేళల్లోనూ పతంగులను ఎగురవేయనున్నారు. దేశంలోనే తొలిసారి ప్రయోగాత్మకంగా అంతర్జాతీయ స్వీట్ ఫెస్టివల్ ఏర్పాటు చేశారు. మూడు రోజుల పాటు జరిగే ఫెస్టివల్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన దాదాపు వెయ్యి రకాల స్వీట్లు కొలువు దీరాయి. కాకినాడ ఖాజా, బందరు లడ్డూ, పదిరకాల పాయసాలు, ఖుర్బానీ కా మీఠా - తెలంగాణ, పూతరేకులు - ఆంధ్రప్రదేశ్, ఖాప్సే- అరుణాచల్ ప్రదేశ్, నారికోల్ - అసోం, రసగుల్ల - బెంగాల్, మైసూర్ పాక్ - కేరళ, పొంగల్ - తమిళనాడు, బాసుంది - గుజరాత్, గేవర్ - రాజస్థాన్, మోదక్ - మహారాష్ట్ర, బలుషాహి - ఉత్తర ప్రదేశ్, ఖాజా - బీహార్, షప్త - జమ్మూ కాశ్మీర్, అనర్స - జార్ఖండ్, గోంద్ కే లడ్డు - హర్యానా, మావ బటి - మధ్యప్రదేశ్, బబ్రూ - హిమాచల్ ప్రదేశ్, పిన్ని - పంజాబ్ వంటి ప్రత్యేకమైన స్వీట్లు నగరవాసులకు నోరూరిస్తున్నాయి. మొత్తంగా అన్ని ప్రాంతాల రుచులతో నగరంలోనే మినీ ఇండియాను చూడవచ్చని అధికారులు అంటున్నారు. హైదరాబాద్‌లో స్థిరపడిన గుజరాతీలు, బెంగాలీలు, రాజస్తానీలు, కేరళ, తమిళనాడు, కర్ణాటక అసోసియేషన్స్ మిఠాయిలను ప్రదర్శిస్తున్నాయి. ప్రతి మిఠాయిని ఇంట్లో తయారు చేయడం విశేషం. మిఠాయిలకు గిరాకీ ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున విక్రయశాలలు ఏర్పాటు చేశారు. రాష్ట్ర భాషాసాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో డప్పుల దరువులు, కోలాటాలు, గంగిరెద్దులు, హరిదాసులు, బుడబుడకలు వంటి సాంస్కృతిక కళారూపాలను, జానపద, కూచిపూడి, ఆంధ్రనాట్యం, పేరిణి శివతాండవం, భరతనాట్యం వంటి శాస్త్రీయ నృత్య రూపకాలను ప్రదర్శించారు. కాగా, నగరానికి చెందిన ఆనంద్ రెడ్డి 0.5 గ్రాముల వెండితో గాలిపటాన్ని తయారు చేసి ఔరా అనిపించాడు. ఆనంద్‌రెడ్డి గాలి పటాల దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. అక్కడికి వచ్చిన వారంతా వెండి గాలిపటాన్ని చూసి ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

బినామీలపై ఐటీ కొరడా

• దేశవ్యాప్తంగా 900 కేసులు • రూ. 3500 కోట్ల ఆస్తుల జప్తు



న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా బినామీ ఆస్తుల లావాదేవీలకు సంబంధించి 900 కేసులు నమోదు చేసినట్లు ఆదాయపు పన్ను శాఖ ప్రకటించింది. ఈ కేసుల్లో రూ.3,500 కోట్లకు పైగా విలువ చేసే స్థిర, చరాస్తులను జప్తు చేసినట్లు వెల్లడించింది. 2017 నవంబరు1 నుంచి బినామీ ఆస్తుల లావాదేవీల నిషేధ చట్టం అమల్లోకి వచ్చిన విషయాన్ని గుర్తు చేస్తూ, అప్పటి నుంచి ఈ తరహా లావాదేవీలపై నిఘా ముమ్మరం చేసేందుకు దేశవ్యాప్తంగా 24 యూనిట్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. ఇప్పటి వరకు జప్తు చేసిన స్థిరాస్తుల విలువ రూ.2,900 కోట్లు కాగా, మిగతా రూ.600 కోట్లు చరాస్తులని తెలిపింది. మొత్తం కేసుల్లోని అయిదింటిలో రూ.150 కోట్లకు పైగా బినామీ లావాదేవీలను గుర్తించినట్లు తెలిపింది. ఒక కేసులో ఓ ప్రఖ్యాత రియల్ ఎస్టేట్ సంస్థ బినామీల పేరుతో రూ.110 కోట్లు విలువ చేసే 50 ఎకరాలను కొనుగోలు చేసినట్లు తేలిందని పేర్కొంది.ఇద్దరు వ్యక్తులు రూ.39 కోట్లు విలువ చేసే రద్దయిన రూ. 500, రూ.1000 నోట్లను బినామీల పేరుతో బ్యాంకుల్లో జమ చేసిందని వివరించింది. మరోవైపు ఢిల్లీలో అనుమానాస్పద ప్రైవేటు లాకర్లను తనిఖీ చేస్తున్న ఐటి బృందాలు గురువారం రూ. 20 కోట్లు విలువచేసే ఆభరణాలు, నగదు, బులియన్ పత్రాలను సీజ్ చేశాయి.

విద్యార్థుల భద్రతకు మార్గదర్శకాలు రూపొందించండి

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా పాఠశాల విద్యార్థుల భద్రతకోసం అన్ని రాష్ట్రప్రభుత్వాలు, కేంద్రపాలిత రాష్ట్రాలు జనవరి 19 లోపు మార్గదర్శకాలను రూపొందించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. విద్యార్థుల భద్రతకోసం ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాన్ని ఇద్దరు లాయర్లు దాఖలు చేయడంతో సుప్రీం కోర్టు పై విధంగా స్పందించి, కేసును ఈనెల 23కు వాయిదా వేసింది.

ఇప్పటికే హర్యానా, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్‌లు వాటి స్పందనను దాఖలు చేశాయి. గురుగావ్‌లోని ర్యాన్ అంతర్జాతీయ పాఠశాలలో రెండవ తరగతి విద్యార్థి ప్రద్యూమన్ ఠాగోర్ హత్య నేపథ్యంలో ఈ పిటిషన్ దాఖలైంది.



పల్లెలకు సంక్రాంతి శోభ

• ఇంటిల్లిపాది ఆనందహేల
• పిల్లల కేరింతలు, హరిదాసు కీర్తనలతో సందడి



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : సంక్రాంతి పండుగ శోభతో గ్రామాలన్నీ కళకళలాడుతున్నాయి. సంక్రాంతి కాంతులు... బోగి మంటలు...గాలిపటాలు... రంగుల హరివిల్లులు... ఆప్యాయ పలకరింపులు...ప్రతి ఇంటా పిండి వంటలు...అతిథులకు మర్యాదలు... మహిళలు ప్రత్యేక పూజలు...పిల్లల కేరింతలు...హరిదాసు కీర్తనలు... గంగిరెద్దుల విన్యాసాలు...యువతుల ఉయ్యాలలు... ప్రత్యేక వస్త్రాలంకరణలు...కొత్త అల్లుళ్ల రాకతో పులకించిపోతున్నాయి. సంక్రాంతి అంటేనే రాష్ట్రవ్యాప్తంగా సందడే... సందడి. నవధాన్యాల గొబ్బిళ్లతో గ్రామ సీమలు నూతన శోభను సంతరించుకున్నాయి. సంక్రాంతి వెలుగులు జీవితంలో కొత్త జిలుగులు ప్రసాదించాలని ప్రతి ఒక్కరూ ఆకాంక్షిస్తున్నారు. 'బోగిల్లో... బోగిల్లో... బోగా భాగ్యాల్లో... మా ఇంట్లో' అన్న పాటలు పల్లె సీమలను ముంచెత్తుతున్నాయి. అమ్మమ్మల ఆప్యాయతలు, నానమ్మల మురిపాలతో పల్లెల్లోని ఇళ్లు ఆనంద పరవళ్లకు వేదికలయ్యాయి. ఇళ్లకు పంట వచ్చిన వేళ ప్రతి ఇంట్లో సంక్రాంతి వెలుగులు దర్శనమిస్తున్నాయి. ప్రత్యేకించి కోనసీమ పరవశంలో మునిగిపోయింది. సంక్రాంతిని భారీ ఎత్తున చేసుకోవడం కోనసీమలో ఆనవాయితీ. ఉద్యోగ రీత్యా గ్రామాల నుండి వెళ్లిన ఇతర ప్రదేశాలు, రాష్ట్రాలు, దేశాల్లో స్థిరపడిన వారు తిరిగి తమ తమ సొంత గ్రామాలకు రావడంతో వారి కుటుంబ సభ్యుల ఆనందానికి అవధులే లేకుండా పోతున్నాయి. చిన్నాపెద్దా తారతమ్యం లేకుండా ఒకరినొకరు ఆత్మీయ ఆలింగనాలతో కుశలప్రశ్నలతో యోగక్షేమాలు తెలుసుకుంటున్నారు. వారం రోజుల పాటు జరిగే పండుగ సంబరాల్లో వృద్ధులు సైతం పిల్లలుగా మారిపోతు న్నారు. తమ తమ గ్రామాల అభివృద్ధికి ఏ విధంగా సహకరించ గలమో ఆ విధంగా సహకరిస్తారని కొందరు హామీ ఇస్తున్నారు. ఇక కోడి పందేల జోరు ప్రారంభమైంది. గతంలో సంప్రదాయంగా జరిగే ఈ పందేలు నేడు జూదంగా మార డం శోచనీయం. పందేలపై ఎన్ని ఆంక్షలున్నా అవి కొనసాగుతూనే ఉన్నాయి. ఈసారి సుప్రీంకోర్టు తీవ్రంగానే స్పం దించింది. కోళ్ల పందేలు నిర్వహించడానికి వీల్లేదని, ఇవి జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని, డీజీపీని స్పష్టంగా కోర్టు ఆదేశించింది. ఉభయ గోదావరి జిల్లాల్లో పందెంరాయుళ్లపై పోలీసులు కొరఢా ఝుళిపిస్తు న్నారు. ఇప్పటికే పలుచోట్ల బరులను ధ్వంసం చేశారు. పలువురిని అదుపులోకి తీసుకొని బైండోవర్ కేసులు పెట్టారు.



వీధి విక్రయదారుల సమస్యలు పరిష్కరించాలి

ఏఐటీయూసీ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా నగరాలు, పట్టణాల్లో రహదారుల వెంబడి తిరుగుతూ వివిధ వస్తువులు అమ్ము కొని జీవనం సాగిస్తున్న లక్షలాది మంది వీధి విక్రయదారుల సమస్యలను పరిష్కరించాలని ఆంధ్ర ప్రదేశ్ వీధి విక్రయదారుల కార్మిక ఫెడరేషన్ (ఏఐటీయూసీ) డిమాండ్ చేసింది. శనివారం ఫెడరేషన్ నేతలు గుంటూరులోని మెప్మా మేనేజింగ్ డైరెక్టర్ పి.చినతాతయ్యను కల్సి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ టి.వెంకటేశ్వరరావు వీధి వ్యాపారులు పడుతున్న ఇబ్బందులు, వారి సమస్యలను ఆయనకు వివరించారు. జన సంచారం వున్న ప్రదేశాల్లో వీధి వ్యాపారులకు హాకర్ జోన్ షెడ్‌లు నిర్మించాలని కోరారు. వీరికి ఎటువంటి షెల్టర్ లేకపోవడం వల్ల ఎండకు ఎండి, వానకు తడిసి అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. అలాగే వారికి గుర్తింపు కార్డులు జారీ చేయాలని, వీరితో పాటు డ్వాక్రా సంఘాల్లో వున్న వీధి వ్యాపారులను కూడా గుర్తించి వ్యక్తిగత రుణాలు అందజేయాలని కోరారు. లేనిపక్షంలో పెట్టుబడిదారులకు వడ్డీలు చెల్లించలేక అప్పులపాలై తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు పాలవుతున్నారని వివరించారు. రోజువారీ ఆశీళ్ళను రద్దు చేసి న్యాయస్థానాల ఆదేశాల మేరకు వసూలు చేయాలని విజ్ఞప్తి చేశారు. వీరికోసం ప్రత్యేకంగా సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేసి ఆదుకోవాలని కోరారు. దీనిపై మెప్మా ఎండీ సానుకూలంగా స్పందించారని, ఈనెల 17న అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వీధి విక్రయదారుల సమస్యలు చర్చించి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వెంకటేశ్వరరావు తెలిపారు.

అక్రమ అరెస్టుకు వామపక్షాల ఖండన

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : పెత్తందార్ల దాడిలో గాయపడిన గుంటూరుజిల్లా పెదగొట్టిపాడు గ్రామ దళితులను పరామర్శించడానికి వెళుతున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలను అరెస్ట్ చేయడాన్ని వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండించాయి. ఈమేరకు శనివారం సంయుక్తంగా ప్రకటన విడుదల చేశాయి. నూతన సంవత్సరం సందర్భంగా అగ్రకుల పెత్తందార్ల ప్రాంతంలో జరిగిన ప్రమాదాన్ని సాకుగా చూపి దళిత పేటలపై దాడులు చేసి కొందరిని గాయపరచడమే కాకుండా మొత్తం దళిత కుటుంబాలపై అప్రకటిత సాంఘిక బహిష్కరణ కొనసాగడాన్ని తీవ్రంగా పరిగణించాయి. దళితులపై దాడి చేసిన పెత్తందార్లను ఇంతవరకూ అరెస్టు చేయకుండా తిరిగి దళితులపై అక్రమ కేసులు పెట్టి పోలీసులు పెత్తందార్ల కొమ్ముకాస్తున్నారని నేతలు విమర్శించారు. బాధితులను పరామర్శించడానికి వెళుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి కృష్ణయ్యను అరెస్టు చేశారని తెలిపారు. రాష్ట్ర కమిటీ సభ్యులు పాశం రామారావుతోపాటు మరో నలుగురిని శుక్రవారం నుంచి గుంటూరు పోలీస్‌స్టేషన్‌లోనే నిర్బంధించారన్నారు. గుంటూరు, మంగళగిరి, రాజధాని ప్రాంతాల్లో సీపీఎం కార్యకర్తలు, నాయకులు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు గద్దె చలమయ్య సహా దాదాపు 75 మందిని అరెస్టు చేసి వివిధ పోలీస్‌స్టేషన్లలో నిర్బంధించారన్నారు. అరెస్టు చేసిన నాయకులను వెంటనే విడుదల చేయాలని, దళితులపై దాడి చేసిన పెత్తందార్లపై కేసులు నమోదు చేయాలని, దళితులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని వామపక్ష పార్టీలు డిమాండు చేశాయి. ప్రకటన చేసిన వారిలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు వై వెంకటేశ్వరరావు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నేత వై సాంబశివరావు, సీపీఐ(ఎంఎల్) నేత గుర్రం విజయకుమార్, ఎంసీపీఐ (యు) నేత ఎం వెంకటరెడ్డి, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ బి బంగార్‌రావ్, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నేత చిట్టిపాటి వెంకటేశ్వర్లు, ఎస్‌యూసీఐ (సి) నేత బీఎస్ అమర్‌నాథ్, ఫార్వర్డ్‌బ్లాక్ నేత పీవీ సుందరరామరాజు, రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ నేత జానకి రాములు ఉన్నారు.



గడువులోగా రోడ్లు, వంతెనలు పూర్తిచేయాలి

ఏడీసీ సీఎండీ లక్ష్మీపార్థసారథి

విశాలాంధ్ర-అమరావతి : రాజధాని అమరావతిలో జరుగుతున్న రహదారులు, వంతెనల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని అమరావతి అభివృద్ధి సంస్థ సీఎండీ డి.లక్ష్మీపార్థసారథి అధికారులను ఆదేశించారు. కృష్ణాయపాలెం నుంచి నెక్కల్లు వరకు ప్యాకేజి -13లో జరుగుతున్న ఇ-8 రహదారి నిర్మాణ పనులను శనివారం పరిశీలించి అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ రహదారి మార్గంలో విట్ (వెల్లూర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ), అమరావతి సెంట్రల్ పార్క్ నిర్మాణాలు జరుగుతున్నందున రహదారులు, వంతెన నిర్మాణాలను ప్రాధాన్యంగా తీసుకొని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కృష్ణా కరకట్ట నుంచి నిడమర్రు వరకు నిర్మిస్తున్న యన్-10, తాళ్లాయపాలెం నుంచి నిడమర్రు వరకు నిర్మాణంలో ఉన్న యన్-8 రహదారులు, ఆయా రహదారుల మధ్య నిర్మిస్తున్న ప్రధాన వంతెనల నిర్మాణాలకు కలుగుతున్న ఆటంకాలను గుత్తేదారులను అడిగి తెలుసుకున్నారు. యన్‌హెచ్-10, యన్‌హెచ్-8 రహదారులు, వంతెనల నిర్మాణాలకు ఎలాంటి ఇబ్బందులు లేనప్పటికీ నిర్మాణాలలో ఆలస్యం ఎందుకు జరుగుతోందని ప్రశ్నించారు. ఫిబ్రవరి లోగా రహదారుల నిర్మాణాలను పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం మోదుగుల్లంకపాలెం, ఐనవోలు తదితర గ్రామాల్లో పర్యటించి ముఖ్యమైన రహదారుల నిర్మాణాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ పర్యటనలో ఏడీసీ సూపరింటెండెంట్ ఇంజనీర్ యం.వి.సూర్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నరసింహమూర్తి, డీఈఈలు వీరనారాయణ, ఇలంగోవన్‌లు ఉన్నారు.

సొంతూరికి సీఎం

• మూడు రోజులు నారావారిపల్లెలోనే మకాం
• సంక్రాంతికి ఇంటింటా ఆనందం వెల్లివిరియాలంటూ చంద్రబాబు శుభాకాంక్షలు



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన సొంత గ్రామమైన నారావారిపల్లెకు శుక్రవారం సాయంత్రం చేరుకున్నారు. ఉదయం తిరుపతిలో ఐటీ కంపెనీలను ప్రారంభించిన సీఎం సాయంత్రానికి సొంత గ్రామానికి బయలు దేరారు. సంక్రాంతి పండుగను సొంతూరులో జరుపుకోవడం సీఎం కుటుంబం ఆనవాయితీ. దీనిలో భాగంగా కుటుంబసభ్యులతో తరలివెళ్ళిన చంద్రబాబు మూడు రోజులు స్వగ్రామంలో సంక్రాంతి సంబరాలు జరుపుకోనున్నారు. అనంతరం ఈనెల 16న తిరిగి అమరావతి వస్తారు. ఈసందర్భంగా సీఎం చంద్రబాబు అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, తెలుగులోగిళ్లలో ఏడాదంతా ప్రతిరోజూ ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షిస్తూ రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రకటన విడుదల చేశారు. అలాగే దేశ, విదేశాల్లోని తెలుగువారికి కూడా ఆయన భోగి, మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పేదవాళ్లు కూడా సంతోషంగా ఈ పెద్దపండుగ చేసుకోవాలన్న ఉద్దేశంతోనే 'చంద్రన్న సంక్రాంతి కానుక'ను పంపిణీ చేశామని పేర్కొన్నారు. సంక్రాంతి ప్రధానంగా రైతుల పండుగ అని, పంట ఇంటికి చేరిన సందర్భంలో ప్రకృతికి కర్షకులు నివేదించే కృతజ్ఞతల పండుగ అని చంద్రబాబు అభివర్ణించారు. సూర్యుడు దక్షిణాయనం నుంచి ఉత్తరాయణంలోకి ప్రవేశించే పుణ్యకాలమని ముఖ్యమంత్రి అన్నారు. సాగు వ్యయాన్ని తగ్గించడం, ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం, అనుబంధ రంగాలకు ప్రాధాన్యాన్నిస్తూ కోటి ఎకరాల్లో ఉద్యానపంటలు పండించడం తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇంటికి చేరిన ధాన్యరాశులతో తెలుగు లోగిళ్లు కళకళలాడుతున్నాయని చెప్పారు. పట్టిసీమ ద్వారా 3 ఏళ్లలో కృష్ణా డెల్టాలో 13 లక్షల ఎకరాల్లో రూ.18 వేల కోట్ల విలువైన పంట ఇంటికి చేరిందని గుర్తు చేశారు. జీవన సమరంలో ఎక్కడో దూరాన ఉంటూ పెద్ద పండుగ సందర్భాన్ని పురస్కరించుకొని లక్షలాదిమంది జన్మభూమికి తరలివచ్చారని, ఇది మన కుటుంబ వ్యవస్థ గొప్పతనమన్నారు. ఇటీవల ముగిసిన ఐదో విడత 'జన్మభూమి-మాఊరు' కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేసిన ప్రజానీకానికి, అధికారులు, సిబ్బందికి క ృతజ్ఞతలు తెలిపారు. వ్యవసాయంలో వృద్ధిరేటు జాతీయస్థాయిలో 2.5% ఉంటే, ఆంధ్రప్రదేశ్‌లో 20.6% నమోదవ్వడం విశేషమని, అదీ రాష్ట్రంలో గత ఏడాది 30%, ఈ సంవత్సరం 12.5% వర్షపాతం తక్కువగా ఉన్నా ఇలాంటి ఫలితాలు సాధించడం మరింత ఉత్తేజాన్ని అందిస్తోందని తెలిపారు. వ్యవసాయంతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. 45% వృద్ధిరేటుతో ఆంధ్రప్రదేశ్ ఆక్వా హబ్‌గా నిలవడం రాష్ట్రానికి గర్వకారణమని చెప్పారు. అరకోటి సంఖ్యతో దేశంలో మరే రాష్ట్రంలో ఇవ్వనన్ని సామాజిక భద్రత పెన్షన్లు ఇస్తున్నామని, రైతు సంక్షేమానికి నిబద్ధతతో పని చేస్తూ దశలవారీగా రూ.24 వేల కోట్ల రుణమాఫీ చేశామని వివరించారు. రాష్ట్రాన్ని కరువు రహిత రాష్ట్రంగా చేస్తామని మూడేళ్ల నాడు చెప్పిన మాటల్ని నిజం చేస్తున్నామని, కృష్ణా జలాలతో రాయలసీమలో చెరువులను నింపామని తెలిపారు. అనంతపురం జిల్లాలో నిండిన చెరువులను చూస్తే సముద్రాన్ని చూసినంత సంతోషంగా ఉందన్నారు. పట్టిసీమ పథకం విజయస్ఫూర్తితో కృష్ణా-గోదావరి-పెన్నానదులు అనుసంధానం చేస్తామని, మహా సంగమాన్ని సృష్టిస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు.

విభజన హామీలను మంట కలుపుతున్న బాబు : బొత్స



విశాలాంధ్ర బ్యూరో- హైదరాబాద్: విభజన చట్టంలోని హక్కు లను వద్దనే అధికారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి ఎవరిచ్చారని వైసీపీ నాయకుడు బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో చంద్ర బాబు ఏ అంశాలు చర్చించారో ప్రజలకు వెల్లడించాలని డిమాండు చేశారు. పోలవరం ప్రాజెక్ట్ నిధుల గురించి ఏమైనా హామీ తెచ్చారా అని ప్రశ్నించారు. విభజన చట్టంలోని ఏ ఒక్క అంశానికి హామీ తెచ్చినట్లు చెప్పలేకపోతున్నారని, చంద్రబాబు నాలుగేళ్లలో రాష్ట్రానికి ఏం సాధించారో చెప్పాలన్నారు. శనివారం పార్టీ కేంద్ర కార్యాలయం లోటస్‌పాండ్‌లో బొత్స విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు ప్రధాని మోడీని కలిసింది స్వార్థ రాజకీయాల కోసమేనా అని మండిపడ్డారు. 20 అంశాలను ప్రధాని దృష్టికి తీసుకెళ్లానని చంద్రబాబు చెబుతున్నారని, గతంలో ప్రధానితో చెప్పిన అంశాలను సీఎం మళ్లీ చెబుతున్నారని అన్నారు. దుగరాజుపట్నం పోర్టు నిర్మాణం విభజన చట్టంలో ఉందని, ఒకవేళ పోర్టు ఇవ్వకపోతే రెండు ఎకనమిక్ జోన్స్ ఇవ్వాలని అడుగుతున్నారని, పోర్టుతో పాటు ఎకనమిక్ జోన్స్ అడిగితే బాగుంటుందని బొత్స సూచించారు. పోర్టు ఇవ్వకపోయినా పర్వాలేదని చంద్రబాబు అనడం దారుణంగా ఉందన్నారు. దుగరాజుపట్నం పోర్టును ఎందుకు తాకట్టు పెడుతున్నారని నిలదీశారు. ప్రత్యేక హోదా కోరి ప్యాకేజీ కావాలన్నారని, ఇప్పుడు ప్యాకేజీ కింద కూడా ఏం రాలేదంటున్నారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు వ్యవహరిస్తున్న తీరును ప్రజలు గమనిస్తున్నారని, త్వరలోనే ఆయనకు ప్రజానీకం తగిన బుద్ధి చెబుతుందని బొత్స తెలిపారు.

వీఆర్‌ఏల జీతం రూ.10,500కి పెంచండి

సీఎంకు అసోసియేషన్ నేత గోపాలకృష్ణారావు వినతి



విశాలాంధ్ర బ్యూరో- విజయవాడ : స్థానిక సీఎం క్యాంపు కార్యాలయంలో బుధవారం రాష్ట్ర విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు జె. గోపాల కృష్ణారావు సీఎం చంద్రబాబునాయుడును కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్స్ నెల జీతాలను రూ.6,000 నుంచి రూ.10,500కు పెంచాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అనంతరం ముఖ్యమంత్రి తన అభ్యర్థనపట్ల సానుకూలంగా స్పందించారని కృష్ణారావు మీడియాకు చెప్పారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఆయనతోపాటు అసోసియేన్ ప్రతినిధులు జి.సుందరరావు, ఎన్.శేషు తదితరులు ఉన్నారు.

లంచం కేసులో నలుగురి అరెస్ట్

విశాలాంధ్ర-విజయవాడ : లంచం తీసుకుంటూ చిక్కిన కమర్షియల్ టాక్స్(స్టేట్ టాక్స్, విజిలెన్స్ విభాగం) అడిషనల్ కమిషనర్ యు.ఏడుకొండలును అరెస్ట్ చేసినట్లు ఏసీబీ అధికారులు శనివారం ప్రకటించారు. ఒక కంపెనీకి సంబంధించిన సబ్సిడీ సొమ్ము రిలీజ్ కోసం కమర్షియల్ టాక్స్(స్టేట్ టాక్స్, విజిలెన్స్ విభాగం) అడిషనల్ కమిషనర్ యు.ఏడుకొండలు లంచం తీసుకుంటూ శుక్రవారం ఏసీబీకి చిక్కిన విషయం తెలిసినదే. ఈ క్రమంలో ఏడుకొండలుతోపాటు ఈడుపుగల్లులోని కమర్షియల్ టాక్స్ కమిషనర్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న సూపరింటెండెంట్(రిఫండ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్) కె.అనంతరెడ్డి, ఐటీడీ సెమెంటేషన్ ఇండియా లిమిటెడ్ కంపెనీ కన్సల్టెంట్, న్యాయవాది ఐ.గోపాలశర్మ, ఐటీడీ సెమెంటేషన్ ఇండియా లిమిటెడ్ కంపెనీ డెప్యూటీ మేనేజర్(అకౌంట్స్) కె.సత్యనారాయణను కూడా అరెస్ట్ చేసినట్లు వివరించారు. వారి నుంచి రూ.25.70లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.


పోంజి స్కామ్‌లో రూ.472 కోట్ల ఈడీ అటాచ్‌మెంట్

న్యూఢిల్లీ : పీఏసీఎల్ (రియల్ ఎస్టేట్) పోంజి స్కాంలో రూ. 472 కోట్లు అటాచ్‌మెంట్ చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోమవారం వెల్లడించింది. మనీలాండరింగ్‌కు పాల్పడినందుకు ఆస్ట్రేలియాలోని కంపెనీ ఆస్తులను కూడా అటాచ్ చేశామన్నారు. పీఏసీఎల్ గ్రూప్ డైరెక్టర్లు, అధికారులపై 2015లో సీబీఐ ఎఫ్‌ఐఆర్ నమోదు చేసింది. మనీలాండరింగ్ నిరోధక కేసులో మీ రిసోర్ట్స్ గ్రూప్ 1 లిమిటెడ్‌తోపాటు, శాంక్చువరీ కోవ్ ప్రోపర్టీస్ ఇన్ ఆస్ట్రేలియా ఆస్తులను కూడా అటాచ్ చేసినట్లు వివరించారు. కేంద్ర, రాష్ట్ర విచారణ సంస్థలు ఈ సంస్థపై దర్యాప్తు చేపట్టాయి.



పెట్టుబడిదారుల నుంచి అనధికారంగా కోట్ల రూపాయలు ఈ సంస్థ వసూలు చేసిందని కాపిటల్ మార్కెట్ రెగ్యులేటర్ 'సెబీ' మొదట గుర్తించింది.

3న విశాఖలో సామూహిక హనుమాన్ చాలీసా మహాయజ్ఞం



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: పర్యావరణ పరిరక్షణ కోసం ఫిబ్రవరి 3వ తేదీన విశాఖపట్నంలోని రామకృష్ణ బీచ్‌లో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్లు అవధూత, దత్తపీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానందస్వామి తెలిపారు. సముద్ర హారతి తోపాటు 4న స్టీల్‌ఫ్యాక్టరీలో నాదోపాసన జరుగుతుందన్నారు. విజయవాడలోని దత్తపీఠంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచంలోని ప్రజలు నదుల కాలుష్యం, ప్రకృతి కాలుష్యంతోపాటు వరదలు, తుపాన్లు, హరికేన్లు, టోర్నడోలు, సునామీల వంటి విపత్తులను ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఈ విపత్తులనుంచి రక్షించాలని కోరుతూ హనుమాన్ చాలీసా మహాయజ్ఞాలను దేశంలోని వివిధ ప్రాంతాలతోపాటు విదేశాల్లోనూ నిర్వహిస్తున్నట్లు వివరించారు. నదీకాలుష్య నివారణకు వారణాసిలో గంగాహారతి, రాజమహేంద్రవరంలో గోదావరి, విజయవాడలో కృష్ణా హారతి కార్యక్రమాలు ఇప్పటికే జరుగుతున్నాయని తెలిపారు. విశాఖలో జరిగే కార్యక్రమంలో ప్రకృతి కాలుష్య నివారణకు 50 వేల మొక్కలను పంపిణీ చేయనున్నట్లు స్వామీజీ పేర్కొన్నారు.

జడ్పీ చైర్మన్ బాపిరాజుపై సీఎం ఆగ్రహం

• మంత్రి మాణిక్యాలరావు, బాపిరాజుల వివాదంపై మంత్రులతో కమిటీ



విశాలాంధ్ర-అమరావతి : పశ్చిమ గోదావరి జిల్లా బీజేపీకి చెందిన మంత్రి మాణిక్యాలరావుకు, ఆ జిల్లా జడ్పీ చైర్మన్ ఎం.బాపిరాజుకు మధ్య జరుగుతున్న వర్గపోరుపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శనివారం ఆరా తీశారు. పార్టీకి చెందిన సీనియర్ నాయకులతో మాట్లాడి మంత్రి, జడ్పీ చైర్మన్ల మధ్య నెలకొన్న వివాదం, ఉభయులు బహిరంగంగా పత్రికలకు ఎక్కి సవాళ్లు విసురుకోవటం, ఇతర పూర్వాపరాలను సీఎం తెలుసుకున్నారు. మంత్రి మాణిక్యాలరావు, జడ్పీ చైర్మన్ బాపిరాజుల మధ్య చాలా కాలంగా వర్గపోరు నడుస్తోంది. ఇద్దరు నాయకుల వర్గాలు బహిరంగంగా విమర్శించుకోవటంతో పాటు ఒకరి కార్యక్రమాలకు మరొకరు దూరంగా ఉంటూ వస్తున్నారు. నియోజకవర్గంలో, జిల్లాలో అభివృద్ధి పనుల నిధుల కేటాయింపుల విషయంపై కూడా ఇద్దరి మధ్య బేధాభిప్రాయాలు తీవ్రమయ్యాయి. టీడీపీ నేతల చర్యలతో తీవ్ర అసహనానికి గురైన మంత్రి మాణిక్యాలరావు మూడు రోజుల క్రితం రామన్నగూడెం సభలో బాపిరాజు ఆయన అనుచరుల వ్యవహారశైలిపై బహిరంగంగా విమర్శలకు దిగారు. మంత్రి విమర్శలకు అక్కడి మున్సిపల్ చైర్మన్ మరికొందరు మంత్రిని విమర్శించారు. వారికి తోడు బాపిరాజు మంత్రిని టార్గెట్ చేస్తూ శనివారం విమర్శలకు దిగారు. మంత్రిని తాను అగౌరవపరచ లేదంటూనే మంత్రి అవినీతికి పాల్పడ్డారని, టీడీపీ నాయకులపై కేసులు పెట్టించారని ఆరోపించారు. ఇలా మిత్రపక్షం బీజేపీకి చెందిన మంత్రి, సొంత పార్టీకి చెందిన జెడ్పీ చైర్మన్ విమర్శలతో రోడ్డెక్కటం ముఖ్యమంత్రిని తీవ్ర అసహనానికి గురి చేసింది. శుక్రవారం సీఎం చంద్రబాబు ప్రధాని మోడీని కలిసి రాష్ట్రానికి సంబంధించిన అంశాలతో పాటు రెండు పార్టీల నేతలు వ్యవహరించాల్సిన అంశాలపై చర్చించి వచ్చారు. అదే రోజు బాపిరాజు, మంత్రి మాణిక్యాలరావును విమర్శించటం సీఎం దృష్టికి వచ్చింది. దీంతో బాపిరాజు, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసరావులపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటానని సీఎం హెచ్చరించి మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, కొల్లు రవీంద్ర, పిఠాపురం ఎమ్మెల్యే వర్మలతో త్రిసభ్య కమిటీని నియమించి సమగ్ర వివరాలతో వెంటనే నివేదిక ఇవ్వాలని చంద్రబాబు ఆదేశించారు. మొత్తం మీద బీజేపీ నాయకులతో టీడీపీ నేతలు సఖ్యతగా ఉండాలని, పశ్చిమ గోదావరి జిల్లా వ్యవహారంపై మండిపడ్డ సీఎం తన పార్టీ నేతలకు చెప్పకనే చెప్పినట్లయింది.

సంపాదకీయం

సంక్రాంతి పథం

సంక్రాంతి... తెలుగు జాతి సంస్కృతికి చెరగని సంతకం.. మనిషి తన మూలాలను వెదుక్కుంటూ ఉరుకులుపరుగులు పెట్టే హృదయోల్లాసం.. పొట్టచేతబట్టుకొని ఉన్న ఊరును, కన్నతల్లిని వదిలి వెళ్లిన వలస పక్షులు సొంత గూటికి చేరుకొనే శుభాగమనం.. ధనికపేద తేడాలేకుండా ప్రతి ఇంట్లో, ప్రతి కంట్లో ఆనందాల వెలుగులు నింపే వేడుక.. కర్షక స్వేదం ధాన్యపురాసులుగా ఇంటికి చేరే పంటల పర్వదినం.. ఏరువాక నుంచి కుప్పనూర్పిళ్ల వరకూ తన కష్టంలో కాడిగాసి బండ చాకిరీచేసిన బసవన్నలకు పసుపు కుంకుమలద్ది రైతన్న కృతజ్ఞత తెలిపే పశువుల పండగ. జీవావరణం, పర్యావరణానికి ప్రతీక. ఒక్కమాటగా చెప్పాలంటే జనజీవన నవ కాంతి ఈ సంక్రాంతి. ఆధునిక కాలంలో సంక్రాంతికి ఎన్ని అర్థాలు, నిర్వచనాలు చెప్పుకొన్నా.. మనిషి సేద్యయాగానికిదొక శ్రీకారం. జనానికి ఇంత అన్నం పెట్టేందుకు రైతన్న యుగయుగాలుగా సాగించిన అవిశ్రాంత కృషి ఫలించిన రోజు. మనిషి జీవితాన్ని క్రమబద్ధం చేసే సవిత్రుడు గతిని, రాశిని మార్చి తద్వారా జనగతిని నిర్దేశించే మహత్తర ముహూర్తమే సంక్రాంతి. ఆచార సంప్రదాయాలు, శాస్త్రీయ విజ్ఞానం, పర్యావరణం, వినోదం, వేడుకలు, సర్వప్రాణి హితం వగైరాలన్నీ కలగలసిన అపూర్వ, అద్భుత పర్వదినం. అందుకే జనజీవన నవకాంతి సంక్రాంతి అన్నారు. 'స్వర్ణవర్ణ సుప్రభాత స్రవంతి, నిఖిలలోక మహా వైజయంతి' అని పేర్కొన్నారు.

'ప్రాణాములొడ్డి ఘోర గహ/నాటవులన్ బడగొట్టి, మంచి మా/గాణములన్ సృజించి, ఎము/కల్ నుసిజేసి పొలాలు దున్ని' ప్రపంచానికి అన్నం పెట్టడమే కాదు, నాగరికతకు నడకలు నేర్పాడు రైతన్న. విత్తును మొలకగా మార్చి మొక్కగా పెంచి ఉత్పత్తికి మూలబీజంగా నిలిచిన సంపద సృష్టికర్త రైతన్నే ఏ జాతికైనా వెన్నెముక. క్రాంతి అంటే మార్పునకు తొలి అడుగు. మానవ చరిత్రలో సరికొత్త మార్పునకు కారణమైందే సంక్రాంతి. ఇది మనిషిని కష్టజీవిగా మార్చింది. ప్రకృతి ప్రకోపానికి నష్టపోయినా మళ్లీ నిలదొక్కుకోవడం ఎలాగనే ఆశను విత్తింది. ప్రకృతిని తన వశం చేసుకొనే గుండె దిటవును నేర్పింది. మనిషిలో స్వాభిమానాన్ని రగిల్చింది.. స్వార్థాన్నీ అలవర్చింది. ఈ స్వార్థం ఆత్మగౌరవాన్ని ప్రోదిచేసేదే గానీ తోటి మనిషిని పీక్కుతినేది కాదు. ఇలా మనిషి ఆలోచనను, నడవడికను సమూలంగా మార్చేసింది. సంక్రాంతి అంటే కేవలం కాలానికి చెందిన మార్పుగానే చూడకూడదు.. సంచార జీవిగా ఉన్న మనిషికి స్థానికతను ఆపాదించి జీవితంలో పెనుమార్పును తీసుకొచ్చిన ఓ అద్భుతంగా పరిగణించాలి. వరదలకు పేరుకుపోయిన ఒండ్రుమట్టిలో విత్తులు చల్లి ధాన్యం పండించిన తొలి సేద్యగాడు ఎవరో.. అతనికి మనందరం రుణపడి ఉన్నాం. నృపాలురు సైతం పొలం పనుల్లో పాలుపంచుకొనేవారని పురాణాల కథనం. మిథిల మహారాజు జనకుడు స్వయంగా సీతాయజ్ఞం ఆరంభించిన వైనాన్ని వాల్మీకి రామాయణం గొప్పగా వర్ణించింది. అంతేకాదు, యాచించి బతకడం తలవంపులుగా ఉందని, మడిచెక్కనైనా దానం పట్టమని ఆదిభిక్షువు చెవిలో పార్వతీదేవి పోరుపెడుతుంది. మిత్రుడు కుబేరుణ్నడిగి విత్తులు, బలరాముడినడిగి నాగలి, యమధర్మరాజు నుంచి దున్నలు తెచ్చి త్రిశూలం సాయంతో వ్యవసాయం చేసి గౌరవంగా బతుకు దామని ఆ గౌరమ్మ ఆశపడింది. మనిషి స్వయంగా తన బతుకు తెరువు తానే చూసుకోవాలనే కాంక్షను ఈ సంక్రాంతి ప్రోది చేసిందన్నమాట. వాస్తవానికి ప్రపంచ చరిత్రలో వచ్చిన తొలి విప్లవం ఇదే. అదే వ్యవసాయ విప్లవం లేదా సస్యవిప్లవం. పారిశ్రామిక విప్లవం వచ్చి మనిషికి సర్వసుఖాలు అందించినా మనిషిని దోపిడీదారుడిగా మార్చేసింది. ప్రకృతిని వివర్ణంచేసింది. ప్రపంచాన్ని కాలుష్యకాసారంగా మార్చే సింది. మనిషి మనుగడకే ముప్పు తెచ్చిపెట్టింది. వ్యవసాయ విప్లవం వల్ల ఇటువంటి విపత్తులేవీ మనిషికి ఎదురుకాలేదు. ప్రకృతి పచ్చదనపు పైటవేసేందుకు, మనిషి కష్టించి, సుఖించేందుకు దోవ చూపింది. దానిలో ప్రకృతిపై ప్రేమ ఉంది, ఆరాధన ఉంది, అదే సమయంలో దానిపై పట్టు ఉంది. ప్రకృతికి, మనిషికి విడదీయలేని ఇచ్చిపుచ్చుకొనే అనుబంధం ఉంది. 'కొర్రు గుచ్చిన దేశమందు కరవులుంటాయా? దుక్కి దున్నిన దేశమందు దు:ఖముంటుందా? కాపు నడిచిన భూమి మీద ఏపు తగ్గుతుందా? అన్న పాట ప్రతి మనిషి నోటిలో నానేది. ఏరువాకమ్మా ఏం కావాలి అని అడిగితే.. 'ఎర్రెర్రని పూలమాలలు, ఎరుపుతెలుపుల మబ్బుటెండలు, పొలం గట్టున టెంకాయవడపప్పులు' అంటూ సమాధానమిస్తుందని పేర్కొ న్నారో కవి. అయితే ఇవాళ పరిస్థితి మారింది. రైతు బతుకు సమస్యల సుడిగుండమైంది. పాలకుల పుణ్యమా అని సాగు అంటే చావుకు పర్యాయపదంగా మారి పోయింది. అయినా రైతు ఆశాజీవి. కృషితోనాస్తి దుర్భిక్షం అనేదాన్ని మనసావాచా నమ్ముతున్న ప్రాణి. భూమాతను గుడ్డిగా నమ్ముకొన్న అమాయక బిడ్డ. ఈ ప్రపంచంలో రైతుకు మించిన ఆశాజీవి వేరెవరూ ఉండరంటే అతిశయోక్తి కాదు.

సంక్రాంతి సుందరి ఒంటరిగా రాదు. మహారాణిలాగా.. మంచును, చలిపులిని తరిమికొట్టే మంటల కిరీటంతో ముందు భోగిని, వెనుక కనుమ, దానివెంట ముక్కనుమను వెంటబెట్టుకొని చెలికత్తెల నడుమ రాకుమార్తెలా వస్తుంది. వాస్తవానికి ధనుర్మాసారంభంలోనే నెల పట్టండహో అంటూ దండోర వేసుకొంటూ పండగ శోభ వచ్చేస్తుంది. ఇన్ని విలక్షణాల మేలి కలయిక అయినందునవల్లే 'శింజాన మధుర మంజుల/ మంజీరములయ్యె తెలుగు మాగాణమ్ముల్/ పుంజీభవించె నవనవ సంజీవ సమగ్ర సస్య సౌభాగ్యంబుల్' అని కవి గళాలు మార్మోగాయి. ముంగిట్లో ముగ్గులు, గొబ్బిళ్లు, హరిలో రంగ హరీ అని పాడుకుంటూ తిరిగే హరిదాసులు, గంగాధరుడిలా భావించే గంగిరెద్దులవారితో పల్లెలన్నీ పండగశోభను సంతరించుకుంటాయి. నిండు గాదెల్లాగా రైతుగుండె నిండుగా ఉండే నిజమైన పండగ ఇది. సరదాలు, సందళ్లు, మురిపాలు, ముచ్చట్లు అన్నింటిని పొదివిపట్టుకొచ్చే పర్వదినంగా నిలిచింది. 'మాలిన్యం మలగిపోవ, మాత్సర్యం తొలగిపోవ/ దౌర్భాగ్యం తరలిపోవ, చీకట్లవి చెదరిపో' మానవులు చేసే యత్నాలే భోగిభాగ్యాలని కరుణశ్రీ పేర్కొన్నారు. చుక్కచుక్కను కలిపి గీతగీతను పేర్చి ముత్యాల రంగవల్లులు తీర్చిదిద్ది మధ్య 'సుబ్బి గొబ్బెమ్మా శుభములివ్వవె' అంటూ గొబ్బెమ్మలను పెట్టి ఆడపిల్లలు పాడే పాట పర్యావరణ ప్రాముఖ్యతను చాటుతోంది. సంక్రాంతిలో ఓ మెరుపు, ఓ సంబరం ఉంది. నిండు గాదెల్లా రైతు గుండెలు నిండుగా ఉండే వేళ కోడిపందేలు, కోడెదూడల పరుగుపందేలు, పిల్లల గాలిపటాలు.. ఒక్కటేమిటి ఎన్నెన్ని సందళ్లు, ఎంతకీ తరగని సంతోషాలు. సంక్రాంతి విందు మళ్లీ ఏడాది వరకూ గుర్తుండిపోతుంది. పిండివంటలు, ఆత్మీయుల అనురాగపు కబుర్ల మధ్య చేసే ఆ విందు మాటల్లో చెప్పలేని రుచికరంగా ఉంటుంది. భోగి సాయంత్రం పిల్లలకు భోగిపళ్లు పోయడం, బొమ్మల కొలువులు తీర్చిదిద్దడమూ ఓ చక్కని అనుభూతే. భోగిపండ్లు పోయడం ఆయురారోగ్యాలకు చిహ్నం. భోగిమంటల్లో పాత వస్తువులు దగ్ధం చేయడం పనికిరాని పాతభావాలు వదిలించుకొని మంచినిచ్చే కొత్తదనం వైపు సాగడానికి సంకేతం. కలతల చీకట్లను దూరాలకు తరిమే భోగిమంటలు, నేలానింగీ దూరాల్ని కలిపే దారాల గాలిపటాలు మనిషిలో నూతనోత్సాహాన్ని, పోరాటతత్వాన్ని నింపేవే. 'పరిగ పంట'లో 'లేగటి పాలలో గ్రాగి మాగిన తీయ/ తీయ కప్పూర భోగి పాయసంబు/ చవులూరు కరివేప చివులాకులతో గమ/గమలాడు పైర వంకాయకూర/ తరుణ కుస్తుంబరీ దళ మైత్రిమై నాల్క/త్రుప్పుదుల్చెడు నక్కదోస బజ్జి, ముదురు గుమ్మడిపండు పులుసు, జిడ్డుదేరిన వెన్నెల గడ్డ పెరుగు' అంటూ నోరూరించేలా వర్ణించారు. 'కాంతి శాంతి సుఖమ్ము భాగ్యమ్ము నొసగు/ విజయ సంక్రాంతి లక్ష్మి శోభిల్లు లెమ్ము/ బహువిధారిష్టములు భస్మీపట మగును/ కొత్త వెలుగుల జగతి తళుకొత్తుసుమ్ము' అని కవిగారు దీవించారు. మూడోరోజు పశువులను శుభ్రంగా కడిగి పసుపు కుంకుమతో అలంకరించి మెడలో పూలమాలలు వేసి కడుపునిండా మేతపెట్టి పూజిస్తారు. నాలుగోరోజు ముక్కలేనిదే ముద్దదిగని మాంసాహార ప్రియులకు సందడే సందడి. ప్రతి ఇల్లు మసాల వాసనల గుబాళింపులే. ఈ పండగకు పేద, ధనిక, కులమతాల తేడాలు లేకుండా అందరూ ఆనందోత్సవాల నడుమ ఉత్సాహంగా గడుపుతారు. 'ఒకచో సంధ్యావందనం, ఒకచో పురాణపఠనం, ఒకదెస స్నానపానాదులు, మరో దిశ భూగోదానాదులు, ఒక ఇంట ఆటపాటలు, మరో ఇంట విందు విశ్రాంతులు'గా ఈ నాలుగు రోజులు గడిచిపోతాయి. 'శీత గాలి వీచినప్పుడు లేత ఎండలా/ ఎండ కన్ను సోకినప్పుడు మంచు కొండలా' ఈ సంక్రాంతి రోజులు కనిపిస్తాయి. 'పువ్వుల తావిలోన, పసిబుగ్గల నిగ్గుల చంటిపాప చి/ర్నవ్వుల మోవిలోన, రసరాగిణి పిల్లనగ్రోవిలోన' అందాన్ని, ఆనందాన్ని అనుభవించేందుకు అవకాశం లభించే రోజులివి.

సంక్రాంతి అంటే రైతుల పండగ. కానీ 'ఈ ధారభూమి మధురాధరాన/ అమృతమొలికిస్తున్న హాలికుడికి ఇదమిత్థంగా దక్కుతున్నదేమిటి?' అన్న ప్రశ్నకు మన పాలకుల వద్ద సమాధానా ల్లేవు. అన్నదాత ఇంట కరవు కరాళ నృత్యమా? తెలుగు రైతు స్వేదం చిమ్మి చేసే సేద్యయాగంలో సస్య సౌభాగ్యములు చేతి కందినప్పుడే అసలు సిసలైన సంక్రాంతి.. సిరుల సంక్రాంతి!

విశ్లేషణ

మోడీ సర్కారు గాలిబుడగలు - భాగం 6

వ్యవసాయంలో సంక్షోభం



మర్ల విజయ కుమార్

భారత దేశంలో నివసిస్తున్న 130 కోట్లమంది ప్రజలలో, దాదాపు 87 కోట్లమంది వ్యవసాయం, వ్యవసాయ ఆధారిత వృత్తులపై ఆధారపడి జీవిస్తున్నారు. కాని దేశ స్థూల ఉత్పత్తిలో వ్యవసాయం భాగం 13 శాతం మాత్రమే. దేశంలోని రైతులలో నేటికీ 85 శాతానికి పైగా చిన్న ,సన్నకారు రైతులే. దేశంలో ఉత్పత్తి అయ్యే మొత్తం అహార ధాన్యాలలో సగానికి పైగా ఈ చిన్నరైతులే పండిస్తున్నారు. ఒకప్పుడు. అంటే మోడీ ప్రభుత్వం రాకముందు సాలుకు మూడు శాతానికి పైగా ఉన్న వ్యవసాయరంగ అభివృద్ధి గత మూడేళ్ళలో 1.7 శాతానికి పడిపోయింది. గత మూడున్నర ఏళ్లలో పారిశ్రామిక ఉత్పత్తి, ఎగుమతులు అడుగంటాయి, కాని వాటికంటే అధమ స్థితిలో వ్యవసాయం ఉన్నది. బీజేపీ పాలనలో వ్యవసాయంపైన, గ్రామీణ అభివృద్ధిపైన ఖర్చు చేసిన మొత్తాలు రాను రాను తగ్గుముఖం పట్టి, నేడు కనిష్ఠస్థాయిలో ఉన్నాయి. సహకార సంస్థలను పూర్తిగా నీరుకార్చి, గ్రామీణ బ్యాంకు అప్పులు దాదాపుగా అధమ స్థాయికి చేరాయి. రైతులు గత్యంతరంలేక రక్తంపీల్చే వడ్డీవ్యాపారులనుండి అప్పులు తీసుకుని, అవి అనతికాలంలోనే అధిక మొత్తాలుగా పెరిగిన తరువాత, ఇక ఉన్నకాడికి పొలాలు అమ్ముకుని, పట్టణాలకు కూలీలుగా తరలిపోవటం తప్ప వేరే గత్యంతరం లేని పరిస్థితి నెలకొని ఉన్నది. ఈ విధంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలటానికి మూలకారణం గత 27 ఏళ్లుగా, కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు ప్రపంచ బ్యాంకుకు, ఇతర ప్రపంచ వ్యాపార సంస్థలకు దాసోహమని, వారికి దేశాన్ని అడ్డంగా దోచుకోవటానికి ద్వారాలు బార్లగా తెరవటమే ప్రధాన కారణం. ఈ నయా ఉదారవాద విధానాల పర్యవసానాలు మనం ఇక్కడ చర్చిద్దాం.

1991లో నయాఉదారవాద విధానాలు అమలు జరపటం మొదలు పెట్టిన ప్రభుత్వం, ప్రపంచీకరణ, పోటీమార్కెట్లు, విదేశీ పెట్టుబడులద్వారా దేశం త్వరితగతిని అభివ ృద్ధి సాధిస్తుందని పెద్ద ఎత్తున ప్రచారం ప్రారంభించారు. ప్రపంచ మార్కెట్లకు సరుకులు ఉత్పత్తిచేయనిదే, వ్యాపార పంటలు పండించనిదే దేశాభివృద్ధి అసాధ్యమని నమ్మబలికారు. వ్యాపార పంటలకు నీరు, ఎరువులు, పురుగుల మందులు ఎక్కువగా వాడాలి. బహుళ జాతి సంస్థలు అమ్మే బీటీ విత్తనాలు వాడితేనే ఎగుమతులకు అవసరమయ్యే పంటలు పండిచగలమని రైతులను ఈ ఊబిలోకి లాగటంతో, పెట్టుబడిదారీ పద్ధతులలో కాంట్రాక్టు వ్యవసాయాలతో, భూములు నిస్సారమై, సాంప్రదాయ పంటలకు అనువుగాకుండా పోయింది. మొత్తంగా వ్యవసాయమే కుప్పకూలే దుస్థితి ఏర్పడింది. దేశ ఆర్థిక వ్యవస్థ 8, 9 శాతం స్థాయిలో పెరుగుతోందని, అంటే అనతికాలంలో అన్నివర్గాల ప్రజలకు ఈ అభివృద్ధి ఫలాలు అందుతాయని ప్రచారం జరిగింది. కాని గత పావు శతాబ్దంలో ఈ విధానాల ఫలితాలు తేటతెల్లమయ్యాయి. ఈ ప్రచారం మొత్తంలో ఎక్కడా దేశ అవసరాలకు అనుగుణగా వస్తూత్పత్తి, ఆహార ఉత్పత్తి గురించి మాట్లాడినవారులేరు. గోలంతా, ప్రపంచమార్కెట్లలో వాటా, లాభాల గురించే. ఈ కాలంలో దేశ సంపద పెరిగింది కాని, ఈ పెరుగుదల అభివృద్ధి రూపం దాల్చలేదు. దేశంలో అపర ధనికుల ఆస్థులు వందల రెట్లు పెరిగాయి. దేశ జనాభాలో 90 శాతం ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందక పోగా, వారి ఆదాయాలు అడుగంటి, వారి జీవన స్థితిగతులు దయనీయమయ్యాయి. ఈనాడు భారత దేశం చరిత్రలో ఎన్నడూ కనీవిని ఎరుగని స్థాయిలో సంపద తారతమ్యాలు పెరిగిపోయాయి. అపరధనికులైన 1 శాతం మంది చేతిలో 58 శాతం సంపద పేరుకున్నది. అట్టడుగున ఉన్న 80 శాతం మంది ప్రజలకు 10 శాతం సంపద అందుబాటులో ఉన్నది. ఒకప్పుడు స్వయంసమృద్ధి గలిగిన గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలింది. వ్యవసాయ మార్కెట్లు, ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు బడా కంపెనీల, బహుళ జాతి సంస్థల హస్తగతమయ్యాయి. ఈనాడు మొత్తం వ్యవసాయ భూములలో 58 శాతం ధనికరైతుల, బడాకంపెనీల చేతుల్లోకి చేరింది. కోట్లాదిగా రైతులు తమ భూములను పోగొట్టుకుని, కూలీలుగా మారిపోతున్నారు. పంటలకు అయ్యే ఖర్చుకు 50 శాతం ఎక్కువ మద్దతు ధర ఇస్తేనే, కొంతలో కొంత రైతుకు ఊరట లభిస్తుందని ప్రముఖ వ్యవసాయ శాస్త్రజ్ఞుడు ఎంఎస్. స్వామినాథన్ ఇచ్చిన ప్రతిపాదన ఆధారంగా, మోడీ 2014 ఎన్నికల్లో తమ ప్రభుత్వం 150 శాతం మద్దతుధర ఇస్తానని నమ్మబలికాడు. కాని అధికారంలోకి వచ్చాక ప్రపంచ బ్యాంకు, వాణిజ్య సంస్థలు పెట్టిన అంక్షలు తెలియవచ్చి, ఆ విధంగా మద్దతు ధర పెంచటం సాధ్యం కాదని తోకముడిచాడు. కనీస మద్దతుధర పెంచితే మార్కెట్లకు నష్టం వస్తుందని కుంటిసాకులు చెప్తొన్న ఈ అబద్ధాల వెనుక అసలు రహస్యం ఏమిటంటే, వ్యవసాయ సబ్సిడీలు, చవకలో రైతులకు రుణాలు ఇవ్వకూడదని అంతర్జాతీయ సంస్థలు పెట్టిన అంక్షలకు ఈ ప్రభుత్వాలు తలవొగ్గటమే అసలు కారణం. ఈనాడు దేశంలోని రైతులు బ్రతికే మార్గంలేక రోడ్డెక్కారు. పండించిన పంటలకు ఖర్చులకు తగిన ఆదాయం కూడా లభించటం లేదని వారు గగ్గోలు పెడుతున్నారు. రైతుల వద్దనుండి టమాటాలు, ఉల్లి, బంగాళా దుంపలు కిలో 2 రూపాయలకు, అంతకంటే తక్కువకు బడావ్యాపార సంస్థలు కొనుగోలుచేసి, మార్కెట్లో సామాన్యుడికి కిలో 40, 50 రూపాయలకు చొప్పున అమ్మి, లాభాలు అడ్డంగా పిండుకుంటున్నారు. పైగా రైతుకు ఇచ్చే ఆ రెండురూపాయలలో ఎరువులకు, పురుగుల మందులకు, విత్తనాలకు మినహాయించుకుని, మొండిచేయి చూపిస్తున్నారు ఈ బడావ్యాపారులు. అంటే వ్యవసాయంలో ఉత్పత్తి అయిన సంపద, కష్టించిన రైతుకు దక్కకుండా, మధ్య దళారీలకు, బడా వ్యాపార సంస్థల పరమవుతున్నది. ప్రపంచ మార్కెట్లకు ఎగుమతులకోసం వ్యాపార పంటలు పండించాలని రైతులపై తెచ్చిన ఒత్తిడి ఫలితంగా, వ్యవసాయ ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయి. విత్తనాలు, పురుగుల మందులు, ఎరువుల వాడకం పెరిగి, వాటి ధరలు మిన్నంటడంతో, రైతులకు వచ్చే ఆదాయానికి గండిపడుతోంది. మరొక పక్కన, వ్యవసాయ ఖర్చులకు అవసరమైన రుణాలు బ్యాంకులనుండి లభించక పోవటంతో, వడ్డీ వ్యాపారులను ఆశ్రయించవల్సి వస్తోంది. పెరిగిన ఖర్చులు తీర్చేసరికి, రైతు ఆదాయం మాట అటుంచి, అప్పులు తీర్చటానికి కూడా రైతువద్ద డబ్బులు మిగలడం లేదు.



దానితో పొలాలు అమ్ముకుని, పట్టణాలకు తరలి వెళ్తున్నారు. అదికూడా చేయలేనివారు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇప్పటి వరకూ అధికారిక లెక్కల ప్రకారమే, మూడులక్షల ఇరవై వేలమంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. తన పేరున భూమి కలిగి ఉన్న వ్యవసాయదారులను మాత్రమే రైతులుగా లెక్కవేస్తారు. కాని సగానికి సగం మంది వ్యవసాయంచేసే వారు కౌలు రైతులు. ఇక స్త్రీలు కూడా జీవనాధారం కోసం, భర్త చనిపోతే సొంతగా వ్యవసాయం చేసుకుంటున్నవారు ఉన్నారు. ఈ విధంగా వ్యవసాయం చేసే వారికి అధికారిక లెక్కల ప్రకారం అప్పులుగాని, సబ్సిడీలుగాని దొరకవు. అందు చేత, వీరిలో ఆత్మహత్యలు చేసుకునేవారిని అధికారిక లెక్కలలో చేర్చరు. బడ్జట్‌లో చూపించకపోయినా, బ్యాంకులు గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయానికే కాక, ఇతర అన్ని రకాల అవసరాలకోసం ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్న 10 లక్షల కోట్ల రూపాయలను వ్యవసాయ సబ్సిడీలుగా లెక్కవేసి, రైతుకు తామేదో ఒరగబోసినట్లుగా ఈ ప్రభుత్వం అబద్ధాలమీద అబద్ధాలు చెబుతోన్నది. పోనీ ఈ 10 లక్షల కోట్లు ఎక్కడికి పోయాయి అని ఆచూకీతీస్తే, అందులో అత్యధిక భాగం ఆగ్రో కంపెనీలకే చేరుతోందని తెలుస్తోంది. ఎంతో ఆర్భాటంగా పంటల బీమా పథకాన్ని ప్రారంభించిన ఈ ప్రభుత్వం, ఆ బీమా పథకాలను ప్రైవేటు కంపెనీల చేతుల్లో పెట్టింది. ఫలితంగా పంట నష్టాలకు, లక్షలకోట్ల రూపాయల బీమా చెల్లించవలసి ఉండగా, గత ఏడాది కేవలం 13,200 కోట్ల రూపాయలు బీమా చెల్లింపులు జరిగాయి. ఆ సొమ్ములు కూడా అంతిమంగా ఆగ్రో కంపెనీలకే చేరాయిగాని, పేదరైతుకు దక్కిందేదీ లేదు. గ్రామీణ ఉపాధి పథకాన్ని నీరుగార్చి, నిధులు విధిలిస్తుండటంతో అది కూడా గ్రామీణ దుస్థితిని చక్కదిద్దలేక పోయింది.

వేరొక పక్కన, అప్పులబారినపడి నిస్సహాయ స్థితిలో ఉన్న రైతన్నలకు రుణమాఫీ చేస్తానని బీజేపీ బీరాలు పలికి, ఉత్తర ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి, తీరా రుణమాఫీ మాటికొచ్చే సరికి, రైతులపై వికృతమైన పద్ధతిలో, కొన్ని పైసల నుండి రెండు రూపాయల వరకూ రుణమాఫీ ప్రకటించి, రైతుల ఆగ్రహానికి గురైంది యూపీ ప్రభుత్వం. ఈలోగా అన్ని రాష్ట్రాల్లోనూ రుణమాఫీ అయితే రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించాయిగాని, మీ సొమ్ములు మీరే ఏర్పాటుచేసుకోండని కేంద్రం చేతులు కడిగేసుకున్నది. ప్రతిఏటా, వ్యవసాయ ఖర్చులకు రైతుకు రుణాలు అవసరమవుతాయి. రైతుల నిజ ఆదాయాన్ని పెంచనిదే. ఈ రకమైన ప్రచారార్భాటాలు రైతన్నలను ఏవిధంగానూ ఆదుకోలేవు. ఒక ఏడాది నిజంగా మాఫీ చేసినా, మరుసటి ఏడు తిరిగి అప్పులు చేయవలసిందే కదా! పైగా, బ్యాంకుల రుణాలు అడుగంటడంతో, రైతులు అధిక వడ్డీలకు వ్యాపార సంస్థలనుండి, వడ్డీ వ్యాపారుల నుండీ తీసుకునే అధిక వడ్డి అప్పులకు ఊరట లేనంతకాలం వారి కష్టాలు గట్టెక్కవు. రైతులకు వడ్డీ వ్యాపారుల నుండీ, ప్రైవేటు వ్యాపార సంస్థల నుండీ విముక్తి లభించనిదే వారి బ్రతుకులు బాగుపడవు.

ప్రపంచీకరణ ప్రారంభమైన నాటి నుండి కోట్లాది మంది రైతులు తమ భూములను పోగొట్టుకుని, వ్యవసాయ కూలీలుగానూ, పట్టణాలకు వలస కూలీలుగానూ తరలిపోతుండటంతో, మొత్తం సాగుభూమిలో 58 శాతం నేడు ధనిక రైతుల, బడా వ్యవసాయ క్షేత్రాల వశమైంది. ఇక గ్రోత్ కారిడార్లు, సెజ్‌లు, డెవలప్‌మెంటు జోన్లు పేరుతో రైతులనుండి లాక్కున్న, లాకోవటానికి సిద్ధమవుతున్న భూములు మొత్తం సాగుభూములలో 40 శాతం వరకూ ఉండవచ్చునని, ఇది ఇంగ్లాండు విస్తీర్ణానికి రెట్టింపు అని ఆర్థికవేత్తలు చెప్తున్నారు. అంటే, దేశంలో ఆహారధాన్యాల ఉత్పత్తులను నీరుగార్చి, విదేశాలనుండి చౌకగా గోధుమలు, ధాన్యం, పప్పుదినుసులు, నూనె గింజలు ప్రైవేటు కార్పొరేషన్లు దిగుమతి చేసుకునేందుకు రాజమార్గాన్ని కల్పించటమే. తత్కారణంగా భారత దేశం ఆహార స్వయం సమృద్ధి బడా కార్పొరేషన్ల ధన దాహానికి బలి అవుతుందనటంలో ఏమాత్రం సందేహించనక్కరలేదు. దేశప్రజల ఆహార భద్రతను గాలికి వదిలివేసి, గ్రామాలలో సైతం ప్రైవేటు కార్పొరేషన్ల వ్యాపారాలు విస్తరించటానికి పంపిణీ వ్యవస్థలో 100 శాతం విదేశీ పెట్టుబడులను ఆహ్వానించటం ద్వారా, చిన్న వ్యాపారస్థుల నోట మట్టి కొట్టి, మొత్తం దేశంలోని వ్యాపారాన్ని, అంటే సాలుకు 1.5 కోట్ల రూపాయల విలువైన ఆర్థిక లావాదేవీలను బడా ప్రైవేటు కార్పొరేషన్ల పరంచేస్తే, కోట్లాదిమంది జీవనోపాధిని కోల్పోయి, ఆకలిచావుల బారిన పడటం తప్ప, వేరే మార్గం ఉండదు. చాప క్రింద నీరులాగా, ఇంత కుట్రలు ఒక పక్కన చేస్తూ, బయ టికి మాత్రం రైతుల ఆదాయాన్ని ఐదేళ్లలో రెట్టింపు చేస్తానని అబద్ధానికి తెరతీస్తున్నాడు మోడీ. నేడు సాధారణ రైతు సగటు ఆదాయం నెలకు 1,666 రూపాయలుగా ప్రభుత్వం లెక్క వేసింది. అంటే, ఈ ఉత్తర కుమారుడు ఆ అదాయాన్ని రెట్టింపు, అంటే నెలకు 3,300 రూపాయలు చేస్తాడన్నమాట. మరి పెరుగుతున్న ధరల సూచికను పరిగణలోకి తీసుకుంటే, నిజ ఆదాయం రానున్న ఐదేళ్లలో నాలుగవ వంతుకు పడిపోయినా ఆశ్చర్యం లేదు. మన్మోహన్ సింగ్‌తో సహా ప్రముఖ ఆర్థిక వేత్తలు అనేక మంది, రైతుల ఆదాయాలు రెట్టింపు కావాలంటే, వ్యవసాయ వృద్ధిరేటు కనీసం 15 శాతం దాటి ఉండాలని, మొత్తం ఆర్థిక వ్యవస్థ 35 శాతం జీడీపీ వృద్ధి రేటును వచ్చే ఐదేళ్లలో సాధించి, నిలబెట్టుకుంటేనే, వ్యవసాయ వ ృద్ధిరేటు 15 శాతానికి చేరగలుగుతుందని చెప్తున్నారు. మన దేశ జీడీపీ వ ృద్ధిరేటు అత్యధికంగా 9 శాతానికి చేరినా, గత 10 ఏళ్ళలోసగటు వృద్ధిరేటు 7 శాతానికి మించలేదు. ఈ ఏడాది మన జీడీపీ 6.5 శాతానికి తగ్గిపోవచ్చునని 'ద హిందు' పత్రిక ఈమధ్యనే వెల్లడించింది. కరెన్సీ రద్దు నిర్వాకం కారణంగా, మన ఆర్థిక వ్యవస్థ తిరిగి పూర్వపు స్థాయికి కోలుకోవటానికి కనీసం పదేళ్లు పట్టవచ్చునని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. అటువంటి దశలో, ఆర్థిక వ్యవస్థలోని అన్ని రంగాలూ నీరసించి, రోజురోజుకూ తీసికట్టుగా మారుతూండటంతో, మనం చరిత్రలో కనీవినీ ఎరుగని 35 శాతం వృద్ధి రేటును, 1.7 శాతంగా ఉన్న వ్యవసాయ వృద్ధిరేటును 15 శాతానికి పెంచటం కలలో కూడా సాధ్యం కాదు. రైతుల ఆదాయాలను నిజంగా పెంచాలంటే, వారి రక్తాన్ని తాగుతున్న జలగలను ముందుగా పక్కన పెట్టాలి. ఎరువులు, పెస్టిసైడ్లు, విత్తనాల వ్యాపారం ప్రైవేటుపరం కాకుండా, ప్రభుత్వం సహాయంతో సహకార సంస్థల ద్వారా నిర్వహించాలి. ఈనాడు వ్యవసాయానికి ఇచ్చే సబ్సిడీలలో 96 శాతం వరకూ ఈ బడా వ్యాపారుల చేతుల్లోకే వెళ్తోంది. ఇక గ్రామీణ సహకార బ్యాంకులను పటిష్టంచేసి వడ్డీ వ్యాపారుల కబంధ హస్తాల నుండి రైతుల చెర విడిపించి, వారికి సులభ రుణాలు అందేటట్లు చేయగలిగితే, రైతు ఆదాయాలు, రెట్టింపేమి, 10 రెట్లు కూడా పెరగగలవు. నిరక్షరాస్యులుగా ఆకలితో అలమటిస్తూ, ఈదేశ ప్రజలు నిరుద్యోగంతో, దారిద్ర్యంతో తీసుకుంటూంటే, కొద్ది మంది మాత్రమే అపరధనికులు, వారికి వత్తాసుపలికే బూర్జువా పార్టీల నాయకులు అపరిమితంగా తమ సంపదను పెంచుకుం టున్నారు. పచ్చకామెర్ల రోగిలాగా, తాము బాగుపడుతున్నాం కనుక, దేశం మొత్తం వెలిగి పోతోందని అబద్ధపు కబుర్లు చెప్తోంటే, ఆకలితో మాడుతున్న ప్రజలు త్వరలో వీరికి తగిన బుద్ధి చెప్తారు.

(7వ భాగం వచ్చేఆదివారం)

-వ్యాస రచయిత : అఖిల భారత అభ్యుదయ వేదిక జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు.
సెల్ : 09848933545

ఇ-మెయిల్

సంక్రాంతి చిట్కాలు

సంక్రాంతి శుభాకాంక్షలు చెప్తారు గానీ ఈ చిట్కాలు ఏమిటంటారా. అయితే వినండి, ఇప్పుడివే అవసరం.

- ఆవు పిడకలు దొరకడం లేదా? అమెజాన్‌లో ఆర్డరివ్వండి. అయితే పాలు కన్నా పిడకలే ప్రియం. గుర్తుంచుకోండి.
- మంటలకు దుంగలు, దుక్కలు లేవా? ఓ రెండు పార్టీల మేనిఫెస్టో బుక్కులడగండి. అవి ఎటూ పనికిరానివే.
- మంటలు పుట్టడం కష్టమా? ఓ రెండు ఛానల్స్‌ని పిలవండి. ఈజీగా అగ్గి రాజేస్తారు.
- ఏటీఎంలో డబ్బు దొరకలేదా? ఆ పేరుతో షాపింగ్ ఖర్చు తగ్గించెయ్యండి.
- కొమ్మదాసరి కోతలు వినిపించలేదా? అదీ చెప్పాలా? నేతల హామీలు, భరోసాలు చాలవా?
- పెద్దలకు బట్టలు చూపించడం కుదరలేదా, సమయానికి ఏటీఎంలు కనికరించక. పోనీ ప్లాస్టిక్ కార్డులు, భీమ్ ఆప్‌లు, చూపిస్తే సరిపోతుందేమో కనుక్కుందాం.
- కోడిపుంజులు కాలు దువ్వడం లేదా? ఒక దానికి ట్రంప్, మరో దానికి కిమ్ అని పేరుపెట్టేయండి. తన్నుకు చస్తాయి.

ఇంకొన్ని చిట్కాలు చెప్పేవాడినే కానీ, అసలే మీ మూడ్ బాగున్నట్టు లేదు. ప్రస్తుతానికి ముగిస్తూ మరొక్కసారి పండగ శుభాకాంక్షలు చెప్పేస్తా.

-డా. డి.వి.జి.శంకరరావు, మాజీ ఎంపీ, పార్వతీపురం

దేశాలు - సైనిక వ్యయాలు - అణ్వస్త్రాలు

ప్రపంచ పోలీసుగా వ్యవహరిస్తూ, అన్ని దేశాలపై ఆధిపత్యాన్ని సాధించాలని ఆలోచించే సామ్రాజ్యవాద అమెరికా సైనిక వ్యయంలో ప్రపంచ దేశాలన్నింటిలోకి అగ్రస్థానంలో ఉంది. ప్రపంచంలో ఏదొక మూల పొరుగుదేశాల మధ్య చిచ్చుపెట్టి, ఆ దేశాలకు ఆయుధాలను, ఇతర సైనిక సామాగ్రిని అమ్ముకొనే వ్యాపారాన్ని ఎన్నో సంవత్సరాలుగా కొనసాగిస్తున్నది. ఏ దేశంలోని ఖనిజసంపదపైనైనా కన్నుపడితే ఏదో సాకుతో ఆ దేశంపై అవాంఛిత యుద్ధానికి దిగి ఆ దేశంలో తిష్టవేయడం అమెరికా నైజం. ఇరాక్ విషయంలో కచ్చితంగా అదే జరిగింది. అందుకోసమే అమెరికా సైనిక వ్యయాన్ని బడ్జెట్‌లో అధికంగా కేటాయిస్తుంది. 2016లో అమెరికా సైనిక వ్యయం 611 బిలియన్ డాలర్లు. మొత్తం ప్రపంచదేశాల సైనిక వ్యయంలో ఇది 36శాతం. అయితే, 2011 నుండి మొదటిసారిగా ప్రపంచదేశాల రక్షణ వ్యయం పెరిగింది. స్టాక్ హోం ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్ (సిప్రీ) తాజా నివేదిక ప్రకారం ఆయుధాలపై ప్రపంచ దేశాల మొత్తం వ్యయం ఆర్భాటంగా 2016లో 1.686 ట్రిలియన్లకు చేరింది. ఇది 2015 వ్యయంకన్నా 0.4శాతం ఎక్కువ. అమెరికా తరువాత సైనిక వ్యయంలో 215 బిలియన్ డాలర్లతో చైనా రెండవస్థానంలో, 69.2 బిలియన్ డాలర్లతో రష్యా మూడవస్థానంలో ఉన్నాయి. సిరియాపై అమెరికా యుద్ధంతో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా ఆ ప్రాంతంలోని దేశాలు సైనిక శక్తిని పెంచుకోడానికి సైనిక వ్యయాన్ని అధికం చేయక తప్పలేదు. 2014-2015 సంవత్సరాల మధ్య అమెరికా, జపాన్, బ్రెజిల్ సైనిక వ్యయం భారీగా తగ్గిపోగా, దక్షిణకొరియా, బ్రిటన్, చైనాల రక్షణ వ్యయం భారీగా పెరిగింది. ఏడాదికి 14.7 బిలియన్ డాలర్ల చొప్పున చైనా రక్షణ బడ్జెట్‌ను పెంచింది. ప్రపంచంలో రక్షణ వ్యయం అధికంగా చేస్తున్న 25 దేశాల్లో 13 ఆసియాదేశాల మొత్తం రక్షణ వ్యయం 840 బిలియన్ డాలర్లు. కొన్ని పశ్చిమదేశాలు కూడా భారీగా సైనికవ్యయం చేస్తున్నాయి.

అణ్వస్త్రదేశాలు

ఎనిమిది సార్వభౌమాధికార రాజ్యాలు విజయవంతంగా అణ్వస్త్రాల విస్ఫోటనం జరిపాయి. అందులో ఐదురాజ్యాలు అణ్వస్త్ర వ్యాప్తి నిరోధ ఒప్పందం (ఎన్‌పీటీ) నిబంధనల క్రింద వున్న అణ్వస్త్ర దేశాలుగా పరిగణింబడతాయి. వాటిలో వరుసగా అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, చైనా ఉన్నాయి. 1970లో ఎన్‌పీటీ అమల్లోకి వచ్చినప్పటి నుండి ఆ ఒప్పందంలో పక్షాలు కాని మూడుదేశాలు భారత్, పాకిస్తాన్, ఉత్తరకొరియా అణుపరీక్షలు నిర్వహించాయి. ఇంతకు ముందు ఉత్తరకొరియా ఎన్‌పీటీలో భాగస్వామిగా ఉండేది. అయితే, 2003లో ఎన్‌పీటీ నుండి ఉపసంహరించుకొంది. ఇజ్రాయిల్ వద్ద కూడా అణ్వాయుధాలు ఉన్నాయని సాధారణంగా భావించబడుతుంది. కానీ, ఆ దేశం ఖచ్చితంగా అణుపరీక్ష జరిపిందా లేదా అన్నది తెలియదు. ఉద్దేశపూర్వకంగానే సందిగ్ధతను ఇజ్రాయిల్ కొనసాగిస్తుంది. ఇజ్రాయిల్ వద్ద 75 నుండి 400 వరకు అణుశీర్షాలు ఉన్నట్లు అంచనా వేయబడుతోంది. ఇంతకుముందు దక్షిణ ఆఫ్రికా కూడా అణ్వాయుధాలు కలిగి ఉంది. అయితే, అది ఎన్‌పీటీలో చేరడానికి ముందుకు వాటిని నిర్మూలించింది.

అణుశాస్త్రవేత్తల న్యూక్లియర్ నోట్‌బుక్ ప్రకారం ప్రపంచం మొత్తంగా 2017లో 9,220 అణ్వాయుధాలు ఉన్నట్లు అంచనా. అణ్వస్త్రాలు, అణుశీర్షికలు తమ నియంత్రణలో ఉన్నట్లు కొన్ని దేశాలు అంగీకరించాయి. ఏ సంవత్సరం పరీక్షించినదీ కూడా వెల్లడించాయి. ప్రకటించిన ఆ దేశాల జాబితాను ప్రపంచ రాజకీయాల్లో 'న్యూక్లియర్ క్లబ్'గా పిలుస్తారు. రష్యా, అమెరికా మినహా (అవి వివిధ ఒప్పందాల కింద అణుసామర్థ్య స్వతంత్ర పరిశీలనకు లోబడి ఉండే దేశాలు) కొన్ని దేశాలు విశ్వసించలేని విధంగా అంచనాలను వెల్లడించాయి. ప్రత్యేకంగా 'వ్యూహాత్మక దాడులు తగ్గింపు ఒప్పందం' కింద రష్యా, అమెరికా వేలాది అణుశీర్షాలను నిర్వీర్యం చేశాయి. 1985లో 68,000 ఉన్న క్రియాశీల ఆయుధాలు 2016 నాటికి 4 వేలకు తగ్గించబడ్డాయి. ఇప్పుడు ప్రపంచంలో మొత్తం 10,100 అణుశీర్షాలు ఉన్నాయి. అనేక ఆయుధాలను నిల్వచేయడమో లేక పూర్తిగా ధ్వంసం చేయకుండా పాక్షికంగా నిర్మూలించడం జరిగింది.

అమెరికా తన అణ్వాయుధాలను బెల్జియం, జర్మనీ, ఇటలీ, నెదర్లాండ్, టర్కీ వైమానిక స్థావరాలలో కూడా మోహరించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న విధానాలు, అనాలోచిత వెర్రి చర్యల కారణంగా యుద్ధం ఏ క్షణానైనా జరిగే ముప్పు ఉందని ప్రపంచ రాజకీయ విశ్లేషకులు, మేధావులు ఆందోళన వ్యక్తం చేశారు. రెండవ ప్రపంచ యుద్ధంలో జపాన్‌లోని హిరోషిమా, నాగసాకిలపై అణుబాంబులు వేయడం వల్ల జరిగిన విధ్వంసం, ప్రాణనష్టం, వెలువడిన అణుధార్మిత శక్తి కారణంగా అనేకమంది దివ్యాంగులుగా మారిపోయిన దుస్థితి నుండి ప్రపంచదేశాలు గుణపాఠాలు నేర్చుకొని ప్రజలు సుఖసంతోషాలతో జీవించే విధంగా ప్రపంచ శాంతి పరిరక్షణకు కంకణధారులు కావాలి. 'అణ్వస్త్రాలు కాదు- అన్న వస్త్రాలు కావాలి' అని నినదించాలి.

గణాంకం

- ఎస్కేబీ

Dwaraka

విశాలాంధ్ర

బతుకు

The Life

ఆదివారం

14 జనవరి 2018

భోగి

సంప్రదాయానికి ప్రతిరూపం మార్పునకు సంకేతం

సంక్రాంతికి ముందు రోజు భోగి. 'భోగి' పండగతో సంక్రాంతి పర్వదినాలు ఉత్సాహంగా ప్రారంభమవుతాయి. భోగి అంటే తొలినాడు అని అర్థం. దక్షిణాయనంలో ప్రజలు తాము పడిన కష్టాలను, బాధలను అగ్ని దేవుడికి ఆహుతి చేస్తూ రాబోయే ఉత్తరాయణంలో సుఖసంతోషాలను ఇమ్మని కోరుతూ వేసే మంటలు భోగి మంటలు. 'భగ' అనే పదం నుంచి భోగి అన్నమాట పుట్టిందని చెబుతారు. 'భగ' అంటే 'మంటలు' లేదా 'వేడి'ని పుట్టించడం అని అర్థం. భుగ్ అనే సంస్కృత పదం నుండి భోగి అనే పదం వచ్చింది. భోగం అంటే సుఖం.

పూర్వం ఈ రోజున శ్రీ రంగనాథస్వామిలో గోదాదేవి లీనమై భోగాన్ని పొందిందని... దీని సంకేతంగా భోగి పండగ ఆచరణలోకి వచ్చిందనేది మన పురాణ గాథ. తెలుగువారు పెద్ద పండగగా జరుపుకునే మూడు రోజుల సంక్రాంతి వేడుకలో మొదటిరోజును భోగి అంటారు. భోగి పండుగ సాధారణంగా జనవరి 13 లేదా 14 తేదీలలో వస్తుంది. దక్షిణాయనంలో సూర్యుడు రోజురోజుకి భూమికి దక్షిణం వైపుగా కొద్ది కొద్దిగా దూరమవుతూ దక్షిణ అర్ధగోళంలో భూమికి దూరం అవుట వలన భూమిపై బాగా చలి పెరుగుతుంది. ఈ చలి వాతావరణాన్ని తట్టుకునేందుకు ప్రజలు సెగ కోసం భగ భగ మండే చలి మంటలు వేసుకునేవారు. ఉత్తరాయణం ముందురోజుకి చలి విపరీతంగా పెరగడం ఈ చలిని తట్టుకునేందుకు భగ భగ మండే మంటలు అందరు వేయటం వలన ఈ రోజుకు భోగి అనే పేరు వచ్చింది. అందుకే సంక్రమణ మహాపర్వానికి ముందు రోజుకి ఒక ప్రాధాన్యం ఉంది. దీనికి భోగిపర్వం అని పేరు. అయితే భోగము అనే మాటకు అర్థం ఏమిటంటే అనుభవము అని. ఆనందంగా దేనిని అనుభవిస్తామో లేదా దేనిని అనుభవించడం వల్ల ఆనందం పొందుతామో దానిని భోగము అనాలి. అలాంటి భోగములు అనుభవించవలసిన రోజుని భోగి అంటారు. నిజమైన ఆనందాన్ని అనుభవించడమే అసలైన భోగం. ఒక్కొక్కరికి ఒక్కొక్కటి ఆనందం. ఈరోజున అమ్మ గోదాదేవి ఆండాళ్ళమ్మ రంగనాథుని చేపట్టినది. రంగనాథుని అనుగ్రహాన్ని పొందినది. రంగనాథుని సాంగత్యం అనబడేటటువంటి ఆ కైవల్యానందం అనే భోగాన్ని అమ్మ పొందినది కనుక ఈరోజు భోగి అనే పేరు భక్తి సంప్రదాయం పరంగా నిర్వచించేవారు చెబుతారు. సరిగ్గా ఈ రోజుతో ధనుర్మాసం పూర్తి అవుతున్నది. తర్వాత రోజు నుంచి మకర మాసం వస్తున్నది సౌరమానం ప్రకారంగా.

తెల్లవారుజామునే ఇంటిముంగిట రంగురంగుల రంగవల్లికలను వేసి, ఆ ముగ్గుల మధ్య పేడముద్దలతో గొబ్బెమ్మలు పెడతారు. కన్నెపిల్లలంతా గొబ్బి పాటలు పాడతారు. పాత కలప వస్తువులు భోగి మంటల్లో వేసి.. పీడ విరగడైనట్లుగా భావించే ఆచారం కొన్ని ప్రాంతాల్లో వుంది. భోగి మంటల్లో కాచిన వేడి నీళ్ళతో తలంటు స్నానం చేస్తారు. అలాగే భోగి పండుగ రోజున పులిబొమ్మ పక్కనే మేకబొమ్మ, పూరిల్లు-మేడ, రాజు-బంటు... ఇలా విరుద్ధ జీవుల మధ్య సామరస్యాన్ని, సామ్యవాదాన్ని చాటుతూ, కనువిందు చేసే బొమ్మల కొలువును తెలుగువారి లోగిళ్ళలో అలంకరిస్తారు. ఆపై ముత్తైదువులను పిలిచి, పేరంటం చేస్తారు.



మరో కథ

భోగిపండగ ఇంద్రుని గురించి చేసే పండగగా కూడా చెబుతారు. ఇంద్రుడు మేఘాధిపతి. మేఘాలు లోకానికి వర్షాలు ఇస్తాయి. పంటలు పండడానికి వర్షాలు అవసరం. సకల వర్షాల కోసం ఇంద్రుని పూజించే ఆచారం ఏర్పడింది. ఈ పూజల వలన ద్వాపరయుగంలో ఇంద్రుడికి గర్వం హెచ్చిపోయింది. అందుచేత అతనికి గర్వభంగం చేయాలని కృష్ణుడికి తోచింది. ఇంతలో భోగిపండగ వచ్చింది. యాదవులు ఇంద్రపూజకు ఆయత్తులయ్యారు. అప్పుడు వారితో కృష్ణుడు ఇలా చెప్పాడు. 'మనం గోవులను మేపుకొనేవారం. కర్షకులకువలె మనకు వర్షాలు అంతగా అక్కరలేదు. మన గోవులకు మేత ఇచ్చేది గోవర్ధన పర్వతమిది పచ్చికబయలు. కాబట్టి మనం ఈనాడు గోవర్ధన పర్వతాన్ని పూజిద్దాం. వర్షాధిపతి ఇంద్రపూజ జోలికి మనం పోవద్దు.' వారు కృష్ణుని ఈ మాటలకు అంగీకరిస్తారు. ఇంద్రపూజకు స్వస్తి చెప్పారు. గోవర్ధనగిరిని పూజించడానికి ప్రారంభించారు. ఇంద్రుడు ఇది తెలిసికొన్నాడు. అతనికి కోపం వచ్చింది. తన మేఘాలను వదిలి పెద్ద వర్షం కురిపించాడు. ఆ జడివానలో తడిసి ముద్దయిన వారు కృష్ణునితో తమ గోడు చెప్పుకున్నారు. అప్పుడు కృష్ణుడు గోవర్ధనపర్వతాన్ని ఎత్తి పట్టుకుని వారందరికీ గోవులతో సహా దాని క్రింద ఆశ్రయం కల్పించాడు. తన వద్ద ఉన్న ఏడు రకాల మేఘాలను వదిలి కూడా ఇంద్రుడు వారిని ఏమీ చేయలేకపోయాడు. దీంతో ఇంద్రుడికి గర్వభంగమై బుద్ధి వచ్చింది. కృష్ణుని మహత్తు తెలిసికొని ఇంద్రుడు పాదాక్రాంతుడయ్యాడు. కృష్ణుడు అతన్ని మన్నించి భోగిపండగనాడు మామూలుగా మళ్లీ ఇంద్రపూజ జరిగేటట్టు ఆనతి ఇస్తాడు.

భోగిపళ్లు

భోగినాడు తెల్లవారగట్లనే లేచి అభ్యంగన స్నానం చేస్తారు. ఆ స్నానంతో భోగిపీడ వదులుతుందని నమ్ముతారు. చంటి పిల్లలకు భోగిపీడ కేవలం తలంటుతోనే కాక మధ్యాహ్నం భోగిపళ్ళు పోయడంతో కాని వదలదంటారు. చంటిపిల్లలకు కొత్తదుస్తులు తొడుగుతారు. కుర్చీ మీద కూర్చోపెడతారు. రేగుపళ్లు, పైసలు, చెరుకు ముక్కలు, బంతి, చేమంతి పూలు, పాలకాయలు కలిపి తలమీద నుంచి దిగువారపోస్తారు. దీనిని బోడికలు పోయడం అని కూడా కొన్ని ప్రాంతాల్లో అంటారు. ఇట్లా చేయడం ఆపిల్లలకు ఆయుర్వృద్ధికరమై ఉంటుందని స్త్రీల నమ్మిక. సంస్కృతంలో రేగిపండును ఆర్కఫలం అంటారు. ఆర్క అంటే సూర్యుడు అని అర్థం. ఈ భోగి పండ్లు పోయడం వల్ల అవి పిల్లల శరీరం మీదుగా జారి నేలన పడతాయి. అలా భోగిపళ్లు పోయడం వల్ల పిల్లలకు చీడపీడలు అన్నీ తొలుగుతాయని నమ్ముతారు.

భోగిపండగనాడు తమిళనాట విందు భోజనాలు విరివిగా సాగుతాయి. ఆనాడు సాధారణంగా ప్రతివారు పులగం వండుకుంటారు. ఆనాడు అందరూ విరివిగా ఆటల్లో పాల్గొంటారు. తమిళనాడులో గ్రామ ఉమ్మడి స్థలాన్ని మండైవెలి అంటారు. ఆనాడు గ్రామస్తులందరూ అక్కడ చేరుతారు. అందరూ పల్లెటిపటు ఆటల్లో పాల్గొంటారు. సాయంకాలం వరకు ఆనందం గోవిందంగా కాలక్షేపం చేస్తారు.

మన బాహ్య నేత్రాలకి కనిపించని బ్రహ్మరంధ్రం మన తలపై భాగంలో ఉంటుంది. ఈ భోగి పండ్లను పోసి ఆ బ్రహ్మరంధ్రాన్ని ప్రేరేపితం చేస్తే పిల్లలు జ్ఞానవంతులు అవుతారు. రేగుపండ్లు సూర్యకిరణాలలోని ప్రాణశక్తిని అధికంగా గ్రహించి, నిల్వ ఉంచుకుంటాయి కనుక వీటిని తల మీద పోయడంతో... వీటిలోని విద్యుచ్ఛక్తి, శరీరంపై, ఆరోగ్యంపై ప్రభావాన్ని చూపించి మంచి ఫలితాలు ఇస్తాయి. అందువల్లే పిల్లలకి భోగి పండ్లు పోసి అశ్వీరదిస్తారని చెబుతారు.

కోడి పందాలు

కొన్ని ప్రాంతాల్లో భోగి రోజున కోడి పందాలు వేయడం ఒక ఆనవాయితీగా వస్తున్నది, పౌరుషానికి ప్రతీకగా ఉండే కోళ్లు పోటీలో ప్రాణాలను ఫణంగా పెట్టి పోరాడుతాయి, ఈ పోటీలను చూసేందుకు ప్రజలు ఆసక్తి కనబరుస్తారు. పోటీలో పాల్గొనే కోళ్లపై పందాలు కాస్తారు. తాహత్తుకు మించి మితిమీరిన పందాలు కాయడం వలన కలిగే అనర్థాల వలన పందాలు కాయడంపై నిషేధాంక్షలు ఉన్నాయి.

భోగి పులక

కొన్ని ప్రాంతాలలో భోగి రోజున రైతులు తమ సాగుభూమికి ఆనవాయితీగా కొంతమేర సాగునీరు పారించి తడి చేస్తారు, ఒక పంట పూర్తయిన తదుపరి మళ్ళీ పంట కొరకు సాగుభూమిలో నీరు పారించడాన్ని పులకేయడం అంటారు, ఆనవాయితీగా భోగి రోజున పులకేయడాన్ని భోగి పులక అంటారు.

భోగి మంటలు

సాధారణంగా అందరూ చెప్పేది... ఇది చలి కాలం కనుక వెచ్చదనం కోసం మంటలు వేస్తారని. కానీ నిజానికి భోగి మంటలు వెచ్చదనం కోసం మాత్రమే కాదు... ఆరోగ్యం కోసం కూడా. ధనుర్మాసం నేలంతా ఇంటి ముందు పెట్టిన గొబ్బెమ్మలను పిడకలుగా చేస్తారు. వాటినే ఈ భోగి మంటలలో వాడుతారు. దేశీ ఆవు పేడ పిడకలని కాల్చడం వలన గాలి శుద్ధి అవుతుంది. సుక్ష్మక్రిములు నశిస్తాయి. ప్రాణవాయువు గాలిలోకి అధికంగా విడుదల అవుతుంది. దాని గాలి పీల్చడం ఆరోగ్యానికి మంచిది. చలికాలంలో అనేక వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువ. ముఖ్యంగా శ్వాసకు సంబంధించిన అనేక రోగాలు పట్టి పీడిస్తాయి. వాటికి ఔషధంగా ఇది పని చేస్తుంది. భోగి మంటలు పెద్దవిగా రావడానికి అందులో రావి, మామిడి, మేడి మొదలైన ఔషధ చెట్ల బెరళ్లు వేస్తారు. అవి కాలడానికి ఆవు నెయ్యిని జోడిస్తారు. అగ్నిహోత్రంలో వేసిన ప్రతి 10 గ్రాముల దేశీ ఆవు నెయ్యి నుంచి 1 టన్ను ప్రాణవాయువు విడుదల అవుతుంది. ఈ ఔషధ మూలికలు ఆవు నెయ్యి, ఆవు పిడకలని కలిపి కాల్చడం వలన విడుదలయ్యే గాలి అతి శక్తివంతమైంది. మన శరీరంలోని 72వేల నాడులలోకి ప్రవేశించి శరీరాన్ని శుభ్రపరుస్తుంది. ఒకరికి రోగం వస్తే దానికి తగిన ఔషధం ఇవ్వవచ్చు. అదే అందరికి వస్తే అందరికి ఔషధం సమకూర్చడం దాదాపు అసాధ్యం. అందులో కొందరు వైద్యం చేయించుకొలేని పేదలు ఉంటారు. ఇదంతా ఆలోచించిన మన పెద్దలు అందరూ కలిసి భోగి మంటల్లో పాల్గొనే సంప్రదాయాన్ని తెచ్చారు. దాని నుంచి వచ్చే గాలి అందరికీ ఆరోగ్యాన్ని ఇస్తుంది. కులాలకు అతీతంగా అందరూ ఒక చోట చేరడం ప్రజల మధ్య అంతరాలను తగ్గిస్తుంది. ఐక్యమత్యాన్ని పెంచుతుంది. ఇది ఒకరకంగా అగ్నిదేవుడికి ఆరాధనా, మరో రకంగా గాలిని శుద్ధి చేస్తూ వాయుదేవునికి ఇచ్చే గౌరవం. కానీ మనం ఫ్యాషన్, సృజనాత్మకత పేరుతో రబ్బరు టైర్లను పెట్రోలు పోసి తగల బెట్టి, దాని విష వాయువులను పిలుస్తూ, కాలుష్యాన్ని చేస్తూ మన ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటున్నాం. పర్యావరణాన్ని నాశనం చేస్తున్నాం. ఉన్న రోగాలే కాక కొత్త రోగాలను కొని తెచ్చుకుంటున్నాం. ఇక భోగి మంటల్లో పనికిరాని వస్తువులను కాల్చండి అని వింటుంటాం. పనికిరాని వస్తువులు అంటే ఇంట్లో ఉండే ప్లాస్టిక్ కవర్లు, వైర్లు లాంటివి కావు. ఇక్కడ మనం చరిత్రకి సంబంధించిన ఒక విషయం గుర్తుకు తెచ్చుకోవాలి. నిజానికి భోగి మంటల్లో కాల్చాల్సింది పాత వస్తువులని కాదు... మనలోని పనికి రాని అలవాట్లు, చెడు లక్షణాలు. అప్పుడే మనకున్న పీడ పోయి మానసిక ఆరోగ్యం, విజయాలు వస్తాయి.



భోగిమంటలకు ఎక్కువగా గ్రామీణులు తాటి ఆకులను ఉపయోగిస్తారు. ఈ ఆకులను భోగికి కొన్ని రోజుల ముందే కొట్టుకొని తెచ్చి భోగిమంటల కొరకు సిద్ధం చేసుకుంటారు. అనేక ప్రాంతాలలో ప్రత్యేకంగా భోగిమంటల కొరకు తాటాకు మోపులను ఇళ్ళవద్దకే తెచ్చి విక్రయిస్తారు. వీటితో పాటు మంటలలో మండగల పనికిరాని పాత వస్తువులను ముందురోజు రాత్రికి సిద్ధం చేసుకుంటారు. తెల్లవారుజామున సాధారణంగా 3 గంటల నుంచి 5 గంటల మధ్యన ఎవరి ఇంటి ముందువారు ఈ మంటలు వేయడం ప్రారంభిస్తారు.

తెల్లవారుజామున భోగిమంటల వద్ద చలికాచుకున్న చిన్నా పెద్దలు భోగిమంటల సెగతో కాచుకున్న వేడినీటితో లేదా మామూలు నీటితో తలస్నానం చేసి కొత్తబట్టలు ధరిస్తారు. పండుగ నెలలో ముగ్గులు ప్రతిరోజు వేస్తారు, కాని భోగి రోజు ముగ్గు ఒక ప్రత్యేకత, ముగ్గువేసే వారికి ఇష్టంతో కూడిన మరింత కష్టం, సాధారణంగా ముగ్గు వేసే చోటనే భోగి మంటలు వేస్తారు, భోగి మంటల వలన చాలా కసువు తయారవుతుంది. ఆ కసువు అంతా పారబోసి కడిగి ముగ్గువేయడం కొంచెం కష్టంతో కూడుకొన్నప్పటికి ఇష్టమైన పనులు కాబట్టి చాలా ఆనందంగా చేస్తారు, రోజు వేసే ముగ్గుల కన్నా ఈ రోజు మరింత అందంగా రంగురంగుల రంగవల్లికలేస్తారు.

గొబ్బెమ్మలు

ఆవుపేడతో ముద్దల్ని చేసి, మధ్యలో వాటిమీద బంతి, చేమంతి పూరేకులను గుచ్చి వాటికి పసుపు, కుంకుమలని అద్ది గొబ్బెమ్మలను తయారుచేస్తారు. వాటి చుట్టూ తిరుగుతూ ఆడపిల్లలు పాటలు పాడి, చివరకు నైవేద్యాలు పెడతారు. గోదాదేవి గోపికలతో కలిసి ఆ కృష్ణుడిని భక్తితో సేవించింది. గొబ్బెమ్మలు గోపికలు అన్నమాట. ఆ గోపికలే గోపి బొమ్మలు, కాలక్రమంలో గొబ్బెమ్మలుగా పిలవబడుతున్నాయి. గొబ్బి+బొమ్మ= గొబ్బెమ్మ. గోపికలందరిచేత ఆరాధించబడే గోదాదేవి అన్నమాట. గొబ్బెమ్మలుగా పైకి కనిపించే వీళ్లంతా కృష్ణభక్తురాంద్రులు అన్నమాట. కాబట్టి వీటి చుట్టూ చప్పట్లు కొడుతూ, పాటలు పాడుతూ, తిరుగుతూ ఉండే బాలికలంతా తమని తాము గోపికలుగా భావించుకొని, కృష్ణుని సేవించి తరించిన గోపికలుగా ఊహించుకొని, కృష్ణుని వంటి భర్తే తమకు లభించాలని కోరుకుంటూ గొబ్బెమ్మలు పెడతారు. ధనుర్మాసం నెలరోజులు రోజు ముగ్గుల మధ్య గొబ్బెమ్మలు పెట్టి, మరుసటి రోజు ఆ గొబ్బెమ్మను పిడకగా చేస్తారు. అలా వచ్చిన పిడకలను మాలగా కట్టి భోగిమంటలో వేస్తారు.

గాలిపటాలు

భోగి రోజున పిల్లలు చాలా ఆనందంగా గాలిపటాలు ఎగురవేస్తారు, వివిధ రకాల గాలిపటాలు తయారు చేసి లేదా కొనుక్కొని ఎగరవేయడంలో పోటీపడతారు. పటమంటే వస్త్రం. ఒకప్పటి రోజుల్లో వస్త్రంతో చేసిన గాలిపటాలను ఎగురవేస్తూ ఉండేవాళ్లు. ఆ సూర్యునికి ఆహ్వానాన్ని అక్కడికి వెళ్లి పలకలేం కాబట్టి ఇక్కడి నుంచి గాలిపటాలను ఎగురవేసి స్వాగతించడంలో ఓ ఆనందానుభవాన్ని పొందడం భోగి. మరో విశేషమేమిటంటే ఉత్తరాయణం రాబోతున్న రోజున గాలి వేగం ఎంత ఉందో, గాలి ఏ దిశగా వీస్తోందో, దానిలో తేమ ఎంత శాతముందో, దాన్ని బట్టి రాబోయే కాలంలో పంట దిగుబడిక్కావలసిన వర్షపాతాన్ని లెక్కించగలరు రైతులు. ఆ కారణంగా వాళ్లకి రాబోయే పంట సమాచారాన్ని తెలుసుకోగలిగామనే ఆనందానుభవం భోగి.

తెలుగు జాతి పౌరుషాలకు ప్రతీకలుగా ఎర్రఎర్రని మిరపపళ్లు కోతకు వస్తాయి. పంటచేను దిబ్బల మీద వంగలు, బెండలు, చిక్కుళ్లు, సొరపాదులు విరగకాసి బరువెక్కేది ఇప్పుడే. కవిసమ్రాట్ విశ్వనాథ తన తెలుగు రుతువులు కావ్యంలో మంచి గుమ్మడి పువ్వులో నిలిచిన మంచు బిందువు, తట్టలో కూర్చున్న పెళ్ళి కూతురులా ఉందని వర్ణించారు. గుమ్మడి పచ్చపచ్చగా పూలు పూసేది... మంచుకురిసేది ఈ ధనుర్మాసంలోనే.

నాడు వ్యవసాయం జీవనం. కానీ నేడు ఆ జీవనం తక్కువే. శ్రమ జీవులు, వినోదాలు, అవసరాలు వ్యవసాయదారుని ఆశ్రయించుకుని అతని చుట్టూ తిరిగాయి. క్రమంగా స్థితిగతులు మారిపోయాయి. వ్యవసాయానికి నాగలి నుంచి కొడవలి దాకా ఎన్నో పనిముట్లు కావాలి. అందుకోసం వడ్రంగి, కమ్మరి ఉండి తీరాలి. పొలానికి ఇంటికి బానలు, బుంగలు, కడవలు, పిడతలు, చట్లు, మూకుళ్లు, ప్రమిదలు కావాలి. ఇవన్నీ కనిపించనంత దూరంగా జరిగిపోయాయి. కారణాలు ఏవైనా పల్లెలు మాత్రం ఛిద్రమయ్యాయి. ఊళ్ళకి కళ తప్పింది. అనేక జానపద కళారూపాలు, జానపద వాద్యాలు కనుమరుగయ్యాయి. బతుకు తెరువు కోసం వెళ్ళిపోయాయి. మొత్తం మీద ఒక గొప్ప పనితనాన్ని, సంస్కృతిని కోల్పోయిన మాట అయితే వాస్తవం. అగ్గిపెట్టిలో చీరను పెట్టిన చరిత్ర మనది. ఆ చీరకు నూలు తీసిన కళాకారుల హస్తవాసిని తిరిగి చూడగలమా? కొయ్యను బంగారం చేసే వడ్రంగి, ఇనుముని పుత్తడి చేయగల కమ్మరి, బంకమట్టిని సారెతో సువర్ణం చేసే కుమ్మరి మన కళ్లెదుట కనుమరుగైన కులవృత్తి బ్రహ్మలు. అరిశెలు, బెల్లపులడ్లు, కొమ్ము మిఠాయి, చకినాలు, చక్కలు సంక్రాంతి పిండి వంటలు. నాలుగిళ్ళ వారు చేరి సమష్టిగా ఇవన్నీ చేసుకుని బానలకు ఎత్తేవారు. కొత్త అల్లుళ్లు రావడం వేడుక. పాత అల్లుళ్ళు రావడం వాడుక. ఊరు మీద ఊరు వచ్చి పడినట్టుండేది. ఇప్పుడు సొంత ఊళ్ళలో అంతో ఇంతో మమకారం ఉన్న వాళ్లు నగరాల నుంచి పండక్కి వెళుతున్నారు. అలనాటి భోగి మంటల్లోనే ఇప్పటి మన పాలకులు గొప్పగా చెబుతున్న స్వచ్ఛ భారత్ పోలికలు కనిపిస్తాయి. చెత్తా చెదారం తెచ్చి భోగిమంటలో వేసేవారు. అదొక ఉద్యమంలా ఉత్సవంలా నడిచేది.

గొబ్బెమ్మ పాట

గొబ్బియల్లో గొబ్బియల్లో గొబ్బియల్లో
మన సీతాదేవి వాకిటవేసిన గొబ్బియల్లో... గొబ్బి
మాణిక్యాల ముగ్గులు వేసి గొబ్బియల్లో
ఆ ముగ్గులమీద మల్లెపూలు గొబ్బియల్లో... గొబ్బి
నవరత్నాల ముగ్గులు వేసి గొబ్బియల్లో
ఆ ముగ్గుల మీద మొగలీపూలు గొబ్బియల్లో...గొబ్బి
ధాన్యపురాశుల ముగ్గులు వేసి గొబ్బియల్లో
ఆ ముగ్గుల మీద సంపెంగలు గొబ్బియల్లో.. గొబ్బి
రంగురంగుల ముగ్గులు వేసి గొబ్బియల్లో
ఆ ముగ్గుల మీద మందారాలు గొబ్బియల్లో...గొబ్బి
భూదేవంతా ముగ్గులు వేసి గొబ్బియల్లో
ఆ ముగ్గుల మీద నక్షత్రాలు గొబ్బియల్లో...గొబ్బి
లక్ష్మీరథముల ముగ్గులు వేసి గొబ్బియల్లో
ఆ ముగ్గుల మీద తులసీదళములు గొబ్బియల్లో...గొబ్బి

సినిమాల్లో భోగి పాటలు

భోగుల్లో భోగుల్లో భోగభాగ్యాల భోగుల్లో...
భోగిమంటల భోగుల్లో...
తెల్లారకుండానే పల్లెపల్లంతాను
ఎర్రని కాంతుల భోగుల్లో
తెల్లారకుండానే పల్లెపల్లంతాను
ఎర్రని కాంతుల భోగుల్లో...
చిత్రం.. భోగిమంటలు(1981)- రచన ఆచార్య ఆత్రేయ

సింగారాల పైరుల్లోన
బంగారాలే పండేనంటా పాడాలి
నవ్వుల్లోన పువ్వుల్లాగ
జీవితాలే సాగాలంటా ఆడాలి
ఈనాడు.. ఊరంతటా... రాగాల దీపాలటా..
నీకోసం.. వెలిగేనటా.. ఉల్లాసం.. నీవేనటా..
చిత్రం.. దళపతి (1992) -రచన రాజశ్రీ

మా పల్లే రేపల్లెంటా... ఈ పిల్లే రాధమ్మంటా...
రేగుతుంటే భోగిమంట.. రేగువళ్ల విందులంటా
రేతిరంతా కోడిపుంజు కొక్కొక్కో
మంచుపూల జల్లులంటా మంచెకాడ గిల్లుడంటా
మంచమేస్తే సంకురాత్రి తిరునాళ్ళో
పల్లె పచ్చగా పిల్ల వెచ్చగా ఉంటే పండగ.
చిత్రం...రాముడొచ్చాడు (1996)- రచన వేటూరి

ఏడుమల్లెలెత్తు సుకుమారికి
ఎంత కష్టమొచ్చింది నాయనో..
భోగివళ్లు పోయాలి బేబికి..
ఏమి దిష్టి కొట్టింది నాయనో..
ముగ్గులెట్టు ముచ్చట్లలో
ముచ్చెమట్లు పట్టాయిరో...
మంచు బొట్లు ఆ బుగ్గలో అగ్గిచుక్కలైనాయిరో...
చిత్రం...సిందూరం (1997)-రచన సిరివెన్నెల





జరిగిన కథ

"...నన్ను లేపుతోంది. ఇట్నించి అటు వొత్తిగిలేను నిద్ర నటిస్తూనే. ఉచ్ఛ్వాస నిశ్వాసాలు తొట్రుపాటు లేకుండా ప్రశాంతంగా తీస్తున్నాను. వంట్లో నరాలు బిగపట్టకుండా సహజంగా వుండేటట్లు నాఆధీనంలోనే పెట్టుకున్నాను.. ఎంతసేపిలా వుండగలను? నాకేం ఖర్మం? నన్ను శిక్షించే వారెవరు? నేనెందుకు సహజమైన పురుషుడులాగు ప్రవర్తించకూడదు...? కొంపతీసి, హెన్నీ నన్ను వలలో వేసుకోడానికి ప్రయత్నించడం లేదుకదా? ఆ మూల పొదలో ఎవరినైనా దాంకో పెట్టిందేమో - నాపైన సాక్ష్యంబెదిరించి-డబ్బు గుంజుకోడానికి?...ఈలాంటి కుక్కుర్తిలో పడి నా స్నేహితు డొకడు నానా చిక్కులు పడుతున్నాడు... మరొకటి.. హెన్నీ ఆరోగ్యమైన మనిషి.

(నిన్నటి సంచిక తరువాయి)

కాని ఆమె పుట్టుపూర్వోత్తరం నాకేం తెలుసు? ఆరోగ్యం అన్నది ఆంతరంగిక విషయం. ఆమె రక్తంలో ఏ క్రిమికీటకాలు దాగివున్నాయో? ఆ అంతర్గతాలైన సూక్ష్మజీవులు నా శరీరంలో ఏమి మార్పులు, ఏమి జాడ్యాలు, ఏమి వికృతాలు తెచ్చిపెడతాయో? శరీరారోగ్యం అన్నది మన వంశీకులు పెట్టిన భిక్ష. సుభిక్షమో, దుర్భిక్షమో? ఒక్క నిమేషవాంఛకు నా భావి ఆరోగ్యం అంతా పందెం వెయ్యకూడదు... హెన్నీయెడల నేనెంత నీచంగా ఆలోచిస్తున్నానో కదా? ఆమెకు నీచపుబుద్ధులు కళంకమైన శరీరంకూడా ఆరోపిస్తున్నానే... ఈ సంఘర్షణ ఇక సహించలేను... ఏమైనా కానీ...ఏదో ఒకటి తేల్చివేయాలి. ..... యువకుడ్ని-ఆరోగ్యవంతుడ్ని - కారణాకారణాలు తెలుసుకొనగలిగే వ్యక్తిని - ఆమె ప్రేమాస్పదుడను..."

ఇలా చెపుతూనేవున్నా - "దబ్బని" మేడమీదనుంచి చప్పుడు వినిపించింది. చంటిపిల్ల కెవ్వని కేకేసింది. "లక్ష్మి ఉయ్యాలలోంచి పడిపోయింది - ఏ దెబ్బ తగిలిందో ఏమిటో? నేను మేడమీదకెళుతున్నాను-శాస్త్రీ!" అంటూ శాంతం మేడమీదికి పరుగెత్తింది.

...అరగంటైంది. శాంతం ఇంకా మేడదిగి రాలేదు. నా కథ పూర్తికాకుండానే వుండిపోయింది. శాంతం నా గురించి ఏమనుకుంటూందో ఏమిటో? అఖరుమాట తరువాయిగా ఈ అవాంతరం వచ్చింది. నేనారాత్రి హెన్నీకి లొంగిపోయి నా బ్రహ్మచర్యాన్ని పోగొట్టుకున్నాననుకుందో ఏమిటో? "నా వ్రతం నిలబెట్టుకున్నాను. సుమా శాంతం!" - అని ముందే చెప్పేయవలసింది - ఇన్ని చిలువలూ వలువలూ పెట్టకుండా. అయితే, ఆనాడు నేను పడిన ఆవేదనంతా చెప్పడం మంచిదనుకున్నాను. ఇప్పుడు వెళ్ళి చెపుతే, పని కట్టుకు చెప్పినట్టుంటుంది. అపనమ్మకం మరింత బలపడుతుంది. అప్పటికీ చెపుదాం అని మేడమీదికి వెళ్ళా. శాంతం, పెదిమల మీద వేలుంచుకుని "హుష్షు! ఏడ్చేడ్చి ఇప్పుడే కన్నుమూసింది. చప్పుడు చెయ్యకుండా నువ్వు కింది గదిలో పడుకో శాస్త్రీ!" అంది.

నేనారాత్రి బ్రహ్మచర్యం నిలబెట్టుకోవడం యథార్థం. మనోబలంవల్ల నైతేనేం, పిరికితనంవల్ల నైతేనేం - అదెవరిక్కావాలి? అది నా స్వవిషయం. ఆంతరంగిక విషయం. నా ధర్మాన్ని నిలబెట్టుకున్నానన్నదే ముఖ్యం. ప్రపంచానికి, శాంతానికి తెలియవలసిందదొక్కటే. కర్మ ప్రధానం కాని కారణం ప్రధానం కాదు. ఇంతకీ - ప్రపంచానికి చాటవలసివస్తే బుద్ధి బలం వల్ల, మనస్సు పటుత్వంవల్ల, బ్రహ్మచర్యం మహిమవల్ల అనే చెప్పొచ్చు. కాదని ఎవరనగలరు? కాదా ఏమిటి కూడాను? బడాయి అనుకుంటుందేమో కాని ఏదేనా సమయోచితంగా, శాంతంతో చెప్పెయ్యాలి - ఆవేళ నేను బ్రహ్మచర్య దీక్షకి భంగం రాకుండా కాపాడుకున్నానని, నిజమేగా?

అన్నట్టు జ్ఞాపకం వచ్చింది. ఈ కథ జరిగిన రెండు సంవత్సరాలైం తరువాత ఇండియన్ అసోసియేషను బిలియర్డ్సు ఛాంపియన్ షిప్పు ఆటలకి వెళ్ళేను బర్మింగు హేముకి. ఆఖరు వరుసవరకు నేను నిలబడ్డాను. నాది ముప్పై హేండికేపు. ఆట రెండువందలు "అప్" నా ఎదుటి ఆటగాడు 138, నేను 156.



ఆట చెయ్యి నాది. ఇరవైయేడు బ్రేకు. నా ఆట సాగుతూంది. "డబుల్ కేనను ఆఫ్ ది రెడ్డు." ఇంతట్లో ప్రేక్షకుల్లో ఎవరో నలుగురైదుగురు కలిసి మాట్లాడుకుంటున్నారు గట్టిగా. ఒకతను అంటున్నాడు: "ఓరే; దాస్ గుప్తా! ఈ థామస్‌గా కామం వుంది. ధైర్యం ఇల్లే!" అన్నాడు. అందరూ గొల్లుమన్నారు. నేను ఆట మధ్యని తుళుక్కుపడ్డాను. గురి తప్పిపోయింది, నా సంగతి ఇక్కడెవరు బయలు పెడుతున్నారని అందరివేపు చూశాను. తెలిసిన ముఖం ఒక్కటిలేదు. పుచ్చకాయలు దొంగంటే భుజాలు తడుముకున్నా ననుకున్నాను. ఫలితం ఆట వోడిపోయాను. హెన్నీ సల్లివన్ "మడొన్న" స్వరూపం - ఆవేళ మళ్ళీ మనస్సులో



డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

ప్రత్యక్షం అయింది!

55 ఆమె

శాస్త్రీ కథ మంచి రక్తికట్టే వేళకి సరిగా రసభంగం జరిగింది. పాపాయి వుయ్యాలలోనుంచి దొర్లి క్రింద పడిపోయింది కంటిమీద బొడుపు కట్టింది. సున్నం బెల్లం పట్టేశాను. ఒక అరగంట ఏడ్చి, అలిసిపోయి పడుకుంది. రాత్రి పాపాయి పక్కలోనే పడుకున్నాను.

నిద్రపట్టలేదు. హెన్నీగురించే జ్ఞాపకం వొచ్చింది. పాపం - ఆ రాత్రి ఆమె ఎంత బాధపడిందో కదా! నాలుగు సంవత్సరాలు అహోరాత్రాలు ఆ యుద్ధంలో పనిచేసి మనశ్శాంతి కోసం తహతహపడిన ఆ హృదయం ఎంత ఆవేదన పొందిందో! ఆ రాత్రి యుద్ధరంగం - మారణహోమం - రక్తపాతం - ఎక్కడ చూసినా తలలు లేని మొండేలు - ఉత్తరించుకుపోయిన పీకలు - చేతులు - కాళ్ళు - మరఫిరంగుల మోత - శతఘ్నుల బీభత్సం - విమానాల హోరు. ఘడియఘడియకు మృత్యుదేవతని వెన్నంటి వేటాడుతున్నారు. ఇప్పుడే క్షణమాత్రం విశ్రాంతి తీసుకొంటున్నారు. ఆ కందకాల్లో ... రెండు రోజులై తిండిలేదు...కుళ్ళిన ఒక మాంసపు తునక ఆ మూల కనిపించింది. దానికోసమై ఒకరితో ఒకరు పోట్లాడుకున్నారు.

ఒక నిమిషం క్రింద చెలికాండ్రు- ఇప్పుడు శత్రువులు... పంచేంద్రియాలు చెలరేగుతున్నాయి. అదిగో ఆ శిధిలమైన యింటినుంచి ఒక ఫ్రెంచి పడుచు బైటకు వచ్చింది. ఆ స్త్రీని పంచుకోవడానికి స్నేహితులందరూ ఒకరినొకరు పొడుచుకుంటున్నారు. ఘోరప్రమాదం వున్నప్పుడు ఒకరిని రక్షించడాని కొకరు ఆత్మబలి అవడానికి మళ్ళీ సిద్ధం. ... యమునితో హాస్యము - మృత్యువుతో చెలగాటం - విధినే తోసిరాజు చేయడం - చావు బతుకులకు విలువ యేమిటి? ఈ వేళ వుంటారు - రేపు పోతారు. ఈ బొందిలో ప్రాణం వున్నంత వరకు - లభించినంతవరకు సౌఖ్యం అనుభవిద్దాం. ఆ తరువాత సర్వం శూన్యం..పొట్ట చీలిపోయింది - పేగులు పైకి వేల్లాడుతున్నాయి. విపరీతపు బాధ, వొళ్ళంతా కట్లు - ఆ నర్సు ఒక్క నవ్వుతో, ఒక్క కనుసైగతో - మోక్షమూ; స్వర్గమూ వాళ్ళకి!...

ఈ దృశ్యాలు అనుభవించిన హెన్నీ - ప్రేమకోసం ఎంత పరితపించిపోయిందో? ప్రేమ, వాంఛ, అనురాగము, కామము - ఆమెకు ఆ నిమిషంలో ఏం తెలుస్తుంది? నేనే ఆమె స్థితిలో వుంటే నాకు తెలుస్తుందా? నా జీవితంలో నాకు తెలిసిందా? నేను మాత్రం మరో విధంగా ప్రవర్తించి వుందునా? ప్రేమార్త అయిన హృదయం - సౌఖ్యం అన్వేషిస్తున్న శరీరం - వీటికి ధర్మసూత్రాలు వర్తిస్తాయా? మానవ స్వభావానికి సహజమైనదే ధర్మం.

ఆ రాత్రి ఆ సముద్రుడు, భూదేవి నురగలు కక్కుతూ పరుగెత్తి కౌగలించుకుంటూంటే, ఆమె హృదయంలో అసూయ జనించదూ! ఆ పిల్ల గాలులు ఆకాశాన వీస్తూంటే, ఆ గాలులు ఆమె మనస్సును రేకెత్తించవూ? ఆమె హృదయంలో దావానలము దహించుకుపోతూ కార్చిచ్చులు చెలరేగవూ? తన పొంతనుంచి పారిపోతూన్న చంద్రుణ్ణి పట్టుకుందాం అని ఆ తారామండలం ప్రయత్నించి తప్పిపోయి, ఆఖరి నవ్వుతో భూమి మీద పడిపోతుంటే, ఆ నవ్వు ఆమె హృదయపు చీకటులలోకి చొచ్చి సంతోషం కలిగించదూ? ప్రేమ, సౌఖ్యం ఎదురుగుండా వస్తూంటే, వాటిని తప్పించుకుని పారిపోవడం ఎవరిశక్యం?...

ఇంద్రియ నిగ్రహమా! స్త్రీ పురుషులకది సాధ్యమా? మనసా - వాచా కూడా జన్మలో పరస్త్రీని, పరపురుషుడిని తలంచని వ్యక్తి వుండడం దుర్లభం. మన పాతివ్రత్యం, మన బ్రహ్మచర్యం, మన గృహస్థధర్మం ఒక కర్మలోనే ఆచరిస్తూంటాం. అంతకంటే హెచ్చు వెళ్ళలేము. ఆనాడు శాస్త్రి హెన్నీ కోర్కె తీర్చివుంటేనే నా కెంతో సంతోషం. అతడేమి చేశాడో నాకు తెలియదు. నేనతన్ని ఎన్నడూ అడగను. అతను ఏమి చేసినప్పటికూడా, మనస్ఫూర్తిగాను, సహజంగాను, స్వభావయుతంగాను ప్రవర్తిస్తే, నాకదే సంతోషం. ధైర్యవంతులు క్షణమాత్రం ధర్మం వీడినా తప్పులేదు. పిరికిపందలు ధర్మాన్ని ఎన్నటికీ నిలబెట్టలేరు....

రెండు రోజులై అశ్రద్ధ అయింది. ఈ పుస్తకంలో రాయడం పడలేదు. పుస్తకం తీసి వెనక రాసిన పేజీలు తిరగవేస్తూంటే, నాలో ఎంత మార్పు వచ్చిందో నాకే ఆశ్చర్యంగా వుంటుంది! అనుభవంబట్టి మారుతూండేదే కదా మనుష్య ప్రకృతి? ప్రపంచ చరిత్రే మారుతుంది. ఇతిహాసమే మారిపోతూంది. పరిస్థితుల బట్టే మానవకోటి ప్రవర్తన, వ్యక్తి ప్రవర్తన కూడాను. ముక్కు మూసుకు, నవ రంధ్రాలూ బంధించి లక్ష గాయత్రీ చేసి ధర్మం పట్టుకుని వేళాడుతానంటే - అసలు ధర్మమే మారిపోతూంటే! నిన్నటి ధర్మం ఈవేళ లేదు - ఈవాళ ధర్మం రేపు ఉండదు. శాశ్వత ధర్మాలంటూ వున్నాయా? అనిపిస్తూంటుంది నాకు. సత్యం, ధర్మం దేశ కాల పాత్రలని అనుసరించే కాదూ? ఆర్యకాలంలో నిష్కామ కర్మ, అపరిగ్రహం, జ్ఞానసముపార్జితం, జ్ఞానదానం - ఇవీ బ్రాహ్మధర్మాలు. ఇప్పుడవి మారిపోయాయి కావా? ఏదో ఒకవిధంగా డబ్బు సంపాదనే ఇప్పట్లో ప్రధానం. ఎలా సంపాదించినా తప్పులేదు. దివాలా తీసి సంపాదించినా, బ్రిడ్జి ఆడి సంపాదించినా, షేరుమార్కెటులో సంపాదించినా, బీదల దగ్గిర చికిత్సకోసం డబ్బుగుంజి సంపాదించినా, రైతులని పీడించి సంపాదించినా, తప్పుడు సాక్ష్యాలు ఇచ్చీ ఇప్పించీ సంపాదించినా - సంపాదిస్తేనే మర్యాద! ఒక తరం దాటిపోతే సమకాలీనులు మర్చిపోతారు. మరీ చిక్కుండదు.

- ఇంకా వుంది.

జాతీయ వార్తలు

'సుప్రీం' చీఫ్ జస్టిస్‌పై న్యాయమూర్తుల తిరుగుబాటు

భారత సర్వోన్నత న్యాయస్థానం చరిత్రలోనే అనూహ్యంగా ప్రధాన న్యాయమూర్తిపై నలుగురు న్యాయమూర్తులు తిరుగుబాటు చేశారు. సుప్రీంకోర్టు చరిత్రలో తొలిసారిగా న్యాయ మూర్తు లు చీఫ్ జస్టిస్‌ను దుయ్యబట్టారు. జస్టిస్ చల మేశ్వర్, జస్టిస్ మదన్ బి.లోకూర్, జస్టిస్ కురి యన్ జోసెఫ్, జస్టిస్ గొగోయ్ ఈనెల 12న ఢిల్లీలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, కొలీజియం నియామకాల్లో పారదర్శకత, కేసుల కేటాయింపుల్లో తమకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. జస్టిస్ చలమేశ్వర్ మాట్లాడుతూ, తాము నలుగురం చీఫ్ జస్టిస్‌ను కలిసి పలు సమస్యల గురించి వివరించేందుకు ప్రయత్నిం చగా, ఆయన కనీసం వినడానికి కూడా ఇష్టపడలేదన్నారు.

లాలూ ప్రసాద్‌కు మూడున్నరేళ్ల జైలుశిక్ష

బీహార్‌లోని దేవ్‌గఢ్ ఖజానా కార్యాలయం నుంచి పశుగ్రాసం కొను గోలు నిమిత్తం రూ. 89.27 లక్షలను తప్పుడు పత్రాలతో తీసుకోవడానికి సంబంధించి ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌కు రాంచీలోని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం మూడున్నరేళ్ల కారాగార శిక్ష విధించింది. పశుగ్రాసం కుంభకోణంలో లాలూకు జైలుశిక్ష పడటం ఇది రెండోసారి. 2013లో ఒక కేసులో ఆయనకు అయిదేళ్ల జైలుశిక్ష పడింది. రెండున్నర నెలల పాటు కారాగారంలో ఉన్న తరువాత సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. మోసగించడం, నేరపూరిత కుట్రలకు పాల్పడటం తదితర అభియోగాల కింద అవినీతి నిరోధక చట్టం కింద ఆయనకు ఇప్పుడు రెండోకేసులో జైలుశిక్ష విధించారు.

కాశ్మీర్‌లో బాంబుపేలుడు.. నలుగురు పోలీసుల మృతి

జమ్మూకాశ్మీర్‌లోని సోపోర్ పట్టణంలో ఈనెల 6వ తేదీన గస్తీని నిర్వహిస్తున్న పోలీసులను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు బాంబు దాడి జరిపారు. ఈ ఘటనలో ఇండియన్ రిజర్వు పోలీసు విభాగంలో మూడో బెటాలియన్‌కు చెందిన నలుగురు పోలీసులు మృతిచెందారు. వేర్పాటువాదుల బంద్ నేపథ్యంలో పోలీసులు గస్తీ తిరుగుతుండగా ఈ ఘటన జరిగింది. గతనెల 31న పుల్వామా జిల్లాలో సీఆర్‌పీఎఫ్ శిబిరంపై ఉగ్రవాదులు జరిపిన దాడిలో ముగ్గురు జవాన్లు అమరులైన విషయం తెలిసిందే. ఈ రెండు ఘటనలకు తామే బాధ్యులమని జైషే మహమ్మద్ ఉగ్రవాద సంస్థ ప్రకటించుకుంది.

ఇస్రో ఛైర్మన్‌గా శివన్

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) నూతన ఛైర్మన్‌గా ప్రముఖ శాస్త్రవేత్త కె.శివన్ నియమితులయ్యారు. ఎ.ఎస్. కిరణ్‌కుమార్ స్థానంలో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. అంతరిక్ష శాఖ కార్యదర్శిగా, అంతరిక్ష కమిషన్ ఛైర్మన్‌గా శివన్ నియామకాన్ని కేబినెట్ నియామకాల కమిటీ ఈనెల 10న ఆమోదించింది. మూడేళ్లపాటు ఆయన ఈ బాధ్యతలు నిర్వహిస్తారు.



పీఎస్‌ఎల్‌వీ సీ-40 ప్రయోగం విజయవంతం

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో అరుదైన మైలురాయి సాధించింది. 31 ఉపగ్రహాలతో పీఎస్‌ఎల్‌వీ సీ-40 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. దీంతో ఈ సంస్థ ఇప్పటివరకు 100 స్వదేశీ ఉపగ్రహాలను విజయవంతంగా ప్రయోగించి నట్లయింది. నెల్లూరు జిల్లా శ్రీహరికోటలోని షార్ కేంద్రం నుంచి ఈనెల 12వ తేదీ ఉదయం ఈ రాకెట్ 31 ఉపగ్రహాలను నింగిలోకి మోసుకెళ్లి, కక్ష్యలో ప్రవేశపెట్టింది. వీటిలో భారత్‌కు చెందిన కార్టోశాట్-2ఇ, ఒక నానో శాటిలైట్, ఒక సూక్ష్మ ఉపగ్రహం ఉన్నాయి.

సరిహద్దుల వెంబడి 14 వేల బంకర్లు

సరిహద్దు గ్రామాల ప్రజలు తరచూ కాల్పుల ప్రమాదాన్ని ఎదుర్కొంటుండటంతో వారిని రక్షించడానికి రూ.415.73 కోట్లతో 14 వేలకు పైగా భూగృహాల (బంకర్ల)ను నిర్మించాలని కేంద్రం నిర్ణయించింది. వీటిలో కొన్ని వ్యక్తిగతమైనవి. కొన్ని సామాజికమైనవి.

విజయవాడలో సీపీఐ జాతీయ సమితి సమావేశాలు

సీపీఐ జాతీయ సమితి సమావేశాలు ఈనెల 8,9,10 తేదీల్లో విజయవాడలో జరిగాయి. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి, జాతీయ కార్యదర్శులు కె.నారాయణ, డి.రాజా, షమీమ్ ఫైజీ, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తదితర నేతలు పాల్గొన్నారు. సమావేశాల ముగింపు సందర్భంగా 10వ తేదీన విజయవాడలో బహిరంగసభను నిర్వహించారు.

1984 అల్లర్లపై మరో సిట్

1984 నాటి సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులను మరోసారి విచారించాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. ఆనాటి అల్లర్లకు సంబంధించిన 241 కేసుల్లో 186 కేసులను ఎలాంటి దర్యాప్తు జరపకుండా మూసేయడంపై ఈనెల 10న తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. వీటిపై తాజా దర్యాప్తును పర్యవేక్షించేందుకు మళ్లీ సిట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎస్.ఎన్. ధింగ్రా నేతృత్వంలో త్రిసభ్య బృందాన్ని సుప్రీంకోర్టు ఏర్పాటుచేసింది.

ఉత్తరాదిని వణికిస్తున్న శీతల గాలులు

దేశం ఉత్తర ప్రాంతాన్ని అతిశీతల గాలులు వణికిస్తున్నాయి. జమ్మూకాశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, హరియానా, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు ఈ నెల మొదటి వారం ఆఖరులో పడిపోయాయి. జమ్మూ-కాశ్మీర్‌లో ఉష్ణోగ్రతలు జీరో కన్నా తక్కువకు పడిపోయాయి. ఆ రాష్ట్రంలో ఈనెల 7వ తేదీన ఉష్ణోగ్రతలు మరింత పడిపోయాయి. దీంతో కాశ్మీర్ డివిజన్, లడఖ్ ప్రాంతాలు గడ్డకట్టుకుపోయాయి. ఈ రాష్ట్రంలో మంచుతుపాను ధాటికి




సమాధి అయిపోయిన వారిలో 11 మృతదేహాలను ఈనెల 6వ తేదీన వెలికితీశారు.

అంతర్జాతీయ వార్తలు

తూర్పు అమెరికా, కెనడాల్లో మంచు తుపాను

అమెరికా తూర్పుతీరం, కెనడాలను మంచు తుపాను వణికించింది. ఈనెల 6వ తేదీన అమెరికాలోని ఉత్తర ఫ్లోరిడా, న్యూయార్క్ నగరం, న్యూ ఇంగ్లాండ్ తదితర ప్రాంతాల్లో కొన్నిచోట్ల ఉష్ణోగ్రతలు మైనస్ 40 డిగ్రీల కంటే తక్కువ నమోదయ్యాయి. బయటకు వెళ్లడం ప్రమాదకరమని వాతావరణ నిపుణులు హెచ్చరిం చడంతో పాఠశాలలు, విమానాశ్రయాలను మూసివేశారు. గంటకు 113 కిలోమీటర్ల వేగంతో మంచుతుపాన్ గాలులు వీయడంతో కొన్నిచోట్ల 56 సెంటీమీటర్ల మందంలో మంచు పేరుకుపోయింది.



ఇదిలా ఉండగా.. ఆస్ట్రేలియాలో వేసవిని తలపించేలా ఎండలు కాయడంతో ప్రజలు అల్లాడిపోయారు. సిడ్నీ నగరంలో ఈనెల ఏడవ తేదీన ఏకంగా 47.3 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత నమోదైంది. 1939 తరువాత అక్కడ ఇంతగా ఉష్ణోగ్రత నమోదు కావడం ఇదే ప్రథమం. వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పుల కారణంగా ఇలాంటి విపరీత పరిస్థితులు ఏర్పడుతున్నాయని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

హెచ్1బీ గడువు పొడిగింపు విధానంలో మార్పులేదు: అమెరికా

హెచ్1బీ వీసా గడువు పొడిగింపు ఉండదంటూ జరుగుతున్న ప్రచారంపై అమెరికా స్పష్టతనిచ్చింది. అటువంటి ప్రతిపాదనను పరిశీలించడంలేదని అమెరికా పౌరసత్వ, వలసల సేవల విభాగం (యూఎస్‌సీఐఎస్) మీడియా సంబంధాల ప్రధాన అధికారి జోనాథన్ విథింగ్టన్ తెలిపారు. హెచ్1బీ వీసాదారులు అమెరికానుంచి బలవంతంగా వెళ్లిపోయేలా చేసేలా సంబంధిత చట్టంలోని నిబంధనలు మార్చాలని యూఎస్‌సీఐఎస్ అనుకోవడం లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రకటనతో భారత్‌కు చెందిన లక్షలాదిమందికి, ప్రత్యేకించి ఐటీ రంగం వారికి ఊరట లభించినట్లయింది.

రఘునందన్‌కు వచ్చేనెల 23న మరణశిక్ష



అమెరికాలో పదినెలల చిన్నారి శాన్వీతో పాటు ఆమె నాయనమ్మ సత్యవతి(61)ని 2012లో అతి కిరాతకంగా హత్యచేసిన కేసులో భారత సంతతి అమెరికన్ యండమూరి రఘునందన్‌కు ఫిబ్రవరి 23న మరణశిక్ష అమలు చేయ నున్నట్లు వాషింగ్టన్ జైలు అధికారులు తెలిపారు. రఘునందన్ డబ్బు కోసమే ఈ దారుణానికి ఒడిగట్టాడని వారు తెలిపారు.

ఉత్తర, దక్షిణ కొరియా మధ్య అధికారిక చర్చలు

ఉత్తర, దక్షిణ కొరియా మధ్య రెండేళ్ల తరువాత ఈనెల 9వ తేదీన అధికారిక చర్చలు జరిగాయి. ఫిబ్రవ రిలో దక్షిణ కొరియాలో జరిగే వింటర్ ఒలింపిక్స్‌కు తమ క్రీడా బృందాలను పంపేందుకు ఉత్తర కొరియా అంగీకరించింది. ఇటీవల నూతన సంవత్సర సందేశంలో దక్షిణ కొరి యాతో సంబంధాలను నెలకొల్పు కునేందుకు సిద్ధంగా ఉన్నామని ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ ప్రకటించడంతో తాజా చర్చలు కార్యరూపం దాల్చాయి.

'స్వలింగ సంపర్కం'పై విచారించనున్న విస్తృత ధర్మాసనం : సుప్రీం

పరస్పర ఆమోదంతో ఇద్దరు వయోజనులు స్వలింగ సంపర్కానికి పాల్పడటాన్ని నేరంగా పరిగణించరాదని కోరుతూ దాఖలైన పిటిషన్‌ని విస్తృత ధర్మాసనానికి బదలాయించాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. తద్వారా.. ఇది నేరమేనంటూ 2013లో ఇచ్చిన తీర్పును ఈనెల 8న పున:సమీక్షించింది. ప్రకృతి నియమాలకు విరుద్ధంగా స్త్రీ, పురుషుడు లేదా జంతువులతో అసహజ లైంగిక చర్యకు ఉపక్రమించేవారికి జైలుశిక్ష, జరిమానా విధించాలని పేర్కొంటున్న ఐపీసీ 377 సెక్షన్‌ను విస్తృత ధర్మాసనం పరిశీలించడం సబబేనని అభిప్రాయపడింది.

రాష్ట్ర వార్తలు

హైకోర్టు విభజనకు మూడు కమిటీలు

ఉమ్మడి హైకోర్టును విభజించి, ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ఏపీ హైకోర్టును ఏర్పాటు చేసే ప్రక్రియలో భాగంగా మూడు కమిటీలు ఏర్పాట య్యాయి. ఉద్యోగుల విభజన, ఆంధ్రప్రదేశ్ సర్కారు ప్రతిపాదించిన భవనాల పరిశీలన, రికార్డుల డిజిటలైజేషన్ పర్యవేక్షణ కోసం.. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయ మూర్తి (ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్ వీటిని ఏర్పాటు చేశారు. హైకోర్టు ఏర్పాటు చేసిన కమిటీ ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపాదిత భవనాలను ఫిబ్రవరిలో పరిశీలించే అవకాశం ఉందని సమాచారం.

భారీగా లంచం తీసుకుంటూ పట్టుబడ్డ వాణిజ్యశాఖ అదనపు కమిషనర్

విజయవాడలో ఈనెల 12వ తేదీన రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ అదనపు కమిషనర్ ఏడుకొండలు రూ.23.20 లక్షలు లంచం తీసుకొంటుండగా అవినీ తి నిరోధకశాఖ అధికారులు పట్టుకున్నారు.

ఏసీబీ రాష్ట్ర చరిత్రలో ఇంత పెద్దమొత్తం పట్టుబడటం ఇదే ప్రథమం. ఈ సందర్భంగా అదనపు కమి షనర్‌తోపాటు లంచం ఇవ్వజూపిన మలేసియాకు చెందిన బహుళజాతి సంస్థ ఐటీడీ సిమెంటేషన్ ఇండియా లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులనూ నింది తులుగా చేర్చి, మొత్తం నలుగురిని ఏసీబీ అదుపులోకి తీసుకుంది.

'దుర్గగుడిలో అపచారం నిజమే'

విజయవాడలో ఇంద్రకీలాద్రిపై కనకదుర్గ దేవాలయంలో డిసెంబర్ 26వ తేదీ అర్ధరాత్రి అపచారం జరిగిందని తేలింది. ఆలయంలో శుద్ధిచేయడమే కాకుండా పూజలు నిర్వహించారని స్పష్టమైంది. ముందస్తు ప్రణాళిక ప్రకారమే ఉన్నతాధికారులకు తెలిసే దుర్గాదేవికి పూజలు జరిపించినట్లు పోలీసుల విచారణలో స్పష్టమైంది. ఈమేరకు పోలీసులు ముఖ్యమంత్రికి నివేదిక సమర్పించారు. ఈ నేపథ్యంలో ఆలయ కార్యనిర్వహణాధికారి సూర్యకుమారిని ప్రభుత్వం విధుల నుంచి తొలగించింది. ఈ వ్యవహారంపై మరింత లోతుగా విచారణకు ముఖ్యమంత్రి ఆదేశించారు.

ఉమ్మడి హైకోర్టు సీజేగా జస్టిస్ రాధాకృష్ణన్

తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టుకు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ టి.బి.నాయర్ రాధాకృష్ణన్ నియమితులు కానున్నారు. ప్రస్తుతం ఆయన ఛత్తీస్‌గఢ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేస్తున్నారు. ఉమ్మడి హైకోర్టు సీజేగా ఆయన పేరును సుప్రీంకోర్టు కొలీజియం ఈనెల 10న కేంద్రానికి సిఫారసు చేసినట్లు సమాచారం.

ఏప్రిల్ 22 నుంచి ఏపీ ఎంసెట్

రాష్ట్రప్రభుత్వం నిర్వహించనున్న ఉమ్మడి ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌ను మంత్రి గంటా శ్రీనివాసరావు ఈనెల 8న విడుదల చేశారు. ఏపీ ఎంసెట్ (ఇంజినీరింగ్)ను ఏప్రిల్ 22 నుంచి 25 వరకు నిర్వహించనున్నారు. మూడురోజులపాటు ఆరు విడతలుగా (సెషన్స్) ఈ ఆన్‌లైన్ పరీక్షను నిర్వహిస్తారు. ఎంసెట్ (బైపీసీ) పరీక్షను ఏప్రిల్ 26న రెండు విడతలుగా నిర్వహిస్తారు. ఎడ్‌సెట్, లాసెట్ ఏప్రిల్ 19న, ఐసెట్ మే 2న, ఈసెట్ మే 3న, పీజీఈసెట్‌ను మే 10 నుంచి 12 వరకు, పీఈసెట్‌ను మే 4న నిర్వహిస్తారు.

ఏఐటీయూసీ భవనం ప్రారంభం

విజయవాడ నగర పరిధిలోని గొల్లపూడి వద్ద నూతనంగా నిర్మించిన ఏఐటీయూసీ నూతన భవనాన్ని ఈనెల 7వ తేదీన యూనియన్ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ ప్రారంభించారు.

ఎగువ కాఫర్ డ్యాం పనులు పరిశీలన

పోలవరం ప్రాజెక్టు పనులను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈనెల 8వ తేదీన పరిశీలించారు. గేట్ల నమూనాను పరిశీలించి... ఎగువ కాఫర్ డ్యాం పనులను ప్రారంభించారు.

క్రీడా వార్తలు

తొలి టెస్ట్‌మ్యాచ్‌లో భారత్ ఓటమి

కేప్‌టౌన్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టెస్ట్‌మ్యాచ్‌లో భారత జట్టు 72 పరుగుల తేడాతో ఓడిపోయింది. దక్షిణా ఫ్రికా జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 286, రెండో ఇన్నింగ్స్‌లో 130 పరుగులు చేసింది. భారత్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 209, రెండో ఇన్నింగ్స్‌లో 135 పరుగులు చేసింది.



ఆస్ట్రేలియా ఘనవిజయం

యాషెస్ సిరీస్‌లో భాగంగా సిడ్నీలో జరిగిన ఐదో టెస్ట్‌మ్యాచ్‌లో ఇంగ్లాండ్ జట్టును ఆస్ట్రేలియా జట్టు 123 పరుగుల తేడాతో ఓడించింది. దీంతో సిరీస్‌ను 4-0తో కైవసం చేసుకుంది. తొలి మూడు టెస్ట్‌లను ఆస్ట్రేలియా గెలుచుకోగా, నాలుగో టెస్ట్ డ్రాగా ముగిసింది.

యూసుఫ్ పఠాన్‌పై ఐదు నెలలు నిషేధం

డోప్ పరీక్షలో విఫలమైనందుకు ఆల్‌రౌం డర్ యూసుఫ్ పఠాన్‌పై బీసీసీఐ ఐదు నెలలు నిషేధం విధించింది. తాను అనుకో కుండా నిషేధిత ఉత్ప్రేరకాన్ని తీసుకున్నానని పఠాన్ వివరణ ఇవ్వడంతో బీసీసీఐ సంతృప్తి చెంది, నిషేధాన్ని పాత తేదీ నుంచి అమలు చేసింది. పఠాన్‌పై ఐదు నెలల నిషేధం ఈనెల 14వ తేదీతో ముగుస్తుంది.

టీమ్ ఇండియా కెప్టెన్‌గా మిథాలిరాజ్

వచ్చేనెల 5 నుంచి దక్షిణాఫ్రికాలో పర్యటించబోయే భారత మహిళల క్రికెట్ జట్టును బీసీసీఐ ఈనెల 10న ప్రకటించింది. 16 మంది సభ్యులతో వన్డే జట్టును ఎంపిక చేశారు. కెప్టెన్‌గా మిథాలిరాజ్ కొనసాగుతారు.

ఎవరూ అడగని డబ్బు 8వేల కోట్లు

బ్యాంకుల్లో మూలుగుతున్న డిపాజిట్లు..



ఢిల్లీ : అన్‌క్లెయిమ్డ్ బ్యాంకు డిపాజిట్లు రూ.8వేల కోట్లకు చేరుకున్నట్లు రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా వెల్లడించింది. ఆ బ్యాంకు డిపాజిట్లకు సంబంధించిన వ్యక్తులు లేదా వారసులకు సంబంధించిన వివరాలేవీ అధికారుల దగ్గర లేవు. కానీ బ్యాంకు ఖాతాదారుల డిపాజిట్లు మాత్రం రూ.8వేల కోట్లకు చేరినట్లు తేలింది. దీనికి సంబంధించిన తాజా నివేదికను రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) విడుదల చేసింది. మొత్తం 2.63కోట్ల బ్యాంకు ఖాతాలకు సంబంధించిన వివరాలేమీ బ్యాంకు అధికారుల దగ్గర లేవు. కానీ వారి డిపాజిట్లు మాత్రం రూ.8,864.6కోట్లు ఉన్నాయి. 2012 నుంచి 2016 వరకు ఈ అప్రకటిత బ్యాంకు డిపాజిట్లలోని నగదు రెట్టింపయ్యింది. బ్యాంకుల్లో ఏళ్ల తరబడి డిపాజిట్లు చేసి.. వాటిని తీసుకోవడానికి ఎవరూ రాకపోవడం లేదా.. ఆ డిపాజిట్‌దారులకు సంబంధించిన పూర్తి సమాచారం లేకపోవడంతో అవి అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లుగా మారిపోతాయి.

అప్రకటిత బ్యాంకు ఖాతాల సంఖ్య కూడా 2012లో 1.32కోట్లు ఉండగా.. 2016 నాటికి అది రెట్టింపై 2.63కోట్లుగా చేరింది. అదే సమయంలో వారి డిపాజిట్లు కూడా రూ.3,598కోట్ల నుంచి రూ.8,864.6కోట్లకు చేరాయి. అన్‌క్లెయిమ్డ్ బ్యాంకు డిపాజిట్‌దారుల వివరాలను బ్యాంకు అధికారులు తమ తమ అధికారిక వెబ్‌సైట్‌లలో ఉంచాల్సిందిగా ఆర్‌బీఐ సూచించింది. ఈ జాబితాలో తప్పకుండా ఆ డిపాజిట్ చేసిన ఖాతాదారుని పూర్తి పేరు, వివరాలు పొందుపరచాల్సిందిగా ఆర్‌బీఐ సలహా ఇచ్చింది. అలా చేయడం వల్ల వారి వారసులు వివరాలను తెలుసుకోవడం చాలా సులభమవుతోందని ఆర్‌బీఐ పేర్కొంది. అన్‌క్లెయిమ్డ్ బ్యాంకు డిపాజిట్లు అత్యధికంగా ఉన్న బ్యాంకు జాబితాలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తొలి స్థానంలో నిలిచింది. దాదాపు 47 లక్షల ఇన్‌యాక్టివ్ ఖాతాల్లో మొత్తం రూ.1,036కోట్ల నగదు ఉంది. 47 లక్షల ఇన్‌యాక్టివ్ బ్యాంకు ఖాతాల్లో రూ.995కోట్ల నగదు ఉండి కెనరా బ్యాంకు తర్వాతి స్థానంలో ఉంది. ఇక పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో 23లక్షల ఇన్‌యాక్టివ్ ఖాతాలుండగా.. అందులో రూ.829కోట్లు మూలుగుతున్నాయి. మరోవైపు ఈ డిపాజిట్లపై బ్యాంకు ఇచ్చే వడ్డీతో ఆ నగదు మరింత పెరుగుతూ వస్తోంది.

జాలి లేని పిల్లలు

Sunday Special

విశాలాంధ్ర జనరల్‌డెస్క్ : కుటుంబ వ్యవస్థకు, మానవీయ విలువలకు మరోరూపం భారతీయ సమాజం. ఉమ్మడి కుటుంబాలున్నప్పుడు ఆ వాతావరణమే వేరుగా ఉండేది. కుటుంబ సభ్యులంతా ఒకే ఇంట్లో ఉంటూ కష్టాలు, సుఖాల్లో ఒకరికి మరొకరు తోడుగా ఉండేవాళ్లు. తమ పిల్లలు తమ పర్యవేక్షణలోనే ఉన్నారని, తమ అనుభవాలతో వాళ్ల బాగోగులు చూడడానికి, భవిష్యత్ మార్గనిర్దేశం చేయడానికి తామున్నామని పెద్దవాళ్లకు ఆశగా ఉండేది. అలాగే తమకు ఏ కష్టమొచ్చినా సరైన సలహాలు ఇచ్చి చేదోడువాదోడుగా కుటుంబ సభ్యులున్నారని పిల్లలకు భరోసా ఉండేది. కాని ఇదంతా నిన్నటి మాట. జీవన విధానంలో వచ్చిన మార్పులు, ఉన్న ఊళ్లో ఉపాధి దొరకక వేరే ప్రాంతాలకు తరలివెళ్లిపోవడంతో ఉమ్మడి కుటుంబాలు కనుమరుగైపోయాయి. వ్యవసాయం గిట్టుబాటు గాక జనమంతా పట్టణాల దారిపట్టారు. పండుగ, పబ్బాలకు పల్లెటూళ్లకు వెళ్లి చుట్టాలు,పక్కాలు, ఆత్మీయుల మధ్య గడిపే మధురమైన రోజులు గతంలో కలిసిపోయాయి. ఇదంతా ఒక ఎత్తయితే మారిన జీవనశైలిలో స్వార్థచింతన, నిర్లక్ష్యం పెరిగి తమను కని, పెంచి, విద్యాబుద్ధులు నేర్పించి, తమ భవిష్యత్తును తీర్చిదిద్దిన తల్లిదండ్రులు వృద్ధాప్యంలో ఉన్నప్పుడు వారి యోగక్షేమాలు చూసే తీరిక, అవసరాన్ని పుత్రులు లేదా పుత్రికలు పూర్తిగా మర్చిపోతున్నారు. తమ సంతానమే తమను పట్టించుకోకపోవడంతో ఎవరికోసం జీవితమంతా రెక్కలు ముక్కలు చేసుకుని కష్టపడ్డామో వారే పట్టించుకోకపోవడంతో ఆ వృద్ధ జీవులుమనుగడ కోసం నానా అగచాట్లు పడుతున్నాయి 'హెల్ప్ ఏజ్ ఇండియా' అనే సంస్థ దేశవ్యాప్తంగా మెట్రో నగరాల్లో ఈ విషయంపై జరిపిన సర్వేలో ఆశ్చర్యం గొలిపే విషయాలు వెలుగులోకి వచ్చాయి.



సర్వేలో పాల్గొన్న 59.47 శాతం మంది వృద్ధులు తమ కొడుకులు తమను నిర్లక్ష్యం చేస్తున్నారని చెప్పారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.ఆ సర్వే నివేదిక ప్రకారం దేశంలో ప్రస్తుతం ఉన్న వృద్ధుల్లో 29 శాతం మంది నగర, పట్టణ ప్రాంతాల్లో నివశిస్తుండగా 71 శాతం మంది గ్రామాల్లో ఉంటున్నారు. నగరాల్లో నివశించే వృద్ధుల్లో ఇతరులపై ఆధారపడి జీవించేవారు. 51.1 శాతం మంది కాగా చిన్న పట్టణాలు మాత్రం ఇటువంటివారు 12.4 శాతం మాత్రమే ఉన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర జనాభాలో పదిశాతం దాక వృద్ధులు ఉన్నారు. నగరాలవారీగా చూస్తే బెంగళూరు వంటి నగరాల్లో నివశిస్తున్న వారిలో 70 శాతం మంది తమ పిల్లలు తమను పట్టించుకోవడం లేదని తమ మనస్సులో మాటగా చెప్పారు. కొడుకుల సంగతే ఇలా ఉంటే కోడళ్లు మాత్రం తక్కువ తిన్నారా..?

కొడుకులు పట్టించుకోకపోవడం అటుంచితే కోడళ్ల ఆరళ్లకు గురిచేస్తున్నారని సర్వేలో పాల్గొన్న 61 శాతం మంది అత్తమామలు ఎంతో ఆవేదనగా చెప్పారు. కొడుకులు మాత్రమే కాదు కొంతమంది కూతుళ్లు కూడా తల్లిదండ్రులు పట్ల అమానుషంగా ప్రవర్తిస్తున్నారని ఆ సర్వేలో తేలింది. తమ అవసరం ఉందని తెలిసి తల్లిదండ్రులను అస్సలు పట్టించుకోని కూతుళ్ల సంఖ్య ఏడు శాతంగా ఉంది. చూడకపోగా చీటికిమాటికి తిట్టిపోస్తున్నారని ఆ కన్నహృదయాలు తల్లడిల్లుతున్నాయి. కన్నకూతుళ్లే పట్టించుకోకపోతే అల్లుళ్లు ఊరుకుంటారా..? అత్తింటివారిపై అన్ని రకాలుగా అసంతృప్తిగా ఉండే అల్లుళ్ల తమ తమ విశ్వరూపం చూపిస్తున్నారు. అత్తమామలను రాచిరంపాన పెడుతున్నారు. అందరూ కాదు గాని ఇలాంటి అల్లుళ్లు ఆరు శాతం వరకు ఉన్నారు. ఈ సమస్య కేవలం వ్యక్తిగతమైనది. మానవీయ విలువలకు సంబంధించింది. అందువల్ల తమకేదో చేస్తారని, పిల్లల్ని పెంచి పోషించాము కాబట్టి వారు చూడడం లేదన్న తల్లిదండ్రుల వైఖరిలో మార్పు రావలసి ఉంది. అలాగే అవసరముండి తల్లిదండ్రులను పట్టించుకోని సంతానం సినిమాలు చూసి, టీవీ సీరియల్స్ చూసి కన్నీళ్లు పెట్టే బదులు అదే దయ, జాలిని తమను, లేదా తమ భాగస్వామిని కని పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులపై చూపిస్తే బాగుంటుంది.

కోపం కూడా మంచిదే



విశాలాంధ్ర జనరల్ డెస్క్ : మనిషి మానసిక స్థితి పరిభాషే భావోద్వేగాలు. భావోద్వేగాలు మనుషుల పరిసరాల ప్రభావం, వాతావరణం, దైనందిన జీవితం,అలవాట్లపై ఆధారపడి ఉంటాయి. అసహజమైన భావోద్వేగాలతోనే సమస్య అంతా...మనిషి చర్మం భావోద్వేగాలకు బారో మీటర్ వంటిది. మన ఉద్వేగాలు మన ఆలోచనా సరళిపైన ప్రభావం చూపుతాయి. ఆనందం కలిగించే భావాలతో మనసుకూడా నిర్మలంగా ఉంటుంది. అదే కోపాన్ని కలిగించే భావాలతో హింస,ప్రతీకారంతో సమాజం కూడా భ్రష్టుపట్టిపోయే అవకాశంఉంది. ఆలోచనలను నియంత్రించడం ద్వారా ఉద్వేగాలను నియంత్రించవచ్చునని మానసిక వైద్యులు సూచిస్తున్నారు. ప్రస్తుతం సమాజంలో మనం ఎదుర్కొనే ప్రధాన సమస్య కోపం. వయసుతో నిమిత్తం లేకుండా కోపాన్ని ప్రదర్శించడం సాధారణమైపోయింది. చిన్నతనంలో పిల్లలు కావలసింది సాధించుకునేందుకు ప్రదర్శించే అస్త్రం కోపాన్ని ప్రదర్శించడమే.. బాధపడినపుడు చర్మకణాలు సంకోచించి, కోపాన్ని ప్రదర్శించినపుడు అవి దూరంగా సాగుతాయి. ప్రతికూల ప్రభావాలు మన దేహంపై ప్రభావాన్ని చూపుతాయి. ఈ మానసికిసమస్యలు మన ఆరోగ్యంపై పెనుప్రభావాన్ని చూపుతాయి.



గుండెపై ప్రభావం :

ముఖ్యంగా కోపాన్ని అణిచి పెట్టుకోవడం వల్ల గుండెపై ప్రభావాన్ని చూఉతుంది. గుండె సమస్యలతో బాధపడే రోగులకు వైద్యం చేసే ముందు వారి మనస్తత్వంపై అధ్యయనం చేస్తే వీరిలో ఎక్కువమంది వారి అభిప్రాయాలను ఎవరితో పంచుకునే అలవాటు లేదనీ, అన్నీ మనసులోనే ఉంచుకుంటున్నట్లు వైద్యులు తెలిపారు. వారి సమస్యకు కూడా ప్రధాన కారణం వారి ప్రవర్తనే. మన ప్రవర్తనే మనలోనే ఉద్వేగాలను బహిర్గతం చేస్తుంది.

కోపం కూడా మంచిదే..

చిన్న చిన్న కోపాలతో శరీరంలో కలిగేచలనాలు కేన్సర్ కారకాలపై పోరాడేశక్తిని ఉత్పన్నం చేస్తాయని తెలుస్తోంది. కేన్సర్‌రోగుల జీవన విధానం, ఆలోచనా సరళి, ప్రవర్తనలపై పరిశోధన తెలిసిందేమంటే వారంతా కోపాన్ని ఎట్టి పరిస్తితుల్లోనూ బైటపెట్టేందుకు ఇష్టపడకుండా వారిలోనే సమాధి చేయడమే కేన్సర్‌కు కారణమంటున్నారు. ప్రసిద్ధ కేన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ బ్రూక్స్. కేన్సర్ కారక కణాలను నాశనంచేసే శక్తి కోపానికి ఉంది, భావోద్వేగాలను బహిర్గతం చేసేప్పుడు శరీరంలో కలిగే చలనాలకు అంత శక్తి ఉంటుందని తెలుస్తోంది. కొందరు వ్యక్తుల్లో మెదడు పంపే సంకేతాలకన్నా భావోద్వేగాల ప్రభావం ఎక్కువగా పనిచేయడంతో అది ప్రతికూల ప్రభావం చూపి మానసిక శాంతిని కోల్పోయే ప్రమాదం ఎదురవుతొంది. అనవసరమైన ఆలోచనలకు తావివ్వకుండా స్వీయ చర్చను ప్రోత్సహిస్తున్నారు మానసిక శాస్త్రవేత్తలు. దీనివలన పరిస్థితులను బేరీజు వేసుకోవచ్చు. తార్కికంగా ఆలోచించడంతోపాటు ప్రతిస్పందనలను కూడా తెలుసుకోవచ్చు. ఈ కారణంగా సహజంగా ఆలోచించే అవకాశం ఉంటుంది. సాత్విక ఆహారంతోపాటు క్రమం తప్పకుండా చేసే శారీరక వ్యాయామం కూడా మనిషి ఆలోచనలపై ప్రభావం చూపుతుందని ప్రయోగాత్మ కంగా రుజువైంది. ఆరోగ్యకరమైన జీవనశైలితో మనిషి ప్రశాంతంగా జీవనం సాగించవచ్చు. శారీరక వ్యాయామంతో శారీరకంగానేకాక, ఆలోచనాపరంగా కూడా ప్రభావం చూపుతుంది. రోజుకు కనీసం 30నిమిషాల వ్యాయామం అంటే వాకింగ్, సైక్లింగ్,స్విమ్మింగ్‌తో మెదడు స్టిమ్యులేట్ చేయబడుతుంది. మెదడు కణజాలం ఉత్సాహంగా ఉంటుంది అలా ఉంటే మానసికంగా మనం ఆరోగ్యంగా ఉన్నట్లే...

ఆరోగ్యకర ఆలోచనలకు కొన్ని చిట్కాలు

- మీలోని భావోద్వేగాలు, ప్రతిచర్యలు తెలుసుకోండి
- జీవితంలో నిరుత్సాహానికి గురయ్యే పరిస్తితులు గుర్తించండి. వాటిని మార్చుకోడానికి ప్రయత్నించండి.
- మీలో ఉన్న భావాలను పంచుకోడానికి ప్రయత్నించండి అంటే ఎదుటివారి వాదనను కూడా వినండి.
- ఒత్తిడికి ప్రధానకారణం ఆందోళన, కోపమేనని గుర్తించండి. వీటితోనే మన సంబంధ బాంధవ్యాలు దెబ్బతింటున్నాయి.
- ఏ పనైనా చేసేముందు ఒక్కసారి ఆలోచించండి మీకేతెలుస్తుంది.ఏది సరైనదో..
- ఆందోళనకలిగించే పరిస్థితులను మార్చేందుకు ప్రయత్నించండి.
- విశ్రాంతి కిటుకులు పాటించండి అంటే.. దీర్ఘశ్వాస తీసుకోండి, కంటినిండానిద్రపోండి. జీవితాన్ని ఆరోగ్య, ఆనందమయం చేసుకోండి.

విశాలాంధ్ర బిజినెస్

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)		
కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
ఐసీఐసీఐ బ్యాంక్	317.70	2.65
భారతి ఇన్‌ఫ్రాటెల్	374.80	1.92
జీ ఎంటర్‌టైనర్	591.00	1జ90
వేదాంత	339.55	1.69
ఓఎన్‌జీ	200.75	1.44

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)		
కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
యూపీఎల్	775.35	-1.38
అన్‌డ్రాయిడ్ ఫార్మా	667.05	-1.11
లుపిన్	919.10	-1.09
భారతి ఎయిర్‌టెల్	509.55	-1.01
బాష్	19,771.60	-0.92

విదేశీమారకం విలువ (ఫారెక్స్)		
కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	63.61	63.28
యూరో	77.16	76.12
పౌండ్	86.71	85.87
ఆస్ట్రేలియా డాలర్	50.07	49.95
సింగపూర్ డాలర్	47.79	48.09

బులియన్		
బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	28,470	30,449
చెన్నై	28,500	30,481
బెంగళూరు	27,950	29,893
ముంబై	29,130	31,144
విజయవాడ	28,550	30,700

బడ్జెట్‌లో వ్యవసాయానికి పెద్దపీట !



న్యూఢిల్లీ : దేశంలో వ్యవసాయ రంగానికి మంచి రోజులు రాబోతున్నాయి. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలని యోచిస్తున్న కేంద్ర ప్రభుత్వం ఈసారి పార్లమెంట్‌కు ప్రతిపాదించనున్న సార్వత్రిక బడ్జెట్‌లో వ్యవసాయ పరిశోధన, విద్యా రంగానికి పెద్దపీట వేసి కేటాయింపులను 15 శాతం మేరకు (దాదాపు రూ.8 వేల కోట్లకు) పెంచే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2018-19) సంబంధించిన సార్వత్రిక బడ్జెట్‌ను ఫిబ్రవరి 1వ తేదీన పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న విషయం తెలిసిందే. గత కొన్ని సంవత్సరాల నుంచి బడ్జెట్‌లో వ్యవసాయ విద్యకు కనీసం 10 శాతం మేరకు కేటాయింపులను పెంచుతున్న కేంద్ర ప్రభుత్వం ఈసారి బడ్జెట్‌లో వ్యవసాయ పరిశోధన, విద్య విభాగానికి (డీఏఆర్‌ఈ) అదనంగా 15 శాతం కేటాయింపులు జరుపుతుందని ఆశిస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

దేశానికి వెన్నెముకలా నిలుస్తున్న వ్యవసాయ రంగంలో ప్రస్తుతం నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని, ఆధునిక ఆవిష్కరణలను అందిపుచ్చుకోవడం ద్వారా రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్న సంకల్ప సాధన దిశలో వేగవంతంగా ముందుకు సాగేందుకు ప్రాధాన్యతా రంగాల వారీగా ఈ నిధులను వినియోగిం చడం జరుగుతుందని ఆ వర్గాలు వివరించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ పరిశోధన, విద్యా విభాగానికి తొలుత రూ.6,800 కోట్లు కేటాయించిన కేంద్ర వ్యవసాయానికి పెద్దపీట!

ప్రభుత్వం ఆ తర్వాత అనుబంధ పద్దు ద్వారా ఈ విభాగానికి మరికొన్ని కేటాయింపులు జరపడంతో ఈ మొత్తం కేటాయింపులు దాదాపు రూ.7 వేల కోట్లకు చేరాయి. వచ్చే ఆర్థిక సంవత్సరం దేశంలోని వివిధ ప్రాంతాల్లో, ప్రత్యేకించి ఆర్థికంగా వెనుకబడిన 150 జిల్లాల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, వ్యవసాయ ఆవిష్కరణలను ఉపయోగించడం ద్వారా గిరిజన ప్రాంతాల్లోని రైతుల సామర్థ్యాన్ని పెంపొందించడంపై దృష్టి కేంద్రీకరించాలని డీఏఆర్‌ఈ యోచిస్తున్నది.

త్వరలో దేశీయ క్రిప్టో కరెన్సీ

- జియోకాయిన్‌ను సృష్టించేందుకుముఖేష్ అంబానీ కసరత్తు
- కుమారుడి ఆధ్వర్యంలో 50 మంది నిపుణులతో ప్రత్యేక టీమ్



న్యూఢిల్లీ: దేశీయ టెలికం మార్కెట్లో శరవేగంగా దూసుకెళ్తున్న రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేష్ అంబానీ ఇప్పుడు మరో సంచలనాన్ని సృష్టించబోతున్నారు. జియోకాయిన్ పేరుతో సొంతగా క్రిప్టో (అదృశ్య) కరెన్సీని సృష్టించాలని ముఖేష్ అంబానీ యోచిస్తున్నారని, ఈ ప్రాజెక్టును ప్రారంభించేందుకు ఆయన దాదాపు 50 మంది యువ నిపుణులతో కూడిన టీమ్‌ను ఏర్పాటు చేయబోతున్నారని లైవ్‌మింట్ వెల్లడించింది. ఈ టీమ్‌కు ముఖేష్ అంబానీ పెద్ద కుమారుడు ఆకాష్ అంబానీ సారథ్యం వహించనున్నట్లు తెలుస్తున్నది. క్రిప్టో కరెన్సీని రూపొందించడం, దానిని విక్రయించడం లాంటి అంశాలను ఈ టీమ్ పరిశీలిస్తుంది.

ప్రస్తుతం బిట్‌కాయిన్ లాంటి ఊహాజనితమైన వర్చువల్ కరెన్సీకి ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ పెరుగుతున్న విషయం తెలిసిందే. ఇటువంటి క్రిప్టో కరెన్సీల్లో పెట్టుబడులు పెట్టేందుకు దేశ, విదేశాల్లో అనేక మంది ఆసక్తి చూపుతుండటంతో ఈ వ్యాపారంపై జియో ఇన్ఫోకామ్ కూడా దృష్టి సారించిందని, ఇందులో భాగంగానే జియోకాయిన్ పేరుతో సొంతగా క్రిప్టో కరెన్సీని సృష్టించాలని నిర్ణయించిందని లైవ్‌మింట్ పేర్కొన్నది. అయితే క్రిప్టో కరెన్సీల్లో పెట్టుబడులు పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటిదాకా ఎవరికీ అనుమతి ఇవ్వలేదు.

ఇది చట్టవిరుద్ధమైన కరెన్సీ అని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఇప్పటికే పలుమార్లు పునరుద్ఘాటించడమే కాకుండా ఇందులో ఎవరూ పెట్టుబడులు పెట్టరాదని హెచ్చరించారు. బిట్‌కాయిన్ లాంటి క్రిప్టో కరెన్సీల్లో పెట్టే పెట్టుబడులకు ఎటువంటి గ్యారెంటీ ఉండదని ఆయన స్పష్టం చేశారు

టీసీఎస్‌కు అతిపెద్ద కాంట్రాక్టు

న్యూఢిల్లీ: దేశీయ ఐటీ సంస్థల్లో అతిపెద్దదైన టీసీఎస్ (టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్)కు అమెరికా సంస్థ నుంచి 200 కోట్ల డాలర్ల (రూ.13 వేల కోట్లు) పైగా విలువైన భారీ కాంట్రాక్టు లభించింది. ట్రాన్‌అమెరికా ఇన్సూరెన్స్ గ్రూపు నుంచి ఈ కాంట్రాక్టు లభిం చిందని, ఇప్పటివరకూ తాము కైవసం చేసు కున్న కాంట్రాక్టుల్లో ఇదే అతిపెద్దదని టీసీఎస్ ఒక ప్రకటనలో వెల్లడించింది. టెలివిజన్ రేటింగ్‌లను నిర్ణయించే ప్రముఖ సంస్థ నీల్సన్ నుంచి భారీ కాంట్రాక్టును దక్కించుకున్న టీసీ ఎస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబం ధించిన మూడో త్రైమాసిక (నవంబర్- డిసెంబర్) ఫలితాలను ప్రకటించిన మరుసటి రోజే మరో మెగా కాంట్రాక్టును కైవసం చేసుకోవడం విశేషం.

విజ్ఞానం

ఒబెసిటీ జన్యువు గుర్తింపు



ఒబెసిటీకి కారణమైన జన్యువును శాస్త్రజ్ఞులు గుర్తిం చారు. 13జీన్స్‌లో ఉండే వైవి ధ్యాలు బాడీ మాస్ ఇండెక్స్ పై ప్రభావం చూపుతున్నట్లు తెలుస్తోంది. 13 జన్యు వులలో ఉండే 14 జనెటిక్ వేరియేషన్స్ ఒబెసిటీకి కారణమని తెలుస్తోంది. ఏజ4R అనే జన్యువును 5000 మందిలో ఒకరిలో గుర్తించారు. దీనివలన 15పౌండ్ల బరువు ఎక్కువగా ఉన్నట్లు తేలింది. ఈ జన్యువు మెదడుకు పంపే సంకేతాల ప్రోటీన్‌ను ఉత్పత్తి చేయడంలేదని గుర్తించారు. శరీర బరువును నియంత్రించే న్యూరోనల్‌ను వీరు గుర్తించారు. ఇది ఆకలిని, ఆహారాన్ని తీసుకోవడం వంటి చర్యలను నియంత్రిస్తుంది. ఈ జీన్ సంక్రమణలోని వైవిధ్యాలతోనే అసలు సమస్య అంతా...700,000 మందిపై చేపట్టిన జనెటిక్ గణాంకాల ఆధారంగా GIPR జీన్‌లోని వైవిధ్యాన్ని కూడా గుర్తించారు. దీనిద్వారా కొంతమంది ఇతరులకంటే త్వరగా శరీర బరువు త్వరగా పెరగడానికి కారణాన్ని అన్వేషిస్తున్నారు.

సిరియల్స్‌తో కీళ్లనొప్పులు దూరం



ఉదయంపూట తినే అల్పాహారంలో సిరియల్స్‌లతో పాటు డ్రైఫ్రూట్స్,నట్స్ పాలల్లో కలిపి తినడం వల్ల కీళ్లనొప్పుల సమస్య తగ్గుతుందని తెలుస్తోంది. పీచు పదార్థం ఎక్కువగాఉండే సిరియల్స్, పండ్లు, కూరగాయల వినియోగంతో దీర్ఘకాలంగా ఉన్న కీళ్ల నొప్పులు తగ్గుముఖం పట్టాయని తెలుస్తోంది. జర్మనీలోని ఫ్రెడ్‌రిచ్ అలెక్జాండర్ యూనివర్సిటీ చేపట్టిన అధ్యయనంలో ఫైబర్ ఎక్కువగా ఉండే ఆహార పదార్థాల వినియోగంతో ఇంటెస్టినల్ బాక్టీరియాకు దూరంగా ఉండవచ్చునని తెలుస్తోంది. ఇంటెస్టినల్ బాక్టీరియా పెరిగేందుకు పులిసిన పదార్థాల్లో ఉండే ప్రొపయోనేట్, బ్యుటిరేట్‌పై వీరు ప్రధానంగా దృష్టి సారించారు.

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (విజయవాడ)	వెండి	డాలరు Vs రూపాయి	ముడి చమురు
88.09 ▲	30.05 ▲	-150 ▼	▲		▲
34,592.39	10,681.25	29,570	40,000	63.28	69.26
		22 క్యారెట్లు, 10 గ్రాములు	కిలో (రూపాయల్లో)		బ్రెంట్ ధర (డాలర్లలో..)

కార్డులతో ఆర్థిక క్రమశిక్షణ..



క్రెడిట్ కార్డు ఎందుకు ఉండాలి? ఈ సందేహం చాలామందికి వస్తుంది. కార్డు లేకుండా ఉండటమే ఉత్తమం అంటారు కొందరు. కానీ, ప్రస్తుత తరుణంలో ఆర్థిక లావాదేవీలన్నీ నగదు రహితంగా.. డిజిటల్ విధానంలోనే జరుగుతున్నాయి. కాబట్టి, కార్డు వాడుతూ.. అది అందించే ప్రయోజనాలు పొందేందుకు ఏం చేయాలో తెలుసుకోవాలి.

జేబులో డబ్బు తీసుకొని వెళ్లే రోజులు పోయాయి. నిర్ణీత మొత్తానికి మించి, నగదు కొనుగోళ్లు అనుమతించని నిబంధనలు ఉన్నందున వీలైనంత వరకూ క్రెడిట్, డెబిట్ కార్డుల ద్వారానే కొనుగోళ్లు చేయాల్సిన పరిస్థితిని కల్పిస్తోంది. అవసరానికి చేతిలో డబ్బు లేకపోయినా.. మన అవసరం తీర్చేందుకు క్రెడిట్ కార్డు ఉపయోగపడుతుంది. కాస్త అధిక కొనుగోళ్లు చేసినా.. వాయిదాల్లో ఆ బాకీని తీర్చే వెసులుబాటూ ఉంటుంది. అవసరమైతే నగదును తీసుకునే వెసులుబాటూ క్రెడిట్ కార్డు మనకు కల్పిస్తుంది.

ఏదైనా కొనడానికే క్రెడిట్ కార్డు అనే అపోహ కూడా చాలామందిలో ఉంటుంది. కానీ, ఇది పూర్తిగా నిజం కాదు. క్రెడిట్ కార్డును జాగ్రత్తగా వినియోగించుకోవడం నేర్చుకుంటే.. ఇది మన ఆర్థిక అలవాట్లనూ, కొనుగోలు విధానాన్ని పూర్తిగా మార్చేస్తుంది. ఉన్న పరిమితి మేరకు ఎలా ఖర్చు చేయాలో ఇది మనకు తెలియజేస్తుంది. కొనుగోళ్లు చేసేందుకు ఉపయోగపడటం క్రెడిట్ కార్డు ప్రాథమిక లక్షణం అయినప్పటికీ.. ఇది అందించే మరికొన్ని ప్రయోజనాలూ తెలుసుకోవాల్సినవే..

రాయితీలు : క్రెడిట్ కార్డు కంపెనీలు కొన్ని హోటళ్లు, కారు అద్దెకు ఇచ్చే సంస్థలు, షాపింగ్ మాళ్లలో కొన్ని ప్రత్యేక ఒప్పందాలు కుదుర్చుకుంటాయి. ఇక్కడ మీరు కార్డును వాడినప్పుడు రాయితీల ప్రయోజనాలను పొందేందుకు అవకాశం ఉంటుంది. కొన్నిసార్లు ఈ రాయితీల వల్ల పెద్ద మొత్తంలో మిగిలే అవకాశం ఉంది. కాబట్టి, మీరు వాడుతున్న కార్డు ఏయే సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుందో ఒకసారి తెలుసుకోండి.

బీమా రక్షణ : ప్రస్తుతం చాలా క్రెడిట్ కార్డులు తమ ఖాతాదారులకు రకరకాల బీమా పాలసీల సౌకర్యాన్ని కల్పిస్తున్నాయి. ముఖ్యంగా ప్రయాణ బీమా పాలసీలను అందిస్తున్నాయి. మీరు ఎక్కడికైనా ప్రయాణిస్తున్నప్పుడు... ముందుగానే క్రెడిట్ కార్డు సంస్థను ఈ విషయాన్ని తెలుసుకోండి.



నగదు వెనక్కి : క్రెడిట్ కార్డును వాడుతున్నప్పుడు కొన్నిసార్లు నగదు వెనక్కి ఇస్తుంటాయి. మీరు వినియోగించిన మొత్తాన్ని బట్టి, ఇది దాదాపు 10శాతం వరకూ ఉండొచ్చు. ఇలా నగదు వెనక్కి రావడం అంటే.. ఆ మేరకు మీ ఖర్చు తగ్గినట్లే కదా! సాధారణంగా నగదు కొనుగోలు చేసినప్పుడు ఎలాంటి రాయితీలు, డిస్కౌంట్లు ఉండకపోవచ్చు. కానీ, కార్డు ద్వారా కొన్నప్పుడు మీకు వచ్చే నగదు వెనక్కి, రాయితీల్లాంటివి మీకు లాభంగానే చెప్పుకోవచ్చు.

వ్యవధి : వెంటనే డబ్బు ఖర్చు పెట్టి కొనుగోలు చేయాల్సిన అవసరం లేకుండా.. కార్డుతో కొంటే దాదాపు 45-60 రోజుల వరకూ వ్యవధి దొరుకుతుంది. దీనివల్ల మీపై అప్పటికప్పుడు ఆర్థిక భారం ఉండదు. ఇలా వ్యవధి దొరకడం వల్ల మీ బడ్జెట్‌ను కాస్త సర్దుబాటు చేసుకునేందుకు వీలవుతుంది. మీ దగ్గర ఉన్న మొత్తం కన్నా అధికంగా ఖర్చు చేయాల్సిన పరిస్థితుల్లో ఇది ఎంతో అనుకూలంగా ఉంటుంది. ప్రయోజనాల మాటున కొన్నిసార్లు ఇబ్బందులూ ఉంటాయి. క్రెడిట్ కార్డులను అర్థం చేసుకోవడంలో పొరపాట్లు చేస్తే.. కష్టాలు తప్పవు.

ఎక్కడ ఖర్చు చేస్తున్నారు : ఏదో ఒక క్రెడిట్ కార్డు అని తీసుకోవడం ఎప్పుడూ సరికాదు. ఎక్కడ ఏ కార్డును వాడుతున్నామన్నదీ ముఖ్యమే. మీరు తరచూ ఎక్కడ కార్డు వాడుతున్నారన్నది ముందుగా అవగాహన ఉండాలి. మీ ఖర్చులకు తగ్గట్టుగా.. ఏ కార్డు రాయితీలు, నగదు వెనక్కి లాంటి ప్రయోజనాలు అందిస్తుందో తెలుసుకోవాలి. ప్రయాణాలు ఎక్కువగా చేసేవారు.. హోటళ్లు, రెస్టరెంట్లలో రాయితీలను ఇచ్చే కార్డులను తీసుకోవడం కలిసొస్తుంది. ఎక్కువగా కొనుగోళ్లు చేసేవారు డిస్కౌంట్లను అందించే కార్డులను తీసుకోవాలి.

పరిమితి ఎంత? : మీరు సాధారణంగా ఎంత మేరకు ఖర్చు చేస్తారో ఆ మేరకే కార్డు ఉండేలా చూసుకోండి. అవసరం లేకున్నా.. అధిక పరిమితి ఉన్న కార్డును తీసుకోవడం వల్ల ఏదైనా మోసపూరిత లావాదేవీలు జరిగినప్పుడు ఎక్కువ మొత్తంలో నష్టపోవాల్సి రావచ్చు. అంతేకాకుండా.. అధిక పరిమితి ఉంటే.. అనవసరంగా ఎక్కువ ఖర్చు చేసే ప్రమాదమూ ఉంది. అర్హత ఉంటే.. అవసరాన్ని బట్టి, పరిమితిని పెంచుకునే వెసులుబాటు ఎప్పుడూ ఉంటుంది. కార్డుల వాడకంలో ఎంత దూకుడుగా ఉంటామో.. వాటికి బిల్లులు చెల్లించే విషయంలో అంతే క్రమశిక్షణగా ఉండాలి. లేకపోతే.. అనవసర వడ్డీలు, రుసుములు మనపై భారం మోపుతాయి. రుణ చరిత్ర, క్రెడిట్ స్కోరులాంటివి కూడా దెబ్బతింటాయి. పూర్తి బిల్లు చెల్లించకపోయినా... కనీస మొత్తం చెల్లించే విషయంలోనైనా ఎప్పుడూ జాప్యం చేయకండి.

రివార్డు పాయింట్లు : మీరు కొనుగోలు చేసిన మొత్తాన్ని బట్టి, మీ క్రెడిట్ కార్డు మీకు కొన్ని రివార్డు పాయింట్లను కేటాయిస్తుంది. మీరు కార్డు వాడిన ప్రతిసారీ ఎన్నో కొన్ని రివార్డు పాయింట్లు మీ ఖాతాలో జమ అవుతాయి. ఇవి నిర్ణీత సంఖ్యకు చేరిన తర్వాత నగదుగా మార్చుకోవచ్చు. లేదా ఏదైనా వస్తువులు కొనుగోలు చేయవచ్చు. మీరు కార్డును ఉపయోగిస్తున్నందుకు ఏదైనా ఫీజులు చెల్లించాల్సి వచ్చినప్పుడు ఈ రివార్డు పాయింట్లను అందుకు ఉపయోగించుకొని, మీపై భారం లేకుండా చూసుకోవచ్చు.

ఖర్చులను సరిచూసుకోండి : మీ ఖర్చులకు క్రెడిట్ కార్డునే వాడటం వల్ల మీ బడ్జెట్‌ను సులభంగా ప్రణాళిక వేసుకునేందుకు వీలవుతుంది. బిల్లును చూడగానే నెలకు ఎంత ఖర్చు చేశామన్నది సులభంగా తెలుస్తుంది. ఇందులో అనవసర ఖర్చులు అనుకున్నవి, వచ్చే నెలలో తగ్గించుకునేందుకు ప్రయత్నించవచ్చు. ఇలా ఖర్చులను నియంత్రించుకునే దిశగా అడుగులు వేయవచ్చు.

ఇంటి రుణం ఎంతిస్తారు?



సొంతింటి కల కనేవారికి పండగలకు మించిన తరుణం లేదు. నిర్మాణ సంస్థల ప్రోత్సాహకాలు, బ్యాంకులు వడ్డీలో రాయితీలు ఇవ్వడం ఇల్లు కొనాలనుకునే వారికి కలిసొచ్చే అంశాలు. మరి మనం కొనే ఇంటికి బ్యాంకు రుణమెంత మంజూరు చేస్తుందో కనుక్కోవడమెలా? తీరా మనం ఇల్లు చూసుకున్నాక బ్యాంకు తగినంత అప్పు ఇవ్వనంటే? కాబట్టి సొంతింటి కల సాకారం చేసుకోవాలనుకునే ప్రతి ఒక్కరూ రుణం ఎంతిస్తారో తప్పక తెలుసుకోవాలి.

ఇప్పుడు ప్రతి బ్యాంకూ ఎంత రుణం వస్తుందో తెలుసుకునేందుకు వీలు కల్పిస్తుంది. బ్యాంకుల వెబ్‌సైట్లలో ఈ విషయం సులభంగా తెలిసిపోతుంది. కొన్ని ప్రైవేటు సంస్థలూ రుణం ఎంత రావచ్చనే విషయాన్ని తెలియజేస్తున్నాయి. అయితే, ఇదేమీ తుది నిర్ణయం కాదు. మీరు కొనబోయే ఇంటి విలువను బట్టి రుణమెంత ఇవ్వాలనే విషయాన్ని బ్యాంకులు నిర్ణయిస్తాయని గుర్తుంచుకోండి. ఉదాహరణకు మీకు రూ.25 లక్షల రుణం వస్తుందని అనుకుందాం. మీరు కొనే ఇంటి విలువ కూడా అంతే ఉంటే.. మీకు మొత్తం వందశాతం రుణమిస్తారని భావించకండి. పదిహేను శాతమైనా మీ చేతిలో నుంచి పెట్టుకోవాల్సిందే. బ్యాంకులను బట్టి ఇది గరిష్టంగా పాతిక శాతం వరకూ ఉండొచ్చు.

- రుణ అర్హత మొత్తాన్ని బట్టి ఆ బడ్జెట్ (మీ వాటా 25 శాతం వరకు కలిపి) అటుఇటూగా ఉండే ఇళ్ల కోసం వేట ప్రారంభించండి. బడ్జెట్‌పై స్పష్టత ఉండటం వల్ల మీక్కావాల్సిన ఇంటిని తేలికగా గుర్తించొచ్చు. ఇలా చేయడం వల్ల మీ సమయమెంతో ఆదా అవుతుంది. లేదంటే కన్పించిన ప్రాజెక్టును చూడటం.. నచ్చిన వాటికి రుణం కోసం ప్రయత్నించి, తగినంత రాలేదని దాన్ని వదులుకోవడం.. మరోటి చూడటం.. ఇలా చేస్తే వృథా ప్రయాస తప్ప తప్ప మరోటి ఉండదు.
- ఇల్లు ఏ ప్రాంతంలో కొంటే బావుంటుందో నిర్ణయించుకోండి. ఇల్లు కొంటున్నది పెట్టుబడి దృష్టితోనా? మీరు అందులో నివసిస్తారా? వంటి విషయాల్ని దృష్టిలో పెట్టుకోండి. మీరు ఉండటం కోసమే అయితే, ఆ ప్రాంతాన్ని పరిశీలించండి. చుట్టుపక్కల మౌలిక సదుపాయాలు ఎలా ఉన్నాయి? మీ జీవనశైలికి అనువుగా ఉందా? అన్నది చూడండి.
- ఇల్లు కొనేది పెట్టుబడి కోసమైతే.. విలువను పెంచే సానుకూల అంశాలేం ఉన్నాయి? అద్దె ఎంత వస్తుంది వంటి విషయాల్ని చూడాలి.
- ఇల్లు ముందా.. రుణం ముందా అన్న సందేహం ఎవరికైనా కలగకమానదు. ఇల్లు ముందే దొరక్కపోయినా.. అంతకంటే ముందే బ్యాంకు నుంచి గృహరుణానికి ఆమోదం పొందొచ్చు. మీ ఆదాయ వివరాల్ని తెలియజేస్తే రుణమెంత చేతికొస్తుందో బ్యాంకే తెలియజేస్తుంది. కొన్ని బ్యాంకులు గృహనిర్మాణ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాయి. ఇలాంటివాటిని ఎంపిక చేసుకున్నప్పుడు సులభంగా గృహరుణం పొందే వీలుంది. మొత్తానికి ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తే సమయం వృథా అన్నది కన్పించదు. మీక్కావాల్సిన ఇల్లు దొరికితే చాలు.. వీలైనంత త్వరగా రుణం మంజూరవుతుంది.

ఇదీ లెక్క

వార్షికాదాయం రూ.8 లక్షలున్న కుటుంబం ఖర్చులు, పొదుపు పోనూ రూ.40 లక్షల ఇల్లు కొనుక్కోవడం మేలని నిపుణులు సూచిస్తున్నారు. బ్యాంకులు కూడా రుణగ్రహీతకు భారం కాకుండా ఉండేలా రుణ మొత్తాన్ని నిర్ణయిస్తాయి. సాధారణంగా చాలా బ్యాంకులు చేతికొచ్చే జీతంలో నెలసరి వాయిదా 40-50 శాతానికి మించకుండా చూస్తాయి.



'అన్నపూర్ణ' వడ్డిస్తున్న పొంగలి.. రంగుల రాట్నం!



యంగ్ హీరో రాజ్ తరుణ్ హీరోగా చిత్ర శుక్లా హీరోయిన్‌గా శ్రీరంజని దర్శకత్వంలో 'రారండోయ్ వేడుక చూద్దాం', 'హలో' వంటి హిట్ చిత్రాలను అందించిన ప్రముఖ నిర్మాణ సంస్థ అన్నపూర్ణ స్టూడియోస్ రూపొందిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రం 'రంగులరాట్నం'. ఈ చిత్రం జనవరి 14న సంక్రాంతి స్పెషల్‌గా ప్రపంచ వ్యాప్తంగా విడుదల అవుతుంది. ఈ సందర్భంగా హైదరాబాద్ అన్నపూర్ణ సెవెన్ ఏకర్స్‌లో ప్రెస్‌మీట్‌ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అక్కినేని నాగార్జున, హీరో రాజ్‌తరుణ్, హీరోయిన్ చిత్ర శుక్లా, ప్రముఖ నటి సితార, దర్శకురాలు శ్రీరంజని, నటుడు ప్రియదర్శి, సంగీత దర్శకుడు శ్రీచరణ్ పాకల పాల్గొన్నారు.

అక్కినేని నాగార్జున మాట్లాడుతూ - "అందరికీ హ్యాపీ న్యూ ఇయర్. సంక్రాంతి శుభాకాంక్షలు. 'రంగుల రాట్నం' చిత్రాన్ని మా అన్నపూర్ణ వాళ్లు వడ్డించే సంక్రాంతి పొంగలి అని మేం అనుకుంటున్నాం. నేను సినిమా చూశాను. మా సినిమా ఇది. బొబ్బట్టులాగా ఉంటుంది. చాలా తీపిగా, చాలా బావుంటుంది. ఒక రియల్ ఫిల్మ్ ఇది. రియల్ అంశాలతో తీసిన సినిమా. తల్లీకొడుకుల మధ్య ఎమోషన్స్, ఒక కుర్రాడికి, అతనికి కాబోయే భార్యకు మధ్య వచ్చే సన్నివేశాలను చూస్తుంటే నా కళ్ల ముందే పాత్రలన్నీ కదులుతున్నట్టు అనిపించింది. లక్కీగా నాకు సంక్రాంతికి డేట్ దొరికింది. సినిమాను నెల రోజుల క్రితమే రెడీ చేసి పెట్టాం. సంక్రాంతికి లక్కీగా డేట్ దొరికేసరికి ఫ్రీజ్ చేశాం. ఫ్యామిలీస్ అందరూ కలిసి చూడదగ్గ సినిమా. నవ్వుకుంటూ, అప్పుడప్పుడూ కొంచెం కంటతడి పెడుతూ ప్రేక్షకులు చూస్తారు. నాకు ఈ సినిమా కథ ఏడాది క్రితం చెప్పారు. ఏడాదిలో ఇంకో వంద కథలు వినుంటాను. అప్పుడు విని బావుంది ఈ కథ అని మా ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ సుప్రియకి చెప్పాను. చేయొచ్చు అని గ్రీన్ సిగ్నల్ ఇచ్చాను. అయితే ఆ తర్వాత కథని మర్చిపోయాను. రీసెంట్‌గా సినిమాను ప్రేక్షకుడిగానే చూశాను. నాకు చాలా బాగా నచ్చింది. ప్లెజెంట్ సర్‌ప్రైజ్‌లాగా అనిపించింది. లెంగ్తులు కాస్త ఎక్కువైతే తగ్గించమని చెప్పాను. అంతవరకే నేను ఇందులో పాల్గొన్నది. ఏదేమైనా మా సంస్థకు చాలా మంచి పేరు వస్తుంది. ఎవరు ఏం చేసినా క్రెడిట్ నాకే దక్కుతుంది కాబట్టి నాకు చాలా హ్యాపీ. శ్రీరంజనికి దర్శకురాలిగా తొలి చిత్రమిది. ఎలా నెరేట్ చేసిందో అప్పుడు గుర్తులేదు. కానీ సినిమాను ఎక్స్‌పీరియన్స్‌గల డైరెక్టర్‌గా బాగా తెరకెక్కించింది. ఎమోషన్స్, మదర్ ఎమోషన్స్, అమ్మాయి ఎమోషన్స్‌ని ఓ అమ్మాయి పాయింట్ ఆఫ్ వ్యూ నుంచి చూపించింది. మేం రాజ్‌తరుణ్‌తో 'ఉయ్యాల జంపాల' చేశాం. తను నేచురల్ యాక్టర్. చాలా బాగా చేస్తాడు. ఒక సీన్‌లో తల్లిని ప్రేమించే అబ్బాయిలాగా బిత్తరచూపులతో చేశాడు. నాకు రకరకాల విషయాలు గుర్తొచ్చాయి. అతని యాస ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది. మా నాయిక చిత్ర సినిమాలోనూ చాలా అందంగా ఉంది. సినిమాలో అందరూ రియల్‌గా ఉన్నారు. అదే నాకు చాలా బాగా నచ్చింది. అందరికీ ఆల్ ది బెస్ట్. ప్రియదర్శి చాలా బాగా చేశాడు. తను ఈ సినిమాకు పెద్ద హైలైట్ అవుతాడు. నేచురల్ టైమింగ్, నేచురల్ కామెడీ ఉన్న సినిమా ఇది. సితారగారు తల్లి పాత్రలో చాలా బాగా చేశారు. సితారకు, రాజ్‌తరుణ్‌కి మధ్య ఉన్న తల్లీ కొడుకుల రిలేషన్ షిప్ చాలా బాగా పండింది. ఆమె చాలా చక్కగా డబ్బింగ్ కూడా చెప్పారు. ఆమె ఎక్స్‌ప్రెషన్స్‌కి డబ్బింగ్ చాలా బాగా కుదిరింది. ఈ సంక్రాంతికి స్వీట్ లవ్లీ ఫిల్మ్ అవుతుంది. 'రంగులరాట్నం'లాగా చక్కగా, హాయిగా చూడొచ్చు" అన్నారు.

దర్శకురాలు శ్రీరంజని మాట్లాడుతూ - "నన్ను, నా కథని నమ్మి ఈ చిత్రం చేసే అవకాశం ఇచ్చిన నాగార్జునగారికి నా కృతజ్ఞతలు. నాగార్జునగారు కథ విని చాలా బాగుంది ఈ సినిమా మనం చేస్తున్నాం అనగానే నాలో కాన్ఫిడెన్స్ మరింత పెరిగింది. రెండు సంవత్సరాలు కష్టపడి ఈ సినిమా చేశాం. డైరెక్షన్ అంటే నాకు ప్యాషన్, యాంబిషన్. ఫొటోగ్రాఫర్ మది, ఆర్ట్ డైరెక్టర్ రాజీవన్ కథ విని ఇంప్రెస్ అయి అన్నపూర్ణ స్టూడియోస్‌కి పంపించారు. సుప్రియ స్క్రిప్ట్ విని ఓకే చేశారు. మేకింగ్ విషయంలో సుప్రియగారు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ప్రసాద్ ఎంతో సపోర్ట్ చేశారు. టీం అందరి సహకారంతో మంచి సినిమా తీయగలిగాను. అన్నపూర్ణ స్టూడియోస్‌లాంటి బిగ్ బేనర్ ద్వారా డైరెక్టర్‌గా లాంచింగ్ అవడం నా అదృష్టంగా భావిస్తున్నాను. నాగార్జునగారికి నేను బిగ్ ఫ్యాన్‌ని. కథ వినేటప్పుడు ఆయన ఎక్స్‌ప్రెషన్ చూసి చాలా భయపడ్డాను. సినిమా చూశాక వెరీ స్వీట్ అండ్ నైస్ ఫిలిం అని చెప్పగానే చాలా ధైర్యం వచ్చింది. 'రంగులరాట్నం' స్వీట్ అండ్ క్యూట్ లవ్‌స్టోరీ. ఇట్స్ ఎ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఫిల్మ్. సినిమా అంతా చాలా కలర్‌ఫుల్‌గా వుంటుంది. అందరికీ ఈ చిత్రం నచ్చుతుంది" అన్నారు.

హీరో రాజ్‌తరుణ్ మాట్లాడుతూ - "ఈ సినిమా పోస్టర్స్ రిలీజ్ అయినప్పటి నుండి ఇప్పటివరకు సపోర్ట్ చేస్తున్న ప్రతి ఒక్కరికీ నా థాంక్స్. అన్నపూర్ణ స్టూడియోస్‌లో 'ఉయ్యాలా జంపాలా' తర్వాత మళ్లీ ఈ సినిమా చేయడం చాలా సంతోషంగా వుంది. ఈ సంస్థలో వర్క్ చేయడం చాలా కంఫర్ట్‌బుల్‌గా వుంటుంది. కష్టపడుతున్నట్లుగా లేదు. చాలా ఎంజాయ్ చేస్తూ షూటింగ్ చేశా" అన్నారు.

ప్రముఖ నటి సితార మాట్లాడుతూ - "ఎన్టీ రామారావు, అక్కినేని నాగేశ్వరరావుగారితో చాలా సినిమాల్లో కలిసి నటించాను. అన్నపూర్ణ స్టూడియోస్ సంస్థలో పని చేయడం చాలా హ్యాపీగా ఫీలవుతున్నాను. అందరూ ఫ్యామిలీ మెంబర్స్‌లా ట్రీట్ చేస్తారు. ఈ చిత్రంలో రాజ్‌తరుణ్ మదర్ క్యారెక్టర్‌లో నటించారు. ఇంత మంచి క్యారెక్టర్ ఇచ్చిన డైరెక్టర్ శ్రీరంజనికి నా థాంక్స్. అన్నీ వర్గాల ఏజ్ గ్రూప్ వాళ్లకి నచ్చే సినిమా ఇది. చాలా రియలిస్టిక్‌గా వుంటుంది. ఎంతో ఇన్‌స్పైర్ అయి నా క్యారెక్టర్‌కి నేనే సొంతంగా డబ్బింగ్ చెప్పాను. ఒక ఫీల్‌గుడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ సంక్రాంతి సినిమా వస్తుంది. ఈ సినిమా అవకాశం ఇచ్చిన సుప్రియగారికి, ప్రసాద్‌గారికి నా థాంక్స్" అన్నారు.

సంగీత దర్శకుడు శ్రీచరణ్ పాకల మాట్లాడుతూ - 'క్షణం', 'గరుడవేగ' తర్వాత నేను చేసిన సినిమా ఇది. ఆ రెండు చిత్రాలు ఒక ఎత్తు. ఈ సినిమా ఒక ఎత్తు. నా మనసుకి చాలా దగ్గరైన సినిమా. వెరీ క్యూట్ అండ్ స్వీట్ ఫిలిం. కొత్త ఎక్స్‌పెరిమెంట్‌తో ఈ సినిమా మ్యూజిక్ చేశాను. ఈ చిత్రంలో నేను ఒక పార్ట్ అయినందుకు చాలా హ్యాపీగా వుంది" అన్నారు.

హీరోయిన్ చిత్ర శుక్లా మాట్లాడుతూ - "మా ఫ్యామిలీ మెంబర్స్, నా ఫ్రెండ్స్ చాలామంది నాగార్జునగారికి అభిమానులం. అలాంటి ఆయన నిర్మించిన ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటించే ఛాన్స్ రావడం అదృష్టంగా భావిస్తున్నాను. హీరోయిన్‌గా కంటే ఒక యాక్ట్రెస్‌గా మంచి పాత్రలో నటించాను. ఈ అవకాశాన్ని ఇచ్చిన సుప్రియగారికి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ప్రసాద్‌కి నా థాంక్స్" అన్నారు.

నటుడు ప్రియదర్శి మాట్లాడుతూ - "టైటిల్ తగ్గట్టుగా ఈ సినిమా అంతా చాలా కలర్‌ఫుల్‌గా వుంటుంది. ఈ సినిమా జర్నీలో ఎంతో నేర్చుకున్నాను. ఫ్యామిలీ ఎమోషన్ సీన్స్ కంటతడి పెట్టిస్తాయి. రాజ్‌తరుణ్‌తో త్రూ ఔట్ ఫ్రెండ్ క్యారెక్టర్‌లో నటించాను. మా ఇద్దరి మధ్య వచ్చే సీన్స్ ఎంటర్‌టైనింగ్‌గా వుంటాయి. ఫస్ట్ టైమ్ అన్నపూర్ణ స్టూడియోస్ బేనర్‌లో వర్క్ చేశాను. ఈ అవకాశం ఇచ్చిన సుప్రియగారికి నా ధన్యవాదాలు" అన్నారు.

'గాయత్రి' టీజర్ విడుదల



'రామాయణంలో రాముడికి, రావణాసురుడికి మధ్య గొడవ. మహాభారతంలో పాండవులకు, కౌరవులకు మాత్రమే గొడవ. వాళ్లూ వాళ్లూ కొట్టుకుని ఎవరో ఒకరు చనిపోయి ఉంటే బాగుండేది. కానీ, వాళ్ల మూలంగా జరిగిన యుద్ధంలో అటు, ఇటు కొన్ని లక్షల మంది సైనికులు చనిపోయారు. పురాణాల్లో వాళ్లు చేసింది తప్పయితే ఇక్కడ నేను చేసింది కూడా తప్పే. అక్కడ వాళ్లు దేవుళ్లైతే ఇక్కడ నేనూ దేవుడ్నే. అర్థం చేసుకుంటారో, అపార్థం చేసుకుంటారో.. ఛాయిస్ ఈజ్ యువర్స్' అంటున్నారు మోహన్‌బాబు. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'గాయత్రి'. ఈ సినిమా టీజర్‌ను శనివారం విడుదల చేశారు. ఇందులో మోహన్‌బాబు పవర్‌ఫుల్ లుక్‌లో, తనదైన డైలాగ్ డెలివరీతో ఆకట్టుకున్నారు. ఆర్.మదన్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. మోహన్‌బాబు నిర్మాత. విష్ణు, శ్రియ, అనసూయ, నిఖిలా విమల్, బ్రహ్మానందం, పోసాని కృష్ణమురళీ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఇందులో మోహన్‌బాబు కుమార్తెగా నిఖిల, జర్నలిస్టుగా అనసూయ కనిపించనున్నారు. త్వరలో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

'సాహో' సెట్‌కు అనుష్క..

ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న సినిమా 'సాహో'. సుజీత్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ఇక్కడి షెడ్యూల్ పూర్తయిన తర్వాత యూనిట్ సభ్యులు తదుపరి షెడ్యూల్ కోసం విదేశాలకు వెళ్లనున్నారు. కాగా ఈ సినిమా సెట్‌కు కథానాయిక అనుష్క వెళ్లారు. చిత్ర నటీనటులు, సాంకేతిక బృందంతో కాసేపు సరదాగా సమయం గడిపారు. ఈ సందర్భంగా ఆమె సుజీత్, నటుడు మురళీశర్మతో కలిసి సెల్ఫీ దిగారు. ఈ ఫొటో ప్రస్తుతం వైరల్‌గా మారింది. 'సాహో' సినిమాలో కథానాయిక పాత్ర కోసం తొలుత అనుష్కను అనుకున్నట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత చిత్ర బృందం బాలీవుడ్ నటి శ్రద్ధాకపూర్‌ను తీసుకుంది.

అనుష్క, ప్రభాస్ మంచి స్నేహితులన్న విషయం తెలిసిందే. అయితే అనుష్క ఈ సినిమా సెట్‌కు వెళ్లడంతో ఆమె సినిమాలో అతిథి పాత్రలో కనిపించనున్నారా? అనే ఊహాగానాలు మొదలయ్యాయి. యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్ 'సాహో' సినిమాను నిర్మిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో యాక్షన్‌కు ప్రాధాన్యం ఇస్తూ ఈ సినిమాను రూపొందిస్తున్నారు. తెలుగుతోపాటు తమిళం, మలయాళం, హిందీ భాషల్లో ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నారు.





'అజ్ఞాతవాసి' ప్రదర్శన నిలిపేస్తారా..!

పవన్ కళ్యాణ్, త్రివిక్రమ్ శ్రీనివాస్‌ల కాంబినేషన్‌లో తెరకెక్కిన అజ్ఞాతవాసి సినిమాకు మరిన్ని కష్టాలు తప్పేలా లేవు. ఇప్పటికే సినిమాకు నెగెటివ్ టాక్ రావటంతో పాటు కాపీ అన్న వార్తలు కూడా పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. ఫ్రెంచ్ సినిమా లార్గో వించ్ దర్శకుడు జెరోమ్ సల్లే స్వయంగా ఈ సినిమా ప్లాట్ తన సినిమా ప్లాట్కు దగ్గరగా ఉందని కామెంట్ చేశారు. అంతేకాదు అజ్ఞాతవాసి నిర్మాతలు టీ సిరీస్‌తో సెటిల్ చేసుకుంటున్నారన్న వార్తలపై కూడా సల్లే స్పందించారు. సినిమా ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ అయ్యింది, కేవలం టీ సిరీస్‌తో సెటిల్ చేసుకుంటే సరిపోదు అంటూ తాను చర్యలకు రెడీ అవుతున్నట్టుగా హింట్ ఇచ్చారు. అయితే న్యాయపరమైన చర్యలు తీసుకుంటున్నట్టుగా సల్లే ప్రకటించలేదు. ఒకవేళ కాపీ రైట్ ఉల్లంఘన కింద జెరోమ్ సల్లే చర్యలు తీసుకుంటే పరిణామాలు ఎలా ఉంటాయి అన్న విషయాలపై ఫోర్బ్స్ తాజా కథనంలో వివరించింది.

చర్యలు తీసుకోవాలని నిర్ణయించుకుంటే సల్లే ముఖ్యంగా అజ్ఞాతవాసి సినిమా డిస్ట్రిబ్యూషన్, ప్రదర్శనలను నిలిపివేయాల్సిందిగా కోరే అవకాశం ఉందని తెలిపింది. ఒకవేళ అదే జరిగితే దర్శకుడి కెరీర్‌పై ఆ నిర్ణయం తీవ్ర ప్రభావం చూపిస్తుందని ఫోర్బ్స్ అభిప్రాయపడింది.



జవాన్ల నడక సాహసం

షిల్లాంగ్: ఈశాన్య రాష్ట్రాల్లో ఇప్పటికీ అభివృద్ధి అంతంతమాత్రమే. ఇక సరిహద్దుల గురించైతే ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఇప్పటికే సరిహద్దు గ్రామాల్లో కనీసం రోడ్డు మార్గం కూడా లేదు. ఇలాంటి పరిస్థితుల వల్ల అక్కడి ప్రజలతో పాటు దేశ రక్షణ కోసం అహర్నిశలు విధులు నిర్వహిస్తున్న జవాన్లు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. సరిహద్దుకు వెళ్లాలంటే కాలినడక తప్ప మరో మార్గం లేకపోవడంతో గంటల పాటు నడుస్తున్నారు. మరో వైపు పొరుగుదేశం చైనాలో మాత్రం పరిస్థితులు ఇందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయి. చైనా బలగాలు సరిహద్దుల వద్దకు నేరుగా వాహనాల్లో వచ్చేందుకు అక్కడ మెరుగైన రోడ్డు సదుపాయాలున్నాయి. ఇటీవల ఇరు దేశాల మధ్య చోటు చేసుకున్న ఘటనే ఇందుకు నిదర్శనం. భారత్-చైనా మధ్య గతేడాది డోక్లాం వివాదం చోటుచేసుకున్న విషయం తెలిసిందే. దాదాపు రెండున్నర నెలల పాటు నెలకొన్న ఆ ప్రతిష్టంభన గత ఆగస్టులో తొలగిపోయింది. అయితే డోక్లాం తర్వాత మరో ప్రాంతంలోనూ ఇలాంటి వివాదానికి తెరతీసే ప్రయత్నం చేసింది చైనా. అందుకోసం ఇరు దేశాల మధ్య ఎప్పటి నుంచో వివాదాస్పద ప్రాంతంగా ఉన్న అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాన్ని ఎంచుకుంది. ట్యూటింగ్ ప్రాం తంలోని బిషింగ్ గ్రామం వద్ద చైనా రోడ్డు నిర్మాణాన్ని చేపట్టేందుకు ప్రయత్నించింది. దీంతో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అయితే ఇరుదేశాల అధికారుల చొరవతో ఆ సమస్య పరిష్కారమైంది.

ఇదిలా ఉండగా.. ఆ సందర్భంలో జవాన్లకు దుర్భర పరిస్థితులు తప్పలేదు. బిషింగ్ గ్రామం వద్ద ఉన్న సరిహద్దు వద్దకు చైనా తమ సామగ్రితో వాహనంలో చేరుకుంది. ఇది గుర్తించిన ఓ స్థానికుడు వెంటనే భారత సైన్యానికి సమాచారమిచ్చాడు. దీంతో అప్రమత్తమైన ఉన్నతాధికారులు వెను వెంటనే 120 మంది సిబ్బందిని ఆ ప్రాంతానికి వెళ్లమని ఆదేశించారు. నెలరోజుల పాటు అక్కడే ఉండేలా సరకులు కూడా తీసుకెళ్లమని చెప్పారు. అంతా బాగానే ఉంది కానీ.. మరి అక్కడకు వెళ్లడం ఎలా..? బిషింగ్ ఓ మారుమూల ప్రాంతం. అక్కడ జనాభా చాలా తక్కువ. రోడ్డు సదుపాయం కూడా లేదు. అక్కడికి చేరుకోవాలంటే ఎంతో ప్రయాస. కాలి నడక తప్ప మరో మార్గం ఉండదు. చేసేదేం లేని పరిస్థితుల్లో భారతజవాన్లు నడకబాట పట్టారు. మరి సరుకుల పరిస్థితి? 120 మంది 30 రోజుల పాటు ఉండాలంటే చాలా సరకులు కావాలి. దీంతో పోర్టర్లను ఏర్పాటు చేశారు. ఒక్కొక్కరు 10 నుంచి 15కిలోల చొప్పున మోసు కుంటూ దాదాపు 300మంది పోర్టర్లు సరిహద్దుకు వెళ్లారు. అలా దాదాపు 19 గంటల పాటు నడిచి సరిహద్దుకు చేరుకున్నారు. రక్షణ శాఖ వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారమే ఈ విషయా లన్నీ తెలిశాయి. అయితే సరిహద్దుల్లో రోడ్ల నిర్మాణా లకు సంబంధించి ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది.

విశాలాంధ్ర
9
విజయవాడ
ఆదివారం
14 జనవరి 2018

మహా విషాదం

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా మరి కొన్ని గంటల్లో సంక్రాంతి సంబురాలు ప్రారంభం కానున్న తరుణంలో శనివారం ఓ దుర్దినంగా మారింది. ఐదు రాష్ట్రాల్లో శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం ఉదయం వరకూ దాదాపు 32 మంది ప్రాణాలు కోల్పోయారు. 11 చిన్నారులు, ఏడుగురు ఓఎన్‌జీసీ సిబ్బంది గల్లంతయ్యారు. మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్, కర్ణాటక, తెలంగాణ జిల్లాల్లో మృత్యువు అమాయకులను వెంటాడింది. వేటాడింది. మహారాష్ట్రలో పది మంది, గుజరాత్‌లో ముగ్గురు, రాజస్థాన్‌లో ఐదుగురు, కర్ణాటకలో ఎనిమిది మంది, తెలంగాణలో ఆరుగురుని మృత్యువు అమాంతంగా మింగేసింది. ఈ మహా విషాదాల వివరాలు ఇలా ఉన్నాయి.

38 మంది మృతి

కర్ణాటకలో 8 మంది దుర్మరణం

బెంగళూరు: కర్ణాటక రోడ్డు రవాణ సంస్థ బస్సు అదుపుతప్పి రోడ్డుపక్కన నీటి గుంటలో బోల్తా పడగా ఎనిమిది మంది దుర్మరణం చెందారు. పది మంది తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. కేఎస్‌ఆర్టీసీ వోల్వో బస్సు బెంగళూరు నుంచి దక్షిణ కర్ణాటకలోని ధర్మస్థలకు బయలుదేరింది. ఈ బస్సులో 43 మంది ప్రయాణికులు ఉన్నారు. తెల్లవారుజామున హసన్ జిల్లా కరెకెరె సమీపంలోని వ్యవసాయ కళాశాల దగ్గర రోడ్డు పక్కన నీటిగుంటలో బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో ఐదుగురు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మరో ముగ్గురు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు వదిలారు. మృతుల్లో నలుగురిని పోలీసులు గుర్తించారు. బస్సు డ్రైవర్ లక్షన్ (38), దయానా (20), గంగాధర్ (20), చలవాది శివప్ప(36) గుర్తించారు. క్షతగాత్రులను హసన్‌లోని పలు ఆసుపత్రులకు తరలించారు. జిలా ఎస్పీ రాహుల్ కుమార్ ప్రమాదస్థలికి చేరుకున్నారు. మృతుల కుటుంబాలకు రూ.3లక్షల చొప్పున పరిహారం చెల్లిస్తామని రవాణాశాఖ మంత్రి హెచ్‌ఎం రేవన్న ప్రకటించారు.

జైపూర్‌లో కుటుంబం ఆహుతి..!

రాజస్థాన్ జైపూర్‌లోని విద్యానగర్‌లో శనివారం తెల్లవారుజామున జరిగిన అగ్నిప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు సజీవదహనమయ్యారు. వీరిలో ఇద్దరు బాలికలు, ఇద్దరు బాలురు ఉన్నారు. తెల్లవారుజామున అకస్మాత్తుగా మంటలు చెలరేగటంతో అర్పిత్, అపూర్వ, సౌమ్య మంటల్లో చిక్కుకోగా వీరిని రక్షించేందుకు బాలురు మహేంద్రగార్గ్,అనిమేష్ ప్రయత్నించి సజీవదహనమయ్యారు. అగ్నిమాపక సిబ్బంది



ప్రమాద స్థలికి చేరకుని మంటలను అదుపు చేశారు. గ్యాస్ సిలిండర్ లికేజీ వల్లనే ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు.

కూలిన హెలికాప్టర్ : మూడు మృతదేహాలు లభ్యం

ముంబై : ఓఎన్‌జీసీకి చెందిన టీపీడబ్ల్యే దౌఫిన్ ఏఎస్ 365ఎన్ 3 హెలికాప్టర్ ముంబై తీరంలో కూలిపోయింది. ఈ దుర్ఘటనలో ముగ్గురు మృతి చెందారు. మరో నలుగురి జాడ లేదు. శనివారం ఉదయం 10.20 గంటలకు జూహూ నుంచి హెలికాప్టర్ టేకాఫ్ తీసుకుంది. ఓఎన్జీసీకి చెందిన నార్త్ ఫీల్డ్‌లో ఆ హెలికాప్టర్ 10.58 నిమిషాలకు చేరుకోవాలి. కానీ ఇంత వరకు ఆ ఛాపర్ ఆచూకీ లేదు. ఉదయం 10.30 నుంచి హెలికాప్టర్ కాంటాక్ట్ కోసం అధికారులు ప్రయత్నించారు.

ఇండియన్ నేవీకి చెందిన స్టీల్త్ ఫ్రిగేట్ ఐఎన్‌ఎస్ టెగ్ సహాయక చర్యల్లో పాల్గొంది. నిఘా విమానం పీ8ఐ కూడా గాలింపు కొనసాగింది. నేవీ, కోస్టుగార్డులు సహాయక చర్యలు కొనసాగిస్తున్నట్లు కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ తెలిపారు. తాను కూడా ముంబై వెళు న్నట్లు ఆయన చెప్పారు. రక్షణ మంత్రితో ఈ అంశాన్ని చర్చిస్తామని, నేవీ-కోస్టు గార్డులు చర్యలు మొదలుపెట్టాలని రక్షణ మంత్రి కూడా ఆదేశించారని మంత్రి తెలిపారు. ఈ హెలికాప్టర్‌లో ఐదుగురు ఓఎన్జీసీ సిబ్బంది సహా ఇద్దరు పైలట్లు ఉన్నారు. కోస్టు గార్డు సిబ్బంది ఇప్పటికి ముగ్గురి మృతదేహాలను కనుగొన్నారు. అందులో ఓ సీనియర్ ఓఎన్జీసీ ఆఫీసర్ ఉన్నారు. ఛాపర్‌కు చెందిన శిథిలాలు కూడా కనుగొన్నట్లు తెలుస్తున్నది. మిగిలిన సిబ్బంది కోసం గాలింపు చేపడుతున్నట్లు కోస్టు గార్డులు తెలిపారు.

బోటు బోల్తా : ఆరుగురు దుర్మరణం

ముంబైలో విహారయాత్రకు వెళ్లిన విద్యార్థుల్లో ఆరుగురు విగతజీవులుగా మారారు. ఇద్దరి ఆచూకీ తెలియలేదు. ముంబైలోని ప్రముఖ దహాను తీరం వద్ద 40 మంది విద్యార్థులతో వెళ్లిన బోటు మునిగి పోయింది.



వెంటనే సమాచారం అందుకున్న సిబ్బంది సహాయ చర్యల నిమిత్తం రంగంలోకి దిగారు. ఈ ప్రమాదంలో నలుగురు చిన్నారులు మృతి చెందగా.. 32 మంది విద్యార్థులను సురక్షితంగా రక్షించగలిగారు. దహాను సముద్ర తీరానికి రెండు నాటికల్ మైళ్ల దూరంలో ఈ ఘటన జరిగింది. గల్లంతైన విద్యార్థుల కోసం సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ంగంలోకి దిగిన కోస్టు గార్డు సిబ్బంది పడవలతో గల్లంతైన విద్యార్థుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. వీటితో పాటు ముంబయి నుంచి కూడా మరికొన్ని పడవలు సహాయక చర్యల్లో పాల్గొనేందుకు దహాను ప్రాంతానికి చేరుకున్నాయి. డోర్నియర్ ఎయిర్‌క్రాఫ్ట్, హెలికాప్టర్లు కూడా చిన్నారుల ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు కోస్టు గార్డు పీఆర్‌వో వెల్లడించారు.

గుజరాత్‌లో ముగ్గురు చిన్నారుల సజీవదహనం

గుజరాత్‌లో శుక్రవారం రాత్రి రాజ్‌కోట్ ప్రాణ్‌స్లా గ్రామంలోని ఓ ఆశ్రమంలో మంటలు చెలరేగి ముగ్గురు బాలికలు సజీవ దహనం కాగా? 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. దీంతో భారీ ప్రాణ నష్టం తప్పింది. రాష్ట్ర కథ సిబిర్ అనే ఆశ్రమంలో ప్రతియేట జనవరి 6 నుంచి ఉత్సవాలు జరుగుతాయి. దేశంలోని నలుమూలల నుంచి వేలాది మంది బాలికలు ఈ ఆశ్రమానికి వస్తారు. శుక్రవారం ఆశ్రమంలో 15 వేల మంది బాలికలు ఉన్నారు. అర్ధరాత్రి అకస్మాత్తుగా మంటలు చెలరేగి క్షణాల్లో వ్యాపించాయి. ఈ దుర్ఘటనలో ముగ్గురు బాలికలు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మరో 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. విద్యుత్తు ప్రసారంలో లఘువలయం ఏర్పడినందునే ఈ ప్రమాదం జరిగినట్టు విక్రాంత్ పాండే తెలిపారు. మృతులందరూ టీనేజీ బాలికలని ఎస్పీ అంతృప్ సూద్ తెలిపారు. సీఎం విజరు రూపానీ, కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌గ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ ఘటనపై విచారణకు ఆదేశించారు.

ఆరుగురు రెజ్లర్ల మృతి



పుణె: మహారాష్ట్ర కడెగావ్ సమీపంలోని సంగ్లీలో శనివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు కుస్తీ యోధులు దుర్మరణం చెందారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను మీరజ్ ఆసుపత్రికి తరలించారు. వివరాల్లోకి వెళితే.. పుణెలోని క్రాంతి కుస్తీ సంకుల్‌కు చెందిన రెజ్లర్లు బెండ్‌లో జరిగిన పోటీల్లో పాల్గొన్నారు. ఇటీవల ఈ సంస్థ రెజ్లర్లు అన్ని పోటీల్లోనూ విజయయాత్ర జరుపుతున్నారు. జాతీయ చాంపియన్‌షిప్‌పై దృష్టి సారించారు. సతారాలో జరగనున్న పోటీలకు ఎస్‌యూవీలో బయలుదేరారు. శనివారం తెల్లవారుజామున 1.00 గంటకు సంగ్లీలో ఓ చెరకు ట్రాక్టర్‌ను ఈ కారు ఢీకొంది. ఈ దుర్ఘటనలో ఆరుగురు రెజ్లర్లు విజయి సింధే, ఆకాశ్ దేశాయి, శుభం గార్గె, సౌరబ్ మానే, అవినాశ్ గైక్వాడ్, రణ్‌జిత్ ధన్వాడే అక్కడిక్కడే దుర్మరణం చెందారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడగా స్థానికులు ఆసుపత్రికి తరలించారు. ఆరుగురు రెజ్లర్లు దుర్మరణం చెందటంతో మహారాష్ట్రలోని రెజ్లర్ అసోసియేషన్లు తీవ్ర విషాదంలో మునిగిపోయాయి.

చిదంబరం సహా

కార్తి బంధువుల ఇళ్లలో ఈడీ సోదాలు

న్యూఢిల్లీ : ఎయిర్‌సెల్-మాక్సిస్ కేసులో మనీ లాండరింగ్‌పై దర్యాప్తులో భాగంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కేంద్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి పి.చిదంబరం కుమార్డు కార్తి, ఆయనకు సంబంధించిన వారి ఇళ్లలో శనివారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు సోదాలు జరిపారు. ఢిల్లీలోని చిదంబరం నివాసంతో సహా పది చోట్ల ఈ సోదాలు నిర్వహించారు. చెన్నైలోని తొమ్మిది చోట్ల, దక్షిణ ఢిల్లీలోని చిదంబరం జోర్‌బాగ్ నివాసంలో తెల్లవారు జామున సోదాలు ప్రారంభించారని అధికారవర్గాలు తెలిపాయి. కార్తితో సంబంధాలున్న చార్టెడ్ ఎకౌంటెంట్, ఆయన వ్యక్తిగత కార్యదర్శి, చెన్నై థౌజండ్ లైట్స్ ప్రాంతంలోని కార్తి నివాసంలో సోదాలు నిర్వహించారు. సోదాల సందర్భంగా కొన్ని నేరారోపణ పత్రాలను స్వాధీనం చేసుకున్నట్టు ఆ వర్గాలు తెలిపాయి. తన కుమారుడికి వ్యతిరేకంగా సోదాలు జరపడాన్ని "లోపాల కామెడి"గా చిదంబరం అభివర్ణించారు. తన ఇంటి వద్ద ఏమీ లభించకపోవడంతో అధికారులు ఇబ్బందిగా భావించారని, తనకు క్షమాపణ చెప్పారని తెలిపారు. ఇక్కడి జోర్‌బాగ్ నివాసం వెలుపల చిదంబరం మీడియాతో మాట్లాడారు. ఈ కేసుకు సంబంధించి కేంద్ర దర్యాప్తు ఏజెన్సీ గత ఏడాది డిసెంబరు 1వ తేదీన కార్తి



బంధువులు, ఇతరుల ఇళ్లపై దాడులు నిర్వహించింది. "అధికారుల వద్ద సెర్చ్ వారెంట్ ఉన్నందున , సోదాలకు నేను ఎటువంటి అభ్యంతరం వ్యక్తం చేయలేదు. అయితే, షెడ్యూల్డ్ నేరానికి సంబంధించి సీబీఐతో సహా దర్యాప్తు సంస్థ ఏదీ కూడా ఎఫ్ఐఆర్ దాఖలు చేయకపోయినా సోదాలు నిర్వహించినందుకు నా నిరసనను మాత్రం తెలిపాను. నేరం చేసినట్లు ఎలాంటి ఆధారాలు లేవు. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) పరిధిలోకి ఈడీ రాదు" అని చిదంబరం తెలిపారు. అయితే, ఈ కేసుకు సంబంధించి ఏజెన్సీ, సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగానే తాము ఈ సోదాలు నిర్వహించామని ఈడీ వర్గాలు తెలిపాయి. కేసును కోర్టు కొట్టివేయలేదని పేర్కొన్నాయి.

రైళ్లు, విమానాలకు భోగి సెగ

చెన్నై : తమిళనాడు భోగిమంటల పొగకు పలు, రైళ్ల విమానాల రాకపోకలు ఆలస్యమయ్యాయి. వాతావరణంలో దట్టంగా పొగ వ్యాపించడంతో ఇంటర్‌సిటీ. ఇంటర్ స్టేట్ రైళ్లకు అంతరాయం కలిగి 30 నుంచి 40 నిముషాలు ఆలస్యంగా నడిచాయని దక్షిణ మధ్యరైల్వే అధికారులు తెలిపారు. సబర్బన్ రైలు సర్వీసులు కూడా అరగంట ఆలస్యమయ్యాయని అయితే 9 గంటల నుంచి అన్నిరైళ్ల రాకపోకలను నియంత్రించా మన్నారు. 40 అంతర్జాతీయ , జాతీయ విమాన సర్వీసులు రద్దయ్యాయని,పలు విమానాలు ఆలస్యమయ్యాయని విమానయాన అధికారులు పేర్కొన్నారు. ఉదయం 4 గంటలకు బయలు దేరవలసిన విమానం పొగ కారణంగా 9.30 గంటలకు బయలు దేరిందన్నారు. షార్జా, దోహా ఢిల్లీ వెళ్లాల్సిన విమానాలు రద్దు కాగా, ప్రయాణీకులకు నగరంలో బస ఏర్పాటు చేశారు. దట్టమైన పొగలో కనుచూపుమేర ఏమీ కనబడక పోవడంతో నగరానికి చేరుకోవాల్సిన- బయలు దేరాల్సిన 42 విమాన సర్వీసులు 3 నుంచి 4 గంటలపాటు ఆలస్యమయ్యాయన్నారు. ఉదయాన్నే 18 విమానాలను బెంగళూరు, హైదరాబాద్ విమానాశ్రయాలకు మళ్లించామన్నారు. అయితే మోటారు వాహనదారులు



మాత్రం హెడ్‌లైట్ల వెలుగులో నెమ్మదిగా ప్రయాణం సాగించారన్నారు. తమిళనాడులో శనివారం భోగి జరుపుకోగా, ఆదివారం సంక్రాంతి జరుపుకుంటున్నారు. ఉదయం 8గంటల ప్రాంతంలో సూర్యుడు ఉదయించడంతో పరిస్థితులు మెరుగుపడ్డాయి. భోగినాడు పాత వస్తే కాల్చి వేసి నూతన వస్తువులు సమకూర్చుకుంటారు. పొగరాకుండా భోగి నిర్వహించుకోవాలని ప్రభుత్వం అవగాహనా సదస్సులు నిర్వహించినప్పటికీ ప్రయోజనం లేకపోయింది.

తారాపిత్ పవిత్రస్నానంలో

భక్తులకు అనుమతి లేదు

సురి (పశ్చిమబెంగాల్) : కాళీమాత ఆలయంలో తారాపిత్ పవిత్రస్నానానికి భక్తులను దూరంగా ఉంచాలని ఆలయ అధికారులు నిర్ణయించారు. ప్రాచీన కాలం నుంచి సూర్యోదయానికి జరిగే ఈ కార్యక్రమానికి భక్తులను అనుమతించే సంప్రదాయానికి వారు చెక్ చెప్పారు. అగరు, చందన, సింధూరాలతో నల్లరాతి విగ్రహానికి జరిపే ఈ పవిత్ర స్నానాలకు భక్తులను అనుమతించడంతో విగ్రహానికి చేటు కలుగుతుందని ఆలయ కమిటీ కార్యదర్శి ధృబచటర్జీ తెలిపారు. ఇదివరలో వీటికోసం సహజ పదార్థాలను వాడేవారని ప్రస్తుతం సింథటిక్ వాడటం వల్ల విగ్రహం తన సహజ రూపాన్ని కోల్పోతుందన్నారు. ఎక్కువ మంది భక్తులు పాల్గొనడం వల్ల గర్భగుడిలో చోటు చాలక ఇబ్బంది పడుతున్నారన్నారు. సాధారణ దర్శనంలో భక్తులు మూడడుగులు ఎత్తు ఉండే వెండి విగ్రహం శిరస్సును చూడవచ్చని చటర్జీ తెలిపారు. సూర్యోదయంలో ఉత్సవ విగ్రహానికి కాకుండా దేవతా విగ్రహానికే పుణ్యస్నానాలను ఆచరిస్తారు. రద్దీని అడ్డుకోవడం కష్టమైనందున భక్తులను అనుమతించడం లేదని చటర్జీ వెల్లడించారు.


కళ తప్పిన లగ్జరీ రైళ్లు

మూడేళ్లలో భారీగా పడిపోయిన ఆదాయం : రైల్వే నివేదికలో వెల్లడి

జైపూర్ : పర్యాటకుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన విలాసవంతమైన రాయల్ ట్రయిన్స్ కళ తప్పాయి. రాజస్థాన్‌లోని పర్యాటక క్షేత్రాలకు ప్రయాణించే ఈ రైళ్ల ఆదాయం అంతంత మాత్రంగానే ఉందని రైల్వేశాఖ నివేదించింది. ఈ మూడేళ్లల్లో ఆదాయం గణనీయంగా పడిపోయిందని వెల్లడించింది. ప్యాలెస్ ఆఫ్



వీల్స్ (పీఓడబ్ల్యూ), రాయల్ రాజస్థాన్ ఆన్ వీల్స్ (ఆర్‌ఆర్‌ఓ.డబ్ల్యూ) వంటి రాయల్ రైళ్లు విదేశీ పర్యాటకులను అమితంగా ఆకర్షించే లక్ష్యంతో రూపొందినవి కాగా నేడు వీటికి ఆదరణ కరవైంది. 63.18శాతం మేర ఉన్న ఆదాయం ఈ మూడేళ్లలో 24.08శాతానికి పడిపోయిందని రైల్వేశాఖ పేర్కొంది. ఈ రెండు రైళ్లను రాజస్థాన్ టూరిజం డవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఆర్‌టీడీసీ) సమన్వయంతో భారతీయ రైల్వే నడుపుతోంది. 'ఇండియన్ రైల్వేపాత్ర రైళ్ల ఆపరేషన్ వరకే పరిమితం. వీటి కోసం మార్కెటింగ్ బాధ్యత ఆయా టూరిజం కార్పొరేషన్లపై ఉంటుంది. రైళ్ల రాకపోకలు తగ్గడం కూడా రెవెన్యూ తగ్గుదలకు ఒక కారణంగా చెప్పవచ్చు' అని నివేదిక పేర్కొంది. దేశంలోని హెరిటేజ్



రైళ్ల మహారాణిగా అభివర్ణించే ప్యాలెస్ ఆన్ వీల్స్.. న్యూఢిల్లీ, జైపూర్, స్వాయి మాధోపూర్, చిట్టోఘర్, ఉదయ్‌పూర్, జైసల్మేర్, జోధపూర్, భరత్‌పూర్, ఆగ్రా గుండా ప్రయాణిసుంది. అదేవిధంగా, రాయల్ రాజస్థాన్ .. న్యూఢిల్లీ, జోధ్‌పూర్, ఉదయ్‌పూర్, చిట్టోఘర్, స్వాయి మాధోపూర్, జూపూర్, ఖజురహో, వారణాసి, ఆగ్రా మార్గంలో ప్రయాణిస్తుంది. 2014-15లో 2024 మంది ప్రయాణికులు ప్యాలెస్ ఆఫ్ వీల్స్‌లో ప్రయాణించగా ఆ సంఖ్య 2015-16లో 1739, 2016-17లో 1373కి పడిపోయింది. అలాగే, 2014-15లో రాయల్ రాజస్థాన్‌లో 654మంది ప్రయాణించగా 2015-16లో 493 మంది, 2016-17లో 237 మంది ప్రయాణించినట్టు నివేదిక వివరించింది.

సోమవారానికి సర్దుకుంటాయి : అటార్నీ జనరల్

ఢిల్లీ: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, సీనియర్ న్యాయమూర్తుల మధ్య ఏర్పడిన విబేధాలు సోమవారం నాటికి సర్దుకుంటాయని అటార్నీ జనరల్ వేణుగోపాల్ అన్నారు. శనివారం ఆయన ఓ ఆంగ్ల మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) తీరుపై సీనియర్ న్యాయమూర్తులు జస్టిస్ జాస్తి చలమేశ్వర్, జస్టిస్ గొగోయ్, జస్టిస్ మదన్ బి.లోకూర్, జస్టిస్ కురియన్ జోసెఫ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ విషయంలో అటార్నీ జనరల్ వేణుగోపాల్ మాట్లాడుతూ 'సోమవారం నాటికి సర్వోన్నత న్యాయస్థానం న్యాయమూర్తుల మధ్య సఖ్యత ఏర్పడుతుంది. దీన్ని మరింత పొడిగించాలని అనుకోవడం లేదు' అని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించిన నలుగురు సీనియర్ న్యాయమూర్తులతో ప్రధాన న్యాయమూర్తి ఆదివారం భేటీ అయ్యే అవకాశం ఉంది. భారత దేశ న్యాయవ్యవస్థ చరిత్రలోనే తొలిసారిగా నలుగురు సీనియర్ న్యాయమూర్తులు మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడిన విషయం తెలిసిందే. సీజేఐ పనితీరుపై వాళ్లు మాట్లాడారు. గత కొన్ని రోజులుగా సర్వోన్నత న్యాయస్థానంలో పాలన వ్యవహారాలు సవ్యంగా జరగడం లేదని, వాటిని సరిదిద్దేలా సీజేఐని ఒప్పించడంలో తాము విఫలమయ్యామని నలుగురు సీనియర్ న్యాయమూర్తులు చెప్పారు. అందు వల్ల విధిలేని పరిస్థితుల్లో ప్రజల ముందుకొచ్చి వాస్తవాలను వెల్లడించాల్సి వస్తోందన్నారు.

పంజాబ్, హర్యానాల్లో చలిపులి

చండీఘర్ : పంజాబ్,హర్యానాల్లోని అనేక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోవడంతో చలిగాలులు కొనసాగుతున్నాయి.జలంధర్‌లో 2.2 డిగ్రీల సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వాతావరణ శాఖ విభాగం తెలిపింది.చత్తీస్‌గఢ్‌లో 5.1 డిగ్రీల సెల్సియస్ నమోదైనట్టు తెలిపారు. హర్యానాలోని అంబాలా, హిసార్, కర్నాల్‌లో 4.5, 3.5, 2.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు తెలిపారు.

పాఠశాల మరుగుదొడ్డి గోడ కూలి బాలుడు మృతి

అలప్పుజ్జా : కేరళలో ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలో మరుగుదొడ్డి గోడ కూలడంతో ఆరేళ్ల బాలుడు మృతిచెందాడు.జిల్లాలో శనివారం కుట్టానంద్‌లో పాఠశాలలో ఇంటర్వెల్ సమయంలో మరుగుదొడ్డి గోడ కూలిందని, ఆ సమయంలో అక్కడే ఉన్న రెండవ తరగతి చదువుతున్న ఎం జోసఫ్ తలకు తీవ్ర గాయమైందని, వెంటనే చికిత్స కోసం ఆసుపత్రికి తరలించినప్పటికీ బాలుడు అప్పటికే మృతిచెందాడని వైద్యులు ధృవీకరించారని తెలిపారు.

పట్టాలు తప్పిన రైలింజన్

ముజఫర్‌నగర్ : ఉత్తరప్రదేశ్‌లో ఢిల్లీ ప్యాసింజర్ రైలు ఇంజన్ పట్టాలు తప్పింది. ఉత్తరప్రదేశ్‌లో షామ్లీ జిల్లాలో శనివారం ఉదయం ఢిల్లీ నుంచి తిరుగు ప్రయాణంలో ఈ సంఘటన చోటుచేసుకుందని రైల్వే అధికారి తెలిపారు. అయితే ప్రాణనష్టం ఏమీ జరగలేదని తెలిపారు. ఈ సంఘటనపై దర్యాప్తునకు ఆదేశాలు జారీ అయ్యాయని తెలిపారు.

ఏటీఎంల నుంచి నగదు దోపిడీ కేసులో 8 మంది అరెస్ట్

కోయంబత్తూర్ : గత నెలలో కోయంబత్తూర్‌లో మూడు ఏటీఎంల నుంచి రూ.30 లక్షలు లూటీ చేసిన కేసులో ఎనిమిది మందిని అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. డిసెంబరు 9, 10 తేదీల్లో వీరు ఏటీఎంలను పగలగొట్టి నగదు దోచుకున్నారని తెలిపారు. సాలెం వద్ద వీరిని అరెస్టు చేసినట్టు చెప్పారు. వారిలో ముగ్గురు రాజస్థాన్‌కు చెందినవారని, మరో ముగ్గురు హర్యానా, మరో ఇద్దరిలో ఒకరు ఢిల్లీ, మరొకరు ఉత్తరప్రదేశ్‌కు చెందినవారని తెలిపారు.

శ్రీనగర్-బారాముల్లా హైవేపై బాంబు కలకలం

శ్రీనగర్ : శ్రీనగర్-బారాముల్లా ప్రధాన రహదారి మార్గంలో బాంబు కలకలం రేగింది. శనివారం ఉదయం శ్రీనగర్‌లో హైవే మార్గంలోని హెచ్‌ఎంటీ ప్రాంతంలో 5 కిలోల ఐఈడీని కనుగొన్నామని పోలీసులు చెప్పారు. వెంటనే హైవే మార్గంలో ట్రాఫిక్‌ను మళ్లించామని చెప్పారు. బాంబు నిర్వీర్యదళం వెంటనే అక్కడకు చేరుకుని ఐఈడీని నిర్వీర్యం చేసినట్టు తెలిపారు.

హిమాచల్ సీఎం చిన్నవాడు కాదు

ధర్మశాల : హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి రామ్ ఠాకూర్‌ను పిన్న వయస్కుడైన ముఖ్యమంత్రి అని బీజేపీ తెలపడంపై కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తంచేసింది. రాష్ట్రంలో ఆయన కంటే చిన్న వయస్సులో ముఖ్యమంత్రులైన వారు ఉన్నారని తెలిపారు.13వ రాష్ట్ర శాసనసభ సమావేశాలు ప్రారంభమైన సందర్భంలో కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు, ఎమ్మెల్యే ఆశాకుమారి మాట్లాడారు. రామ్ ఠాకూర్‌కు 53 ఏళ్లని, అయితే 45 ఏళ్ల వయస్సులో వైఎస్ పరమార్ ముఖ్యమంత్రి పదవి చేపట్టారని, రామ్‌లాల్ 48 ఏళ్ల వయస్సులో, శంతాకుమార్ 42 ఏళ్లకే, 49 ఏళ్లకే వీరభద్రసింగ్, 53 ఏళ్లకే పీకే ధుమాల్ సీఎం అయిన వారున్నారని చెప్పారు.

బాంబు పేలుడులో బాలుడికి తీవ్రగాయాలు

జమ్మూ : జమ్ము, కాశ్మీర్‌లోని పూంచ్‌లో నియంత్రణ రేఖ సమీపంలో బాంబు పేలి 12 ఏళ్ల బాలుడికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, షాల్‌పూర్‌కు చెందిన మొహమ్మద్ ఇక్బాల్ సలబా గ్రామంలో పొలంలో ఆడుతుండగా అక్కడే పేలని బాంబు ఒకటి అకస్మాత్తుగా పేలడంతో బాలుడికి తీవ్రగాయాలయ్యాయని చెప్పారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. ఇటీవల పాకిస్తాన్ బాంబు దాడులకు పాల్పడినప్పుడు పేలకుండా పడి ఉన్న ఈ బాంబును కనిపెట్టలేకపోయామని చెప్పారు.

ఆయిల్ రిఫైనరీకి మళ్లీ ప్రధాని శంకుస్థాపన

జైపూర్/ బికనేర్ : రాజస్థాన్‌లోని బర్మేర్ జిల్లా పచ్‌పద్రలో ఈనెల 16న ప్రధాని మోడీ శంకుస్థాపన చేస్తారని స్థానిక కలెక్టర్ వెల్లడించారు. నాలుగేళ్ల క్రితం దీనికి సోనియాగాంధీ శంకుస్థాపన చేశారు. దీంతో కాంగ్రెస్ విమర్శలు కురిపిస్తోంది. ముఖ్యమంత్రిని కాపాడేందుకే ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారని మాజీ ముఖ్యమంత్రి అశోక్ గేహ్లోట్ తెలిపారు. మూడేళ్ల నుంచి ఈ కార్యక్రమం చేపట్టకుండా ప్రజలను మోసం చేశారని, రాష్ట్రంలో ప్రస్తుతం అమలు చేసే అన్ని సంక్షేమ పథకాలు కాంగ్రెస్ హయాంలో అమలు చేసినవేనని విమర్శించారు.

15 రోజులకు 2 సార్లు పర్యవేక్షించండి

న్యూఢిల్లీ : రైల్వే పనుల పర్యవేక్షణకు 15 రోజుల్లో రెండు సార్లు భారతీయ రైల్వే అధికారులు విజిట్ చేయాలని రైల్వే శాఖ ఆదేశించింది. పాత ట్రాక్‌లను తొలగింపు, బ్రిడ్జి పనులు, పర్యవేక్షణలేని లెవల్ క్రాసింగ్, ప్లాట్‌ఫారాలు, మిగతా ట్రాక్ పనులను అధికారులు ప్రతి వారం ఒకసారి పర్యవేక్షించాలని, రైల్వేబోర్డు ఉత్తర్వులు జారీ చేసింది. నిర్మాణపనులకు మార్గదర్శకత్వం వహించాలని బోర్డు కోరింది. రూ.10 వేల కోట్లతో వచ్చే ఏడాది మరో 800 కిమీ ట్రాక్ నిర్మాణాలు చేపట్టనున్నారు.

అనంతపురానికి సెంట్రల్ పార్క్ తలమానికం



విశాలాంధ్ర- అనంతపురము అర్బన్ : అనంతపురం నగర సమీపంలో రూపుదిద్దుకున్న సెంట్రల్ పార్కు నగరానికే తలమానికంగా నిలిచిందని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలు, గృహనిర్మాణశాఖ మంత్రి కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు సెంట్రల్ పార్కు (శిల్పారామం)లో రూ. 40 లక్షలతో నిర్మించిన చిన్నారుల క్రీడా ప్రాంగణం ప్రారంభోత్సవంలో శనివారం ఆయన పాల్గొన్నారు. పెద్దలతోపాటు చిన్న పిల్లల కోసం ఏర్పాటు చేసిన వివిధ రకాల ఓపెన్ జిమ్‌లను ఆయన పరిశీలించారు. శిల్పారామంలో చెక్‌డ్యామ్‌లో జలహారతిలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ కరవు జిల్లాలో వంద ఎకరాల స్థలంలో శిల్పారామం, పార్కును అన్ని సౌకర్యాలతో ఉద్యానవనంగా ఏర్పాటు చేయడంలో ఎమ్మెల్యే కృషి మరువలేనిదన్నారు. ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అర్బన్ డెవలప్‌మెంట్ ఫెడరేసన్, గ్రీనరీ కార్పొరేషన్ ద్వారా రూ. 40 లక్షలతో 26 రకాల వ్యాయామ పరికరాలను పార్క్‌లో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వడ్డెర ఫెడరేషన్ చైర్మన్ దేవళ్ల మురళీ, కాపు కార్పొరేషన్ డైరక్టరు రాయల్ మురళీ, ఉప్పర ఫెడరేషన్ ప్రతినిధి శ్రీకాంత్, కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు ఆదెన్న తదితరులు పాల్గొన్నారు.

ఓఎన్‌జీసీకి అత్యుత్తమ భద్రతా పురస్కారం



విశాలాంధ్ర-రాజమహేంద్రవరం : ఓఎన్‌జీసీ రాజమహేంద్రవరం అసెట్‌కు అత్యుత్తమ భద్రతా పురస్కారం లభించింది. భువనేశ్వర్‌లో కేంద్ర పెట్రోలియం నేచురల్ గ్యాస్, స్కిల్ డెవలప్‌మెంట్ శాఖామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ద్వారా అసెట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, అసెట్ మేనేజర్ డీఎంఆర్ శేఖర్ ఇటీవల అందుకున్నారు. దేశంలోని ప్రభుత్వ, ప్రైవేటు చమురు సంస్థల్లో ఓఎన్‌జీసీ అసెట్ ఈ పురస్కారాన్ని సొంతం చేసుకుంది. ఓఎన్‌జీసీ రాజమండ్రి అసెట్ తమ కార్యకలాపాలలో ప్రమాదాలు లేకపోవడంతో 2016-17 సంవత్సరానికి లభించింది. కార్యకలాపాల్లో భద్రతకు సంబంధించి రాజీపడకుండా అత్యుత్తమ ప్రమాణాలు పాటిస్తూ ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఈ సందర్భంగా డీఎంఆర్ శేఖర్ మాట్లాడుతూ ఓఎన్‌జీసీ భద్రతా ప్రమాణాలతో ఉద్యోగుల్లో చైతన్యం తీసుకొచ్చి ఉత్తమ ఫలితాలు సాధించినందుకు కేంద్ర మంత్రి కితాబిచ్చారు.

రాష్ట్రాభివృద్ధికి కేంద్రం పూర్తి సహకారం

విశాలాంధ్ర-కైకలూరు : నూతన రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయి సహకారం అందించేందుకు సుముఖంగా ఉందని, దశల వారీ అన్ని రంగాలకు సహకారం అందిస్తుందని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా ఉండి నియోజకవర్గంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు వెళ్తున్న ఆయన ఎంపీ మాగంటి వెంకటేశ్వరరావు (బాబు) ఆహ్వానంతో శుక్రవారం కైకలూరులోని ఇందుకూరి సత్యనారాయణరాజు ఇంట్లో బస చేశారు. శనివారం మాగంటి నివాసానికి చేరుకున్న ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర విభజనతో ఏపీ ఆర్థిక కష్టాల్లో చిక్కుకున్నందున సీఎం చంద్రబాబు కోరిక మేరకు ప్రధాని మోదీ రాష్ట్రాభివృద్ధికి సహకరించేందుకు సుముఖంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఓట్లు, రాజకీయ లబ్ధి కోసమే తెలుగురాష్ట్రాన్ని రెండు ముక్కలు చేసిందన్నారు. ఆంధ్ర రాష్ట్రంలో పరిశ్రమలు లేకపోయినప్పటికీ వ్యవసాయరంగంలో రాష్ట్రం ముందంజలో ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ పొత్తుతో అధికారం చేపడుతుందన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే జయమంగళ వెంకటరమణ, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, జెడ్పీటీసీ బొమ్మనబోయిన విజయలక్ష్మి పాల్గొన్నారు.

వేటకుక్కలతో వన్యప్రాణుల వేట

విశాలాంధ్ర - కోటవురట్ల : విశాఖ జిల్లా కోటవురట్ల మండలంలో వన్యప్రాణుల వేట జోరుగా సాగుతోంది. వేటకుక్కలతో వేటగాళ్లు వన్యప్రాణులను వేటాడుతున్నారు. పందూరు, గొటివాడ, మునగలలోవ గ్రామాలకు చెందిన కొందరు ఇదే వృత్తిగా జీవిస్తున్నట్లు సమాచారం. పాతరోడ్డు సమీపంలోని సంజీవ పర్వతంపై రోజూ వేటకుక్కలతో వేటాడుతున్నట్లు సమాచారం. ఈ పర్వతంపై శనివారం ఉదయం గొటివాడ, మునగలలోవ గ్రామస్తులు వేటకుక్కలతో కణుజును హతమార్చిన తర్వాత మాంసం పంపకంలో చోటుచేసుకున్న ఘర్షణలతో ఇది బయటపడింది. సంజీవ పర్వతం సమీపంలోకి పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చినట్లు తెలుస్తోంది. బహిరంగంగా వన్యప్రాణుల వేట కొనసాగుతున్నప్పటికీ అటవీశాఖ సిబ్బంది కన్నెత్తి చూడకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా వన్యప్రాణుల సంరక్షణ చర్యలు చేపట్టి వేటగాళ్లపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఫొటోగ్రాఫర్లను కించపరిస్తే సహించేది లేదు



విశాలాంధ్ర- విజయవాడ (గాంధీనగర్) : ఫొటోగ్రాఫర్లు నిరంతరం సమాజంలో చోటుచేసుకుంటున్న అనేక అంశాలను ప్రజలకు విశదీకరిస్తారని, వారిని కించపర్చేలా మాట్లాడితే సహించేది లేదని రాష్ట్ర ఫొటోగ్రాఫర్స్ జేఏసీ అధ్యక్షులు మాదాల రమేష్ హెచ్చరించారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మున్సిపల్ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాసరావు ఫొటోగ్రాఫర్లను కించపరుస్తూ మాట్లాడిన తీరు సహించరానిదన్నారు. ఫొటోగ్రాఫర్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసిన విషయంలో మున్సిపల్ చైర్మన్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. యూనియన్ కార్యదర్శి ఆర్.వి.అప్పారావు మాట్లాడుతూ ఆఫ్‌ట్రాల్ ఫొటోగ్రాఫర్ అన్న పదం తమను ఎంతగానో బాధిస్తున్నదన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే 13 జిల్లాల్లోని ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు ఐక్యంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.

భార్యను హత్యచేసి.. భర్త ఆత్మహత్య

విశాలాంధ్ర-రాచర్ల : ప్రకాశం జిల్లా రాచర్ల మండలం అచ్చంపేట గ్రామంలో శనివారం భార్యను హత్య చేసిన భర్త తానూ ఆత్మహత్య చేసుకున్న ఘటన తీవ్ర విషాదం మిగిల్చింది. ఈ ఘటనలో కామిరెడ్డి కాశిరెడ్డి (60), భార్య ఈశ్వరమ్మను (55) కన్ను మూశారు. అప్పులే కుటుంబాన్ని ఉక్కిరిబిక్కిరి చేశాయనే వాదన వినిపిస్తోంది. కాశిరెడ్డి స్వగ్రామం బేస్తవారిపేట మండలం పంగపాడు గ్రామం. పొలం పనులు చేసుకుంటూ జీవిస్తున్న ఈ దంపతులకు ఇద్దరు కుమా ర్తెలు, కుమారుడు ఉన్నారు. ఇద్దరు కుమార్తెలకు పెళ్లిళ్లు చేశారు. కుమారుని వివాహం కావాల్సి ఉంది. కుమా రుడు పాలవ్యాపారం చేస్తుండగా, కాశిరెడ్డి పొలం పనులకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో వ్యవసాయంలో నష్టం, పాల వ్యాపారంలోనూ నష్టం వాటిల్లడంతో దాదాపు రూ.15 లక్షల వరకు అప్పులు మిగిలాయి. దిక్కుతోచని కాశిరెడ్డి తన పొలంలో కొంత భాగం విక్రయించి రూ. 9లక్షల వరకు అప్పులు తీర్చాడు. ఈ క్రమంలో తన పెద్దకుమార్తె కాపురం ఉంటున్న అచ్చంపేట గ్రామానికి వచ్చి స్థిరపడ్డారు. మిగిలిన అప్పు కొంతవరకైనా తీర్చవచ్చనే ఆశతో గ్రామంలోని రైతుల నుంచి 7 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకున్నారు. ఈ పొలాలపైనా ఆశించిన రాబడి లేకపోవడం, పెట్టుబడులకు వడ్డీలు పెరిగిపోవడంతో మరింత కుంగిపోయాడు. తండ్రి దీనస్థితిని గమనించిన కుమారుడు ఒంగోలులోని ఒక హోండా షోరూమ్‌లో నెలసరి వేతనానికి ప్రైవేటు ఉద్యోగంలో చేరాడు. అప్పులు ఇచ్చిన వారు ప్రతిరోజు ఇంటికి వచ్చి ఇబ్బందులు పెట్టడంతో కాశిరెడ్డి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అవమానాల పాలయ్యే కన్నా తనువు చాలించడమే మేలనుకొని తన భార్య ఈశ్వరమ్మను రోకలిబండతో తలపై కొట్టి ఆమె మరణిం చిన అనంతరం తానూ విషగుళికలు తిని పొలంలో మృతి చెందాడు. గిద్దలూరు సీఐ శ్రీరాం, రాచర్ల ఎస్ఐ నాగశ్రీను ఘటనా స్థలిని పరిశీలించారు. గ్రామస్తులు, కుటుంబ సభ్యుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జోసఫ్ తంబి ఉత్సవాల్లో జనసందోహం



విశాలాంధ్ర-ఉంగుటూరు : కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలంలోని పెద అవుటపల్లి వద్ద బ్రదర్ జోసఫ్ తంబి ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమ య్యాయి. వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చారు. తొలుత విజయవాడలోని ఎనికేపాడు మేరిమాత కపూచియన్ ప్రొవెన్షియల్ రెవరెండ్ ఫాదర్ మెల్కియార్ కాటా దివ్యబలిపూజ నిర్వహించారు. ఆలయ గురువు రెవరెండ్ ఫాదర్ దేవదాసు ఆధ్వర్యంలో పవిత్రాత్మ సూత్నీకరణ ప్రార్థనలు చేశారు. రెవరెండ్ ఫాదర్స్ ఏసురవి, రమేష్, ప్రవీణ్, లేమస్‌నాయక్,తేజేశ్వర్,ప్రతాప్ నాయక్, ప్రతాప్ పాల్గొన్నారు. రాత్రికి మూడు రోజులపాటు కొనసాగే ఉత్సవాలకు లక్షలాదిగా తరలివచ్చే అవకాశం ఉన్నందున పోలీసులు, ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. 24 గంటలు ఉచిత వైద్యశిబిరాలు, మంచినీటి సౌకర్యం సమకూర్చారు. 300 మంది పోలీస్ సిబ్బంది, 200 మంది ప్రయివేటు సెక్యూరిటీ సిబ్బంది పనిచేస్తున్నారు.

పరిశ్రమల్లేవు.. ఉపాధి లేదు

- నెల్లూరు జిల్లాలో 18 వేల ఎకరాల సేకరణ
- నిరుపయోగంగా భూములు
- పట్టించుకోని పాలకులు



విశాలాంధ్రబ్యూరో -నెల్లూరు : నెల్లూరు జిల్లాలోని సెజ్‌లు, పారిశ్రామిక పార్కులు అలంకారప్రాయంగా మారాయి. యువతకు ఉపాధి కల్పన పేరుతో ప్రభుత్వ భూములతోపాటు రైతుల పట్టాభూములు కలిసి సుమారు 18 వేల ఎకరాలను కోలాహలంగా సేకరించారు. కొన్నిచోట్ల భూములిచ్చేందుకు రైతులు నిరాకరించినా ప్రభుత్వం బలవంతంగా సేకరించింది. ఏళ్లు గడుస్తున్నా ఫ్యాక్టరీలు నెలకొల్పేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రాకపోవడంతో భూములు నిరుపయోగంగా ఉన్నాయి. భూములు సేకరించిన తర్వాత మూడు సంవత్సరాల్లోపు పరిశ్రమలు పెట్టకపోయినా ఆయా కంపెనీలకు కేటాయించిన భూములను ఒక్క రైతుకూ తిరిగి ఇవ్వలేదు. ఆ చట్టాలేమీ ఇక్కడ వర్తించలేదు. దీంతో దశాబ్ద కాలం నుంచి ఆ భూముల్లో ఎలాంటి పంటలు సాగుచేయకుండా బీడుగా ఉన్నాయి. రైతులకు ఇచ్చిన పరిహారం మొత్తం కుటుంబ అవసరాలకు హారతికర్పూరంగా కరిగిపోయింది. పారిశ్రామిక పార్కులు, సెజ్‌ల్లో ఏపీఐఐసీ ద్వారా మౌలిక సదుపాయాలు కల్పించి పారిశ్రామికవేత్తలకు అప్పగించాల్సి ఉంది. భూములు తీసుకున్న పారిశ్రామి కవేత్తలు నిర్దేశిత వ్యవధిలో ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ ఇక్కడ పరిశ్రమలను వేళ్ల మీదే లెక్కించవచ్చు. భూములు వారి పేరిట ఉంచుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఏపీఐఐసీ అధీనంలోనే వేలాది ఎకరాలు నిరుపయోగంగా ఉన్నాయి. పరిశ్రమలకు కేటాయించిన 18 వేల ఎకరాల్లో చాలాచోట్ల ఖాళీగానే ఉన్నాయి. కృష్ణపట్నం సెజ్, రిలయన్స్, కోస్టల్ ఆంధ్రపవర్, కెనడా పవర్ సంస్థలకు ప్రభుత్వం వేల ఎకరాలు అప్పగించింది. కానీ సెంటు భూమిలోకూడా ఎటువంటి కట్టడం కానరావడం లేదు. ఏపీఐఐసీ ద్వారా జిల్లాలో 11 ఇండస్ట్రియల్ పార్కులను అభివృద్ధి చేశారు. దీని కోసం 3000 ఎకరాలు సేకరించారు. మౌలిక సదుపాయాల కల్పనకు 668 ఎకరాలు మినహాయిస్తే 2,332 ఎకరాల్లో పరిశ్రమలు నెలకొల్పాల్సి ఉంది. దీనిలో 1200 ఎకరాలను ఇప్పటికే వివిధ పరిశ్రమల కోసం కేటాయించారు. నాయుడుపేట వద్ద సెజ్ కోసం రైతుల నుంచి 2,549 ఎకరాలు సేకరించిన అధికారులు మౌలిక సదుపాయాల కోసం 1,071 ఎకరాలు, పరిశ్రమలకు 1,478 ఎకరాలను కేటాయించారు. అక్కడ 1,100 ఎకరాలు ఖాళీగా ఉన్నాయి. చిల్లకూరు మండలంలో 26 పారిశ్రామిక పార్కుల కోసం 9,955 ఎకరాలు సేకరించారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు 6,277 ఎకరాలను కేటాయించగా, మిగిలిన 3,596 ఎకరాలు ఖాళీగా ఉన్నాయి. ఏపీఐఐసీ సేకరించిన భూముల్లో 3,786 ఎకరాల పట్టాభూములు ఉన్నాయి. ప్రభుత్వ భూములు 18,074 ఎకరాల వరకు ఉన్నాయి. భూ సేకరణ సమయంలో నామమాత్రంగా చెల్లించిన పరిహారం కుటుంబ అవసరాలకు ఖర్చు అయిపోగా ప్రస్తుతం భూములు, ఉపాధి అవకాశాలు లేక రైతులు అల్లాడుతున్నారు. కొడవలూరు మండలంలోని రాచర్లపాడు వద్ద కిసాన్ సెజ్ కోసం దశాబ్ద కాలం కిందట సేకరించిన సుమారు 2,200 ఎకరాలు ఖాళీగానే దర్శనమిస్తున్నాయి. ఇక్కడ రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కున్నారనే విమర్శలు ఉన్నాయి. రెండు పంటలు పండే భూములను ఇచ్చేది లేదని రైతులు అడ్డం తిరిగినా తీసుకున్నారు. వ్యవసాయాధారిత ఎరువుల ఫ్యాక్టరీ ఏర్పాటుచేస్తామన్నా ఆ ఊసే కానరాలేదు. తర్వాత విదేశీ కంపెనీ గమేషాకు లీజుకు ఇవ్వడంతో వారు ఫ్యాన్ల ఫ్యాక్టరీ పెట్టుకున్నారు. ఇఫ్కో యూరియా ఫ్యాక్టరీ కోసం తీసుకున్న భూముల్లో యూరియా ఫ్యాక్టరీ పెట్టి విదేశీ కంపెనీలకు కట్టబెట్టారు. మిగిలిన భూముల్లో కోకోకోలా కంపెనీ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. వ్యవసాయాధారిత ఫ్యాక్టరీలకు భూములు తీసుకుని ఇతర పరిశ్రమలు ఏర్పాటుచేయడం ఏమిటని స్థానిక రైతులు మండిపడుతున్నా సమాధానం చెప్పేవారే కానరాని పరిస్థితి. ఖాళీగా దర్శనమిస్తున్న భూములను తిరిగి ఇచ్చేయాలంటూ రైతులు తరచూ ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. కృష్ణపట్నం సెజ్ కోసం సేకరించిన 4,700 ఎకరాల భూములు నిరుపయోగంగా ఉన్నాయి.

సెజ్‌భూముల్లో అమ్మకాలు

సెజ్‌లు ఏర్పాటు చేసిన నిర్వాహకులు మిగిలిన భూములను అధిక ధరలకు ఇతరులకు అమ్ముకుంటున్నారు. జిల్లాలో ఎనిమిది థర్మల్ విద్యుత్తు ప్రాజెక్టుల ఏర్పాటు కోసం 5,136 ఎకరాలు సేకరించారు. వాటిలో 4,823 ఎకరాలను వివిధ సంస్థలకు కేటాయిం చారు. ఇప్పటికీ 313 ఎకరాలు ఖాళీగా ఉన్నాయి. ఇక్కడ కేవలం నాలుగు థర్మల్ విద్యుత్తు కేంద్రాలు మాత్రమే ఏర్పాటు చేశారు. మిగిలిన వాటి ఏర్పాటు సందిగ్ధంగా మారింది. మిగిలిన నాలుగు ప్రాజెక్టులకు కేటాయించిన భూములు ఖాళీగానే ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూములు సేకరించిన తర్వాత పరిశ్రమలు నెలకొల్పకపోతే తిరిగి రైతులకు అప్పగించాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థల కొమ్ముకాస్తూ పేదలను బజారుపాల్జేస్తోంది.

కాంట్రాక్ట్ ఆచార్యుల సమస్యల పరిష్కారానికి కమిటీ

కమిటీలో ఇద్దరు మాజీ వీసీలు

నివేదికకు 15 రోజుల గడువు

విశాలాంధ్ర - విశాఖసిటీ : రాష్ట్రవ్యాప్తంగా 14 విశ్వవిద్యాలయాల్లోని కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సమస్యలను అధ్యయనం చేసి వాటి పరిష్కారానికున్న సాధ్యాసాధ్యాల పరిశీలనకు రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత విద్యామండలి జీవో విడుదల చేసింది. ఈ కమిటీలో జేఎన్‌టీయూ కాకినాడ పూర్వ వీసీ ఆచార్య అల్లం అప్పారావు, తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య ఎస్.ప్రభాకర్‌రావును కమిటీ సభ్యులుగా నియమించింది. సమస్యలను సమగ్రంగా అధ్యయనం చేసి 15 రోజుల్లోపు నివేదిక ఇవ్వాల్సినదిగా జీవో నంబరు 8 లో సూచించింది. రాష్ట్రంలో 20 ఏళ్లుగా యూనివర్సిటీల్లో ఆచార్యుల నియామకాలు లేకపోవడంతో ఆయా వర్సిటీలు కాంట్రాక్ట్ పద్ధతిలో అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించుకుంటూ ప్రత్యామ్నాయ పద్ధతిలో టీచింగ్ సిబ్బంది కొరతను అధిగమిస్తున్నాయి. ఈ దశలో గత ఏడాది రాష్ట్ర ప్రభుత్వం అన్ని విశ్వవిద్యాలయాల్లో 1,385 మంది టీచింగ్ సిబ్బంది నియామకానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వీరిలో ప్రొఫెసర్లు, అసోసియేట్ మినహా అసిస్టెంట్ ప్రొఫెసర్లు 1,104 మంది నియామకానికి సమాయత్తమైంది. ఇప్పటికే ఏపీపీఎస్సీ దీనిపై కసరత్తు ప్రారంభించింది. ఇదే సమయంలో 20 ఏళ్లుగా కాంట్రాక్ట్ పద్ధతిలో యూనివర్సిటీల్లో పనిచేస్తున్న వెయ్యి మంది తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఏపీ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపట్టింది. స్పందించిన ప్రభుత్వం వీరి సమస్యలు అధ్యయనం కోసం ఈ కమిటీని నియమించింది. గతంలో కిరణ్‌కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఉమ్మడి రాష్ట్రంలోనూ ఇదే తరహా కమిటీని నియమించడంతో ఆ నివేదిక ప్రభుత్వానికి కూడా చేరింది తదనంతరం జరిగిన పరిణామాల నేపథ్యంలో ఆ నివేదిక అమలుకు నోచుకోలేదు. ఈ అంశాలపై తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే ఒక కమిటీని నియమించి ఆ సభ్యులు ఇచ్చిన నివేదిక ఆధారంగా అక్కడి విశ్వవిద్యాలయాల్లోని కాంట్రాక్ట్ ఆచార్యులకు కొంత ఊరట కలిగేలా చర్యలు తీసుకుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్ట్ అధ్యాపకుల విషయంలో వేసిన కమిటీ ఎంత వరకు ఫలితమిస్తుందోనని రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగంలో ఆసక్తి నెలకొంది. ఈ అంశంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచిచూడాలి.

లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో విజయనగరం

- వంద గంటల్లో 10 వేల మరుగుదొడ్ల నిర్మాణంతో..
- 2018లో విడుదలైన రికార్డ్స్‌లో జిల్లాకు చోటు

విశాలాంధ్ర-విజయనగరం : స్వచ్ఛాంధ్రప్రదేశ్ ప్రయత్నంలో గత ఏడాది మార్చిలో జిల్లాలో చేపట్టిన వంద గంటల్లో పది వేల మరుగుదొడ్ల నిర్మాణానికి లిమ్కా బుక్ ఆఫ్ రికార్డుల్లో చోటు దక్కింది. కలెక్టర్ వివేక్ యాదవ్ నేతృత్వంలో జిల్లా యంత్రాంగం కేవలం వంద గంటల్లోనే పది వేల మరుగుదొడ్లు నిర్మించి రికార్డు సృష్టించింది. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రజలతో ఆకాశవాణి (మన్‌కీ బాత్) కార్యక్రమంలో ప్రస్తావించడంతోపాటు పలు జాతీయస్థాయి వెబ్‌సైట్‌లు ఈ కార్యక్ర మాన్ని ప్రశంసించాయి. 2018వ సంవత్సరానికి సంబంధించి జనవరి ఎనిమిదో తేదీన లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ విడుదల చేసిన తాజా సంచికలో విజయనగరం జిల్లా వినూత్న స్వచ్ఛ కార్యక్రమానికి చోటు కల్పించారు. మార్చిలో మొదలుపెట్టి ముమ్మరంగా చేపడుతున్న వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాల్లో 78 శాతం కుటుంబాలు ఇప్పటికే పూర్తి చేశాయి. ఫిబ్రవరి 15వ తేదీ నాటికి సంపూర్ణ ఓడీఎఫ్ జిల్లాగా రూపొం దించే దిశగా విజయనగరం జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతోంది. లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం దక్కడంపై కలెక్టర్ వివేక్‌యాదవ్ సంతోషం వ్యక్తం చేశారు.

గుంటూరులో సీపీఎం నేతల అరెస్ట్



విశాలాంధ్ర-గుంటూరు (జిల్లాపరిషత్) : గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం పెదగొట్టిపాడు దళిత కాలనీ సందర్శనకు బయలుదేరిన సీపీఎం రాష్ట్ర నాయకులను శనివారం గుంటూరు పోలీసులు అడ్డుకున్నారు. బ్రాడీపేటలోని పార్టీ కార్యాలయం నుంచి బయలుదేరేందుకు సన్నద్ధమైన నాయకులను పార్టీ కార్యాలయం వద్దే అడ్డగించారు. తొలుత సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.కృష్ణయ్య సహా జిల్లా నాయకులు, కార్యకర్తలు అక్కడకు చేరుకున్నారు. అప్పటికే పోలీసులు నాయకుల్ని చుట్టుముట్టి మూకుమ్మడిగా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా పోలీసులు, పార్టీ నాయకులకు మధ్య తీవ్ర స్థాయిలో తోపులాట జరిగింది. ప్రభుత్వ నిరంకుశ విధానం నశించాలంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. తోపులాటలో గుంటూరు పశ్చిమ జిల్లా కార్యదర్శి గద్దె చలమయ్య స్పృహ తప్పి పడిపోవటంతో జీజీహెచ్‌కు తరలించారు. మధు, వి.కృష్ణయ్య, వెంకటేశ్వర్లు, రాధాకృష్ణతో సహా 58 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు తాడికొండ, నల్లపాడు, పట్టాభిపురం పోలీస్ స్టేషన్లకు తరలించారు. రాష్ట్ర ప్రభుత్వం, అధికార పార్టీ నేతలు అగ్రవర్ణాలకు కొమ్ముకాస్తూ, దళితులకు అన్యాయం చేస్తున్నారని పి.మధు విమర్శించారు. గొట్టిపాడులో చిన్న ఘటన ఆధారంగా దళితకాలనీ మొత్తాన్ని బెదిరించి వారిపై సామాజిక ఆంక్షలు అమలు చేయడం, బాధిత దళితులపైనే కేసులు నమోదు చేయటం అన్యాయమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దళితులపై దాడి చేసిన అగ్రవర్ణానికి చెందిన ప్రధాన నిందితుల్ని ఇప్పటికీ అరెస్ట్ చేయలేదన్నారు. స్థానిక అధికార పార్టీ దళిత ఎమ్మెల్యే సైతం అగ్రవర్ణాల కొమ్ము కాయడం బాధాకరమన్నారు. ఎప్పటికైనా గొట్టిపాడును సందర్శించి, బాధితులకు అండగా నిలుస్తామని మధు స్పష్టం చేశారు.

జలక్రీడల కేంద్రంగా నాగాయలంక

దివిసీమ సంప్రదాయ పడవల పోటీలు ప్రారంభం



విశాలాంధ్ర -అవనిగడ్డ : కృష్ణాజిల్లాలోని తీరప్రాంతమైన నాగాయలంక జలక్రీడలకు కేంద్రమవుతుందని రాష్ట్ర న్యాయశాఖ, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చెప్పారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కృష్ణానదిలో దివిసీమ సంప్రదాయ పడవల పోటీలను శనివారం నాగాయలంకలోని శ్రీరామ పాదక్షేత్రం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన ప్రారంభించారు. రూ.3 కోట్లతో చేపట్టిన జల క్రీడల అకాడమీ భవన నిర్మాణ పనులకు ఉపసభాపతి డాక్టర్ మండలి బుద్ధప్రసాద్‌తో కలిపి ఆయన శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రవీంద్ర మాట్లాడుతూ జలక్రీడల్లో ఇక్కడ శిక్షణ తీసుకునే క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోనూ గుర్తింపు సాధించేలా రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. జలక్రీడలు అంటేనే నాగాయలంక అనేలా అన్ని మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. బుద్ధప్రసాద్ మాట్లాడుతూ కేరళ రాష్ట్రం తరహాలో నాగాయలంక జల క్రీడల శిక్షణా కేంద్రం నుంచి క్రీడాకారులను తీర్చిదిద్దడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పర్యాటక ప్రాంతంగా నాగాయలంకను అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

ఎన్డీఆర్ఎఫ్ దళాల పర్యవేక్షణ

దివిసీమ సంప్రదాయ పడవల పోటీల్లో ఎటువంటి అపశ్రుతి దొర్లకుండా చూసేందుకు ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది తరలివచ్చారు. నాగాయలంక శ్రీరామ పాదక్షేత్రం కేంద్రంగా రెండురోజుల పాటు కృష్ణానదిలో తమ బోట్లతో పర్యటిస్తూ ఉంటారు. స్వచ్ఛనాగాయలంక సభ్యులు ఆహూతులకు కావాల్సిన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉచిత భోజన వసతి కల్పించారు.

అరకు అందాలకు హెలీ టూరిజం

మెడికల్ ఎమర్జెన్సీకీ వినియోగం



విశాలాంధ్ర-విశాఖ : విశాఖలో ప్రవేశపెట్టిన హెలీ టూరిజానికి ఆశించిన స్థాయిలో పర్యాటకుల నుంచి స్పందన లేకపోవడంతో ఇకపై అరకు అందాలను తిలకించేందుకు ప్రవేశపెట్టనున్నారు. నగరంలో గత నెల 16న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హెలీ టూరిజాన్ని ప్రారంభించారు. విశాఖ ఉత్సవ్ సందర్భంగా మొదలైన హెలీ టూరిజం 5 రోజులపాటు బాగానే కొనసాగింది.

నాలుగువందల మంది టూరిస్టులు విశాఖ అందాలను తిలకించారు. మొదట హెలీప్యాడ్‌ను వుడాలో నిర్మించాలని భావించారు. అక్కడ సాధ్యం కాకపోవడంతో తాత్కాలికంగా రుషికొండ వద్ద ఏర్పాటు చేశారు. విశాఖ ఉత్సవ్ ముగిసిన తర్వాత పర్యాటకులు హెలీ టూరిజంపై ఆసక్తి చూపలేదు. పది నిమిషాలపాటు నగర అందాలు తిలకించేందుకు రూ.2,500 చొప్పున వసూలు చేశారు. ఇది ఎక్కువ మొత్తం కావడంతో పర్యాటకులు వెనుకడుగు వేశారు. విదేశీ పర్యాటకులకు పెద్ద మొత్తం కాకపోవడంతో ఆసక్తి చూపుతారని భావించి అరకుకు పెట్టాలని ఆలోచన చేస్తున్నారు. ఈ మేరకు హెలీ టూరిజాన్ని నడుపుతున్న పవన్ హాన్స్ సంస్థతో వుడా ఒప్పందం చేసుకుంది. పది నిమిషాల నుంచి 25 నిమిషాలకు పర్యటన సమయం పెంచేలా ఒప్పించారు. ఈ సంక్రాంతికి ట్రైల్ రన్ నిర్వహించనున్నారు. ఇప్పటికే అరకులోని ప్రభుత్వ ఐటీ వద్ద హెలీప్యాడ్ సిద్ధం చేశారు. ఒక పైలెట్‌తో పాటు అయిదుగురు పాసింజర్లు ప్రయాణించే ఆరు సీట్ల హెలికాప్టర్ కావడంతో సౌకర్యవంతంగా ఉంటుందని భావిస్తున్నారు. టెంపుల్ టూరిజానికి కూడా హెలీకాప్టర్‌ను వినియోగించాలని భావిస్తున్నారు. పండగ సీజన్‌లో అరకుకు ఏటా టూరిస్టుల తాకిడి ఎక్కువ ఉంటుంది. వేసవిలోనూ పర్యాటకులు పోటెత్తుతారు. ఈ దృష్ట్యా వుడా అధికారులు పవన్‌హాన్స్ సంస్థతో సంప్రదింపులు జరిపి ఏర్పాట్లు చేస్తారు.

మెడికల్ ఎమర్జెన్సీకి వినియోగం

ఏజెన్సీలో అత్యవసర పరిస్థితుల్లో మెడికల్ ఎమర్జెన్సీకి ఈ హెలికాప్టర్‌ను ఎయిర్ అంబులెన్స్‌లా సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నది. ప్రమాదకర పరిస్థితుల్లో సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రులకు తరలించేందుకు వినియోగించనున్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో, ఏదైనా విపత్తుల్లో చిక్కుకున్నవారిని రక్షించి సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు వినియోగిస్తారు. ఇటీవల సింహాచలం కొండపైకి ట్రెక్కింగ్‌కు వెళ్లిన యువకులు అడవుల్లో చిక్కుకున్నారు.

కైలాసపురం నుంచి సింహాచలం వెళుతుండగా ఆరుగురు యువకులు దారితప్పిపోయారు. వీరి కోసం పోలీసులు, నేవీ అధికారులు హెలికాప్టర్ ద్వారా గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఇలాంటి అత్యవసర సమయాల్లో హెలికాప్టర్ ఉపయోగపడుతుందని అధికారులు భావిస్తున్నారు.

సందేశరా గ్రూపు కుంభకోణం కేసులో

ఆంధ్రా బ్యాంక్ మాజీ డైరక్టర్ అరెస్టు

అహ్మదాబాద్ : సందేశరా గ్రూపు కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ ఆంధ్రా బ్యాంక్ మాజీ డైరక్టర్ అనుప్ ప్రకాశ్ గార్గ్‌ను అరెస్టు చేసింది. సందేశరా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ సుమారు రూ. 5 వేల కోట్ల మేరకు బ్యాంక్ రుణం కోసం మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈడీ అధికారులు శుక్రవారం సాయంత్రం అనుప్ ప్రకాశ్ గార్గ్‌ను అదుపులోకి తీసుకున్నారు. మనీల్యాండరింగ్ కేసులో ఇది రెండవ అరెస్టు. గత ఏడాది నవంబర్‌లో ఢిల్లీకి చెందిన వ్యాపారవేత్త గగన్ ధావన్‌ను కూడా అరెస్టు చేశారు. పీఎంఎల్‌ఏ యాక్టు కింద గార్గ్‌ను అరెస్టు చేశారు. ప్రత్యేక కోర్టు ముందు ఆయన్ను ప్రవేశపెట్టనున్నారు.

సందేశరా గ్రూపు స్కామ్‌లో.. ఈడీ, సీబీఐలు గార్గ్‌ను నిందితునిగా చేర్చాయి. సీబీఐ ఎఫ్‌ఐఆర్‌ను పరిశీలించిన తర్వాత ఈ కేసులో ఈడీ చర్యకు పూనుకున్నది. సందేశరా గ్రూపు కేసులో 2011లో ఐటీశాఖ నిర్వహించిన దాడుల్లో కొన్ని డైరీలు దొరికాయి. అయితే ఆంధ్రా బ్యాంక్ డైరక్టర్ గార్గ్‌కు కూడా సుమారు రెండు కోట్ల ముడుపులు ముట్టినట్లు ఆ డైరీలో ఉన్నది. 2008 నుంచి 2009 మధ్య సందేశరా బ్రదర్స్ ఆ మొత్తాన్ని గార్గ్‌కు ఇచ్చినట్లు ఆ డైరీల్లో రాశారు. సందేశరా బ్రదర్స్‌కు చెందిన బినామీ కంపెనీల నుంచి డబ్బును డ్రా చేసి.. ఆంధ్రా బ్యాంక్ డైరక్టర్ గార్గ్‌కు ఇచ్చినట్లు ఆ విచారణలో తేలింది. అయితే సందేశరా సోదరుల నుంచి వచ్చిన కోట్లాది రూపాయాలను వేర్వేర్వు కంపెనీల్లో గార్గ్ పెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. బోగస్ షెల్ కంపెనీలకు ఆ మొత్తాన్ని ఆయన తరలించినట్లు ఈడీ తన విచారణలో తేల్చింది. బ్యాంక్ ఫ్రాడ్ కేసులో స్టెర్లింగ్ బయోటెక్‌కు చెందిన డైరక్టర్లు, చార్టెడ్ అకౌంట్లపై సీబీఐ గతంలో కేసులు నమోదు చేసింది. సందేశరా గ్రూపు ఆంధ్రా బ్యాంక్ కన్‌సోర్టియమ్ నుంచి అక్రమ పద్ధతిలో సుమారు అయిదు వేల కోట్ల రుణం తీసుకున్నట్లు సీబీఐ పేర్కొన్నది. సందేశరా గ్రూపు కంపెనీ 2016 డిసెంబర్ 31 వరకు బ్యాంకులకు మొత్తం 5383 కోట్లు బకాయి ఉన్నట్లు తేల్చింది. సందేశరా గ్రూపు కేసులో ఇటీవల గుజరాత్ సీనియర్ నేత, ఎంపీ అహ్మద్ పటేల్ కుమారుడు ఫైసల్‌ను విచారించేందుకు ఈడీ సిద్ధమైంది. బ్యాంక్ రుణం తీసుకున్న కేసులో ఆయన్ను విచారించే అవకాశాలు ఉన్నాయి. అహ్మద్ పటేల్ కుమారుడు ఫైసల్‌తో పాటు ఆయన అల్లుడు ఇర్ఫాన్ సిద్ధిఖీపై ఈడీ నిఘా పెట్టింది. మనీల్యాండరింగ్ కేసు కింద పటేల్ కుమారుడిని విచారించనున్నారు.



విద్యార్థులతో మంచులక్ష్మీ

సంక్రాంతి సంబురాలు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: సినీనటి, నిర్మాత మంచులక్ష్మీ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో కలిసి సంక్రాంతి సంబురాలు జరుపుకున్నారు. టీచ్ ఫర్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జంటనగరాల్లో 38 ప్రభుత్వ పాఠశాలల నుంచి సుమారు 50 మంది విద్యార్థులు మంచులక్ష్మీ నివాసానికి చేరుకొన్నారు. పాఠశాల విద్యార్థులతోపాటు, టీచ్ ఫర్ చేంజ్ వాలంటీర్లకు మంచులక్ష్మీ సంక్రాంతి విందు భోజనాన్ని వడ్డించారు. ప్రతిఏటా పండుగల సందర్భంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ఫైవ్‌స్టార్ హోటల్‌కు తీసుకెళ్లి వేడుక జరుపుకునేవారమని, ఈసారి తన ఇంట్లోనే సంబురాలు చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. పేద, ధనిక అంతరాన్ని విద్యార్థుల్లో రానివ్వకుండా చేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మంచు లక్ష్మీ తెలిపారు. కార్యక్రమంలో టీచ్ ఫర్ చేంజ్ వ్యవస్థాపకుడు చైతన్యతోపాటు 25 మందికిపైగా వాలంటీర్లు పాల్గొన్నారు.

చల్లారని సెగ

మోడీ వికృత చేష్టల వల్లే న్యాయవ్యవస్థలో సంక్షోభం



- అరుణాచల్ సీఎం ఆత్మహత్య కేసును సుప్రీంకి అప్పగించాలి
- మెడికల్ కుంభకోణం, సీబీఐ స్పెషల్ జడ్జి లోయా కేసులు కూడా..
- సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ డిమాండు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : ప్రధాని నరేంద్ర మోడీ వికృత చేష్టలే న్యాయవ్యవస్థలో సంక్షోభానికి కారణమని సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ విమర్శించారు. ఈ వ్యవహారానికి మోడీ బాధ్యత వహించాలని, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు చేసిన ఆరోపణలపై ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని డిమాండు చేశారు. విజయవాడ దాసరిభవన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజకీయ వ్యవస్థ, ప్రభుత్వాలపై నమ్మకాలు తగ్గుతున్న తరుణంలో దేశాన్ని రక్షించేందుకు న్యాయవ్యవస్థే సాయపడుతుందని అంతా భావిస్తున్నారని తెలిపారు. అనేక అవినీతి కుంభకోణాలు వెలికితీస్తున్నందున న్యాయవ్యవస్థపై ప్రత్యేక గౌరవం, గురుత్వం ప్రజల్లో ఉన్నదన్నారు. జస్టిస్ చలమేశ్వర్ సహా నలుగురు న్యాయమూర్తులు ఏకంగా చీఫ్ జస్టిస్‌పై రాతపూర్వకంగా, మీడియా ద్వారా తమ ధిక్కారస్వరాన్ని వినిపించారన్నారు. లీగల్‌గా, టెక్నికల్‌గా సుప్రీం న్యాయమూర్తులు బహిర్గతం కావడం సరికాదన్నారు. పరిణితి చెందిన న్యాయమూర్తులైన వీరు ఎంతగానో ఆవేదన చెందడం వల్లే అగ్నిగోళం బద్ధలైనట్లు తమ బాధను వ్యక్తం చేశారన్నారు. న్యాయమూర్తులు లేవనెత్తిన అంశాలను నారాయణ ప్రస్తావిస్తూ.. అరుణాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి కలిఖో పుల్ 2016లో ఆత్మహత్యకు పాల్పడ్డారని తెలిపారు. గిరిజనుడైన ఆయనను లంచం తీసుకోవాలని వత్తిడి తేవడమే కాకుండా వేధింపులకు గురిచేయడంతో 62 పేజీల ఉత్తరం రాసి ఆత్మహత్య చేసుకున్నారన్నారు. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తికి ప్రధానమంత్రి కార్యాలయం నుంచి స్వయంగా లంచాలు తీసుకోవాలని వత్తిడి చేయడంతో ఈ ఘటన చోటు చేసుకుందని లోకం కోడై కూస్తోందన్నారు. ఈ కేసుకు సంబంధించిన ఫైల్‌ను, జడ్జిని మార్చేసి ఉద్దేశపూర్వకంగానే కేసును మాయం చేశారన్నారు. ఒడిశాలో వేలకోట్లకు సంబంధించిన మెడికల్ కుంభకోణం కేసును కూడా చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా చొరవతో మొత్తం మార్పించేశారని తెలిపారు. అలాగే సోహబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసును చేపట్టిన సీబీఐ స్పెషల్ జడ్జి బీఎం లోయా మరణం కూడా మిస్టరీగా మార్చేయడంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా హస్తం ఉందన్నారు. లోయా మరణానికి సంబంధించి అమిత్‌షాపై నమోదు చేసిన కేసును కూడా మాయం చేశారన్నారు. ఇక కొలీజియం స్వతంత్రంగా వ్యవహరించాలా లేదా అనే విషయాలపై కూడా కేంద్రం జోక్యంతో వివాదాలు నెలకొని ఉన్నాయన్నారు. న్యాయమూర్తుల నియామకానికి సంబంధించి మెమోరాండం ఆఫ్ ప్రొసెస్ (ఎంపీవో)ను ప్రధాని కార్యాలయం కావాలనే ఏడాది కాలంగా తొక్కిపట్టి ఉంచిందన్నారు. ప్రధాని కార్యాలయం చీఫ్ జస్టిస్‌పై, సుప్రీంకోర్టుపై ఆధిపత్యాన్ని చెలాయిస్తోందనేది నిరూపణ అవుతోందన్నారు. ఈ విషయాలపై ఐదేళ్ల క్రితం లేఖ రాసినా ఫలితం లేకపోవడం వల్లే న్యాయమూర్తులు ఈ విధంగా తమ ఆవేదనను బహిర్గతం చేశారని నారాయణ స్పష్టం చేశారు. మోడీ నాయకత్వంలో దేశంలోని అనేక అంగాలపై నియంతృత్వ హస్తముందని ముందు నుంచి సీపీఐ చెబుతోందని, చివరకు అది వాస్తవమని నిరూపణ అయిందన్నారు. గవర్నర్ల వ్యవస్థ, ఎన్నికల కమిషన్, సీబీఐ, ఆర్బీఐ, నీతిఆయోగ్.. ఇవన్నీ కూడా కేంద్రం కనుసన్నల్లోనే పనిచేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. మోడీని వ్యతిరేకించిన లాలుప్రసాద్ యాదవ్, శశికళలను జైలుకు పంపించారన్నారు. అనేక ఆరోపణలు, కుంభకోణాల్లో కూరుకుపోయిన వారు బీజేపీ పంచన చేరితే గంగిగోవులుగా ముద్రలు వేస్తున్నారని విమర్శించారు.

సీఎం భేటీ వివరాలు పీఎంఓ వెల్లడించాలి: కె రామకృష్ణ

ప్రధాని నరేంద్రమోడీతో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ వివరాలను ప్రధాని కార్యాలయం (పీఎంఓ) వెల్లడించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ డిమాండు చేశారు. ఏడాది కాలం తర్వాత ఎట్టకేలకు మోడీని చంద్రబాబు కలిశారన్నారు. భేటీ తర్వాత విభజన హామీల అమలు కోసం తాను ఏయే అంశాలను కోరానో చంద్రబాబు మీడియాకు చెప్పారే కానీ, ప్రధాని వేటిని అంగీకరించారు, ఏమిస్తామన్నారో వెల్లడించలేదన్నారు. దీనిపై పీఎంఓ నుంచి ఏవిధమైన సమాధానం రాకపోవడం విచారకరమన్నారు. మూడున్నరేళ్లుగా మోడీ రాష్ట్రాన్ని, ప్రజలు, సీఎంను పూచికపుల్లతో సమానంగా చూస్తున్నారని తెలిపారు. చంద్రబాబు ఢిల్లీ వెళ్లడం.. అర్జీలు ఇవ్వడం.. తిరిగి రావడం తప్ప రాష్ట్రానికి ఏవిధమైన న్యాయం జరగడంలేదన్నారు. విభజన చట్టంలో పేర్కొన్న దానికి భిన్నంగా ప్రపంచ బ్యాంకు రుణంతో అమరావతి రాజధాని, నాబార్డు అప్పుతో పోలవరం నిర్మాణం చేపట్టడం సమర్థనీయం కాదన్నారు. ఈ విషయమై సంక్రాంతి తర్వాత ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి ఆధ్వర్యంలో అన్ని రాజకీయపార్టీలతో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు. మరోసారి కేంద్రప్రభుత్వంపై ఉద్యమానికి శ్రీకారం చుడతామని రామకృష్ణ స్పష్టం చేశారు. విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి కూడా పాల్గొన్నారు.



'సుప్రీం' వివాదం..

ఏడుగురు సభ్యుల బృందం

నలుగురు జడ్జీలతో మాట్లాడతాం

బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ ప్రకటన

న్యూఢిల్లీ : అత్యున్నత న్యాయస్థానం చరిత్రలోనే అనూహ్యంగా చోటు చేసుకున్న పరిణామాలను అంతర్గతంగానే పరిష్కరిస్తామని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ మన్నన్‌కుమార్ మిశ్రా శనివారం తెలిపారు. ఇందు కోసం ఏడుగురు సభ్యుల ప్రతినిధిబృందాన్ని ఏర్పాటు చేశామని, ఈ కమిటీ సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో సమావేశమవుతుందని చెప్పారు. "సమస్య త్వరగా పరిష్కారం కావాలని మేము కోరుకుంటున్నాం" అని తెలిపారు. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తులు నలుగురు జస్టిస్ చలమేశ్వర్, జస్టిస్ మదన్ లోకూర్, జస్టిస్ కురియన్ జోసెఫ్, జస్టిస్ గొగోయ్ శుక్రవారం అనూహ్యంగా మీడియా ముందుకు వచ్చి ప్రధాన న్యాయమూర్తిని దుయ్యబట్టారు. ఈ ఘటన విశ్వవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. బార్ కౌన్సిల్ సమావేశం అనంతరం శనివారం మిశ్రా విలేకరులతో మాట్లాడుతూ, ఈ అంశాన్ని బహిరంగంగా పరిష్కరించాలని బార్ కౌన్సిల్ అనుకోవడంలేదని చెప్పారు. "మురికి వస్త్రాలను బహిరంగంగా ఉతకాలని మేము కోరుకోవడంలేదు. సోదరభావంతోనే ఈ అంశాన్ని పరిష్కరిస్తాం. కెమేరాల ముందుకు వెళ్లడం మన వ్యవస్థనే బలహీనపరుస్తుంది" అని మిశ్రా వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో సమావేశాలతో పాటు ప్రధాన న్యాయమూర్తిని కూడా బార్ కౌన్సిల్ కలుస్తుందని సుప్రీంకోర్టు బార్ కౌన్సిల్ అధ్యక్షులు వికాస్ సింగ్ తెలిపారు.

న్యాయం కోసమే గళమిప్పాం

జస్టిస్ కురియన్ జోసెఫ్ స్పష్టీకరణ



కొచ్చి : తాము లేవనెత్తిన సమస్యలు పరిష్కారమవుతాయని సుప్రీంకోర్టు న్యాయమూర్తి కురియన్ జోసెఫ్ ఆశాభావం వ్యక్తంచేశారు. కేసుల కేటాయింపు, కొన్ని తీర్పులపై సీజేఐపై తిరుగుబాటు చేసిన నలుగురు న్యాయమూర్తుల్లో కురియన్ ఒకరు. న్యాయవ్యవస్థ ప్రయోజనాల కోసమే తాము గళం విప్పాల్సి వచ్చిందని ఆయన స్పష్టంచేశారు. ప్రధాన న్యాయమూర్తికి వ్యతిరేకంగా గళంవిప్పిన మరుసటి రోజు శనివారం కురియన్ ఈ వ్యాఖ్యలు చేశారు. తాము క్రమశిక్షణను ఉల్లంఘించలేదని ఆయన స్పష్టం చేశారు. తాము లేవనెత్తిన సమస్యలు పరిష్కారమవుతాయని, సుప్రీంకోర్టు పాలనలో పారదర్శకత వచ్చి తీరుతుందని జస్టిస్ కురియన్ ఆశాభావం వెలిబుచ్చారు. 'న్యాయ వ్యవస్థ పరిరక్షణ కోసం నిలబడ్డాం. నిన్న మేము ఢిల్లీలో అదే చెప్పాం. అంతకుమించి మరేమీ లేదు' అని జస్టిస్ కురియన్ అన్నారు. ఇక్కడికి సమీపంలోని కలాడీలో తన పూర్వీకుల ఇంటికి వచ్చిన జస్టిస్ కురియన్‌ను స్థానిక టెలివిజన్ చానెళ్లు సంప్రదించాయి. నిన్నటి పరిణామాలపై జస్టిస్ కురియన్‌ను అడుగగా ఆయన పైవిధంగా స్పందించారు. 'సమస్య అనేది వెలుగులోకి వచ్చింది. అందువల్ల కచ్చితంగా పరిష్కారం లభిస్తుంది' అని ఆయన అన్నారు. న్యాయవ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కల్పించేందుకే తాము నోరు విప్పాల్సి వచ్చిందని అన్నారు. సుప్రీంకోర్టులో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుంటు న్నాయని, సర్వోన్నత న్యాయస్థానం పాలనా వ్యవహారం గాడితప్పిందని శుక్రవారం నలుగురు జడ్జీలు-జస్టిస్ జాస్తి చలమేశ్వర్, జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ ఎంబీ లోకూర్, జస్టిస్ కురియన్ జోసెఫ్ న్యూఢిల్లీలో విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. సుప్రీంకోర్టు సక్రమంగా వ్యవహరించకపోతే దేశంలో ప్రజాస్వామ్యం బతకదని వారు ఆందోళన వెలిబుచ్చారు.

ఇంకెంతకాలం భయం?

- ఇకనైనా నోరు విప్పండి
- జడ్జీలకు ఉన్న తెగువ కూడా మీకు లేదా?
- ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతున్నా మాట్లాడరా?
- ఇంత తక్కువ కాలం పార్లమెంటు ఎప్పుడైనా జరిగిందా?
- ప్రధాని కూడా ఎవరికన్నా ఎక్కువ కాదు...
- అందరితో సమానం. అందరిలో ప్రథముడు
- కేంద్రమంత్రులకు బీజేపీ నేత యశ్వంత్‌సిన్హా ఉద్బోధ



న్యూఢిల్లీ : నరేంద్రమోడీ ప్రభుత్వంపై బీజేపీ సీనియర్ నేత యశ్వంత్‌సిన్హా మరోసారి నిప్పులు చెరిగారు. భయాన్ని విడనాడాలని తన పార్టీ సహచరులు, కేంద్రమంత్రులకు హితవు పలికారు. భారత ప్రధాన న్యాయమూర్తికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తులు నలుగురు బహిరంగంగా తిరుగుబాటు చేసిన విధంగా ప్రజాస్వామ్యం కోసం నోరు విప్పాలని కేంద్రమంత్రులకు యశ్వంత్‌సిన్హా సూచించారు. బాధ్యతాయుతమైన, గౌరవ ప్రదమైన పదవుల్లో కొనసాగుతున్న న్యాయమూర్తులే ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, పెద్దల నియంతృత్వ ధోరణులపై ప్రత్యక్షంగా, పరోక్షంగా యుద్ధం ప్రకటిస్తే...కేంద్రమంత్రులుగా ఉన్న మీరు ఎందుకు నోరు విప్పడం లేదని సూటిగా ప్రశ్నించారు. కేంద్రప్రభుత్వంలో అంతా సవ్యంగా జరుగుతుందా? ఏకాభిప్రాయంతో నిర్ణయాలు తీసుకుంటున్నారా? సమష్టిగా ముందుకు సాగుతున్నారా? గుండెలపై చేయి వేసుకొని చెప్పండి. ఎంతకాలం నోరుమూసుకొని కూర్చుంటారని యశ్వంత్‌సిన్హా కేంద్రమంత్రులను నిలదీశారు. ప్రస్తుతం 1975-77 నాటి ఎమర్జెన్సీ పరిస్థితులు నెలకొన్నాయని నలుగురు సుప్రీం జడ్జిలు చేసిన వ్యాఖ్యలను కేంద్రమాజీమంత్రి యశ్వంత్‌సిన్హా ప్రస్తావించారు. పార్లమెంటు సమావేశాలు తక్కువ కాలం జరగడంపై ఆందోళన వెలిబుచ్చారు. పార్లమెంట్ రాజీపడి... సుప్రీంకోర్టు గాడితప్పితే... అప్పుడు ప్రజాస్వామ్యానికి ముప్పు తప్పదని ఆయన హెచ్చరించారు. యశ్వంత్‌సిన్హా శనివారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ పరోక్షంగా మోడీపై తిరుగుబాటుకు బాటలు వేస్తున్నారు. ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని స్వయానా నలుగురు సుప్రీంకోర్టు సీనియరు జడ్జీలు చెబుతున్నారని, వారి వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని యశ్వంత్‌సిన్హా అన్నారు. 'ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ మాట్లాడాలి. అందరూ అదే కోరుకుంటారు. నేను కూడా అదే కాంక్షిస్తున్నాను. కేంద్రమంత్రులు, బీజేపీ నాయకులు మాట్లాడాలి. భయం విడనాడి..మాట్లాడటానికి ముందుకు రండి' అని సిన్హా పిలుపునిచ్చారు. సమస్యను సుప్రీంకోర్టు పరిష్కరించుకుంటుందని ఆయన అన్నారు. సుప్రీంకోర్టులో భారత ప్రధాన న్యాయమూర్తి ఎలాగో... ప్రభుత్వంలోనూ ప్రధానమంత్రి అంతేనని యశ్వంత్‌సిన్హా స్పష్టంచేశారు. సుప్రీం ప్రధాన న్యాయమూర్తి అందరితో సమానమే...అయితే, అందులో ఆయన ప్రథముడు. అంతేగానీ ఆయన గొప్పేమీ కాదని నలుగురు జడ్జీలు ముక్తకంఠంతో చెప్పారని, ప్రధాని కూడా మంత్రులతో సమానమేనని, అయితే, ఆయన అందరిలో ప్రథముడని సిన్హా వివరించారు. పెద్దనోట్ల రద్దు, జీఎస్‌టీ, కాశ్మీరు వంటి అనేక సమస్యలపై మోడీ ప్రభుత్వాన్ని సిన్హా ఇరుకున పెడుతున్నారు. మోడీ ప్రభుత్వంలో కేబినెట్ మంత్రులు భయపడుతున్నారని వ్యక్తిగతంగా తనకు బాగా తెలుసునని, ఇది ప్రజాస్వామ్యానికి కచ్చితంగా ముప్పు తీసుకొస్తుందని సిన్హా హెచ్చరించారు. సిన్హా విమర్శలను మొదటి నుంచీ మోడీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. 80 ఏళ్ల వయస్సులో ఆయన రాజకీయ ఉద్యోగం కోసం ఆరాటపడుతున్నారని కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ హేళనగా మాట్లాడిన విషయం విదితమే. మొదటి ఎన్‌డీఏ ప్రభుత్వంలో సిన్హా కేబినెట్ మంత్రి. ఆర్థిక, విదేశీ వ్యవహారాల మంత్రిగా పనిచేశారు. ప్రజాస్వామ్యానికి ముప్పు ఏర్పడుతుందని నలుగురు సీనియర్ జడ్జీలు బహిరంగంగా నోరు విప్పితే... రాజకీయ పార్టీలు, పార్లమెంటు కచ్చితంగా దీనిపై మాట్లాడాల్సిన అవసరం ఉందని సిన్హా అభిప్రాయ పడ్డారు. సుప్రీంకోర్టు అంతర్గత వ్యవహారంగా భావించడమంటే సమస్య నుంచి పక్కకు తప్పుకోవడమే అవుతుందని వ్యాఖ్యానించారు. పార్లమెంటు శీతాకాల సమావేశాలు, జనవరి 29 నుంచి ప్రారంభమయ్యే బడ్జెట్ సమావేశాల గురించి ప్రస్తావిస్తూ... ఇంత తక్కువ కాలం సమావేశాలు జరిగినట్టు తాను ఎన్నడూ వినలేదని సిన్హా పేర్కొన్నారు. ఇది కూడా ప్రజాస్వామ్యానికి ప్రమాదమేనని స్పష్టంచేశారు.

వాతావరణ మార్పును జయించాలనే

భారత్, చైనా సంకల్పం అభినందనీయం : ఐరాస

ఐరాస : వాతావరణంలో సంభవించే మార్పులను జయించేందుకు భారత్, చైనా దృఢ నిశ్చయంతో, సమర్థ నాయకత్వంతో ముందుకెళుతుండడం అభినందనీయమని ఐక్యరాజ్య సమితి అభినందించింది. ఈజిప్టులో జరిగిన జీ77 సమావేశంలో పాల్గొన్న ఐరాస జనరల్ సెక్రటరీ ఆంటోనియో గుటెరస్ వాతావరణంలో మార్పుపై భారత్, చైనా దేశాల పోరును ప్రశంసించారు. మిగతా దేశాలన్నీ విఫలమవుతున్న తరుణంలో భారత్, చైనా సమర్థవంతంగా, గట్టి సంకల్పంతో వాతావరణ మార్పులను అధిగమించేందుకు కృషిచేస్తున్నాయన్నారు. 'వాతావరణ మార్పుల ముందర ఓటమిని అంగీకరించలేం. అలాగనీ ఇప్పటివరకు మనం వాటిని జయించలేదు.దీని ప్రభావం ప్రపంచ దేశాలన్నింటితో పోల్చితే ఆఫ్రికా దేశాలపై అత్యధికంగా ఉంది. ఆ దేశాలు కరవుతో అల్లాడిపోతున్నాయి. అదేవిధంగా చిన్నచిన్న ద్వీపకల్పాలు హరికేన్ల ధాటికి అతలాకుతలమవుతున్నాయి. సముద్రంలో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ఇది ఆందోళనకర పరిస్థితి' అని గుటెరస్ అన్నారు. రెండు అతిపెద్ద ఆర్థికవ్యవస్థలైన భారత్, చైనా ఈ పరిస్థితులను చక్కబెట్టేందుకు తీవ్రంగా కృషిచేస్తున్నాయి. వీటిని అధిగమించేందుకు మనమంతా దృఢ సంకల్పంతో పకడ్బందీ కర్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. లేకపోతే తీవ్ర పరిణామాలు తప్పవు' అని పిలుపిచ్చారు. 'గ్రూప్ ఆఫ్ 77 లేదా జీ77' అన్నది ఐరాసలోని అభివృద్ధి చెందుతున్న దేశాల అతిపెద్ద అంతర్గత ప్రభుత్వ వ్యవస్థ. ఇది 1964, జూన్ 15న నెలకొల్పబడింది. ఈ గ్రూపులో ప్రస్తుతం భారత్‌తో పాటు 134 దేశాలు సభ్యులుగా ఉన్నాయి. 2016లో జరిగిన పారిస్ ఒప్పందంలో భారత్ కూడా భాగస్వామిగా ఉంది. శరవేగంగా సంభవిస్తున్న వాతావరణ మార్పుల కారణంగా భవిష్యత్‌లో ఆహార ఉత్పత్తి, నీటిభద్రత తదితర క్లిష్టసమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉందని గతేడాది మే 31న గుటెరస్ ప్రపంచ దేశాలను హెచ్చరించారు. ఈ క్రమంలో ప్రపంచ పరిస్థితి గందరగోళంగా ఉందని ఆయన వ్యాఖ్యానించారు.

మత్తు వీడని మందుబాబులు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: పోలీసులు ఎన్ని చర్యలు తీసుకున్నా మందుబాబుల ఆగడాలకు అంతుండటం లేదు. మద్యం మత్తులో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా వాహనదారుల్లో చలనం కనిపించకపోవడం పోలీసు యంత్రాంగాన్ని కలవరపెడుతోంది. మద్యం మత్తులో వాహనాలు నడిపే వారి సంఖ్య తగ్గడం లేదు. తాజాగా శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో విశ్వజిత్ అనే యువకుడు మృతి చెందగా, మరో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. డివైడర్‌ను ఢీకొట్టిన కారు పల్టీలు కొడుతూ చెట్టుకు బలంగా తగిలింది. ఈ ప్రమాదంలో విశ్వజిత్ అనే యువకుడు ఘటన స్థలంలోనే మృతి చెందగా అతనితో పాటు కారులో వున్న మిగతా ముగ్గురు గాయపడటంతో ఆసుపత్రికి తరలించారు. మద్యం మత్తులో కారు నడపడం వల్లనే ప్రమాదం జరిగిందని పోలీసులు ధృవీకరించారు. ఆ యువకులు రాత్రి పొద్దుపోయే వరకు మణికొండలో గెట్‌టుగెదర్ పార్టీకి వెళ్లి వస్తుండగా ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. జూబ్లీహిల్స్‌లో ఎప్పటి మాదిరిగానే పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. శుక్రవారం రాత్రి 25 కార్లు, 12 టూవీలర్లను స్వాధీనం చేసుకున్నారు. స్పీడ్, రాష్ డ్రైవింగ్ చేస్తున్న వారిపైనా దృష్టి సారించారు. ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ సమీపంలో డ్రైవ్ చేపట్టడంతో జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుండి రేసింగ్ చేస్తున్న 9మంది బైకర్లను పోలీసులు వెంబడించి అరెస్టు చేసి బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. అదే సమయంలో మితిమీరిన వేగంతో వెళుతున్న మరో వ్యక్తిపైనా పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తీసుకుంటున్న చర్యలు ఎలా ఉన్నా మద్యం మత్తులో వాహనాలు నడిపే వారి సంఖ్య మాత్రం తగ్గకపోవడం విచారకరం.

17న టీఎస్సార్

'కాకతీయ కళావైభవ మహోత్సవం'



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ఎప్పుడూ కళలను, కళాకారులను గౌరవిస్తూ, ప్రోత్సహిస్తున్న టి.సుబ్బరామిరెడ్డి.. టీఎస్సార్ లలిత కళా పరిషత్ ఆధ్వర్యంలో హైదరాబాద్, ముంబై, ఢిల్లీ, బెంగళూరు, విశాఖపట్టణం నగరాల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కాకతీయుల వైభవాన్ని చాటి చెప్పే విధంగా 'కాకతీయ కళా వైభవ మహోత్సవం' ఈనెల 17న శిల్పకళావేదికలో జరగనుంది. శనివారం టి.సుబ్బరామిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ కాకతీయుల కాలం స్వర్ణయుగమన్నారు. వారు 600 ఏళ్ల క్రితమే తెలుగు సంస్కృతి, నాగరికతను చాటారన్నారు. శ్రీకృష్ణ దేవరాయల కంటే ముందు నుంచి తెలుగు జాతికి వారసత్వాన్ని అందించారన్నారు. వరంగల్ రాజధానిగా 300 ఏళ్లు పరిపాలించారని, వాళ్ల పేరు మీద 'కాకతీయ కళా వైభవ మహోత్సవం' నిర్వహించడం తన అదృష్టమన్నారు. ఈ వేడుకలను మహారాష్ట్ర గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్ ప్రారంభిస్తారని, 560 చిత్రాల్లో నటించి, చిత్రపరిశ్రమలో 42 ఏళ్లు పూర్తి చేసుకున్న మోహన్‌బాబును 'విశ్వ నటసార్వ భౌమ' బిరుదుతో సత్కరిస్తుంచనున్నట్లు తెలిపారు. ఆధ్యాత్మిక, రాజకీయ, సినీ, సాంస్కృతిక ప్రముఖులు హాజరు కానున్నారన్నారు. తెలంగాణలోని వరంగల్, ఖమ్మం, నల్గొండ, నిజామాబాద్, మహబూబ్‌నగర్ తదితర ప్రాంతాల్లో రెండు,మూడు నెలలకొకసారి ఈ మహోత్సవాలు నిర్వహిస్తామని చెప్పారు. మోహన్‌బాబు మాట్లాడుతూ కళాకారులను, కళలను గౌరవించే వ్యక్తుల్లో సుబ్బరామిరెడ్డి ముందుంటారన్నారు. కార్యక్రమంలో రచయిత, నటుడు పరుచూరి గోపాలకృష్ణ, లయన్స్ క్లబ్ సభ్యులు, మహోత్సవం ఉత్సవ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్, కూచిపూడి కళాకారులు పద్మజ, సుజాత పాల్గొన్నారు.



లీగ్ దశకు చేరుకున్న

పీపీఆర్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

తూ.గో జట్టుపై అమరావతి బాలికల జట్టు విజయం

లీగ్ దశకు చేరుకున్న 8 జట్లు

విశాలాంధ్ర - గుడివాడ : గుడ్లవల్లేరు మండలం డోకిపర్రు గ్రామంలో మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్(ఎం.ఈ.ఇ.ఎల్) సౌజన్యంతో జరుగుతున్న పిపిఆర్ రాష్ట్ర స్థాయి కబడ్డీ ఛాంపియన్‌షిప్ లీగ్ పోటీల్లో ఎనిమిది జట్టు లీగ్ దశకు చేరుకున్నాయి. శనివారం జరిగిన వివిధ పోటీల్లో ఎనిమిది జట్లు విజయాలు సాధించి లీగ్ దశకు చేరుకున్నాయి. మొత్తం 31 జట్లు పాల్గొన్న కృష్ణా, గుంటూరు, తూర్పుగోదావరి, అనంతపురం, కడప, విశాఖపట్నం, ఉయ్యూరు, పుదుచ్చేరి జట్లతో రాష్ట్రంలోని కేంద్ర క్రీడల శాఖ పరిధిలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(సాయ్) హాస్టల్స్ జట్లు ఉన్నాయి. బాలికల విభాగంలో అమరావతి, తూర్పుగోదావరి జట్లు తలపడ్డాయి. ఈ పోటీలో తొలి నుంచి ఆధిక్యం సాధించిన అమరావతి జట్టు సునాయసంగా విజయం సాధించింది. భారత కబడ్డీ జట్టు క్రీడాకారిణులు మండలి మౌనిక, జాతీయ పతకం సాధించిన కె.వి రమణ, 15 విడతలు జాతీయ సట్టులో ఆడిన నసీమా, తిరుపతమ్మ తదితర క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. జాతీయ స్థాయి క్రీడాకారులతో క్రీడా ప్రాంగణం కళకళలాడుతోంది. లీగ్ దశలో అత్యధిక విజయాలు సాధించిన జట్టు లీగ్ ఓవరాల్ ఛాంపియన్‌గా నిలుస్తుందని నిర్వాహకులు తెలిపారు. ఆదివారం పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రధానోత్సవం జరుగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు.





ఐపీఎల్ వేలానికి

1,122 మంది క్రికెటర్లు

బెంగళూరు:
క్రికెట్ అభిమానులకు శుభవార్త. ఇండియన్ ప్రీమియర్ లీగ్ -2018 వేలానికి రంగం సిద్ధమైంది. ఈ నెల 27, 28 తేదీల్లో బెంగళూరు వేదికగా వేలం జరగనుందని శనివారం బీసీసీఐ అధికారికంగా వెల్లడించింది. ఈ వేలానికి టాప్ క్రికెటర్లతో పాటు మొత్తం 1,122 మంది క్రికెటర్లు నమోదు చేసుకున్నారు. 8 ఫ్రాంచైజీలు తాము అట్టి పెట్టుకున్న ఆటగాళ్లను బీసీసీఐకు సమర్పించాయి. ఈ జాబితాలో 281 మంది అంతర్జాతీయ ఆటగాళ్లతో పాటు, ఇంకా ఆరంగేట్రం చేయని 838 మంది కొత్తవారు ఉన్నట్లు బీసీసీఐ పేర్కొంది. ఐపీఎల్ వేలంలో భారత్ నుంచి 778 మంది ఆటగాళ్లు ఉన్నారని, అసోసియేట్ దేశాలకు చెందిన ముగ్గురు ఆటగాళ్లు ఉన్నట్లు బీసీసీఐ వెల్లడించింది. వేలానికి అందుబాటులో ఉండే ఆటగాళ్ల పూర్తి జాబితాను ఎనిమిది ఫ్రాంచైజీలకి పంపామని, భారత్ తర్వాత ఆస్ట్రేలియా నుంచే ఎక్కువ మంది క్రికెటర్లు ఉన్నట్లు బోర్డు వెల్లడించింది. ఆస్ట్రేలియా నుంచి 58 మంది, దక్షిణాఫ్రికా (57), శ్రీలంక, వెస్టిండీస్ నుంచి 39 మంది చొప్పున వేలంలోకి రానున్నారు. న్యూజిలాండ్ (30), ఇంగ్లండ్ (26) ఆటగాళ్లు ఆసక్తి కనబరుస్తున్నట్లు జాబితా స్పష్టం చేస్తోంది. ఈ వేలంలో క్రిస్‌గేల్, మాక్స్‌వెల్, హషీమ్ ఆమ్లా, కేన్ విలియమ్సన్, కొలిన్ మన్రో, టామ్ లాథమ్, రబడా తదితరులు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. భారత్ నుంచి గౌతమ్ గంభీర్, అశ్విన్, అజింక్య రహానే, చైనామన్ బౌలర్ కుల్దీప్ యాదవ్, ఓపెనర్లు కేఎల్ రాహుల్, మురళీ విజయ్‌ల మధ్య గట్టి పోటీ నెలకొనే అవకాశం ఉంది. ఈ ఏడాది ఐపీఎల్-11వ సీజన్ ఏప్రిల్ 4 న ప్రారంభమై మే 31తో ముగుస్తుంది. ఏ ఆటగాళ్లు ఏ జట్టులో ఆడనున్నారో, ఈ సీజన్‌లో ఏ ప్లేయర్ ఎక్కువ ధర పలుకుతారో అనేది తెలియాలంటే మరికొన్ని రోజులు ఆగాల్సిందే.

పార్థివ్ పటేల్‌కు జట్టులో చోటు



సంచూరియన్:
దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండో టెస్టు కోసం భారత జట్టులో అనూహ్యంగా చోటు దక్కించుకున్న కీపర్ పార్థివ్ పటేల్ అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు. ప్రస్తుతం జట్టులో ఉన్న ఆటగాళ్లలో అత్యంత సీనియర్ పార్థివ్ పటేలే. 32 ఏళ్ల పార్థివ్ 17 ఏళ్ల వయసులో 2002లో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేశాడు. 2004లో పార్థివ్ విదేశీ గడ్డపై తొలి టెస్ట్ ఆడాడు. ప్రస్తుతం జట్టులో ఉన్న ఆటగాళ్లలో ఏ ఒక్కరూ అప్పటికి ఇంకా అరంగేట్రం చేయలేదు. ఫలితంగా ప్రస్తుత జట్టులో పార్థివ్ అత్యంత సీనియర్‌గా నిలిచాడు. తొలి టెస్టులో దక్షిణాఫ్రికా చేతిలో ఓడిపోయిన భారత జట్టులో రెండో టెస్టులో స్వల్ప మార్పులు చేశారు. వృద్ధిమాన్ సాహా స్థానంలో పార్థివ్‌ను తీసుకోగా భువనేశ్వర్ కుమార్, శిఖర్ ధవన్‌లను రిజర్వ్ బెంచ్‌కే పరిమితం చేశారు. దీంతో జట్టు కూర్పుపై మాజీ క్రికెటర్లు మండిపడుతున్నారు. తొలి టెస్టులో రాణించిన భువనేశ్వర్ కుమార్‌ను ఎందుకు పక్కన పెట్టారని ప్రశ్నిస్తున్నారు.

కోహ్లి జట్టుకు సచిన్ త్రీ టిప్స్



న్యూఢిల్లీ:
మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ విరాట్ కోహ్లి, టీం ఇండియాకు మూడు సలహాలు ఇచ్చారు. కేప్‌టౌన్‌లో జరిగిన తొలి టెస్ట్‌లో ఘోరంగా ఓడిపోయిన భారత జట్టు రెండో టెస్ట్‌లో ప్రతీకారం ఎలా తీర్చుకోవాలో ఆయన సూచించారు. రెండో టెస్ట్‌లో బ్యాట్స్‌మెన్ మొదటి 25 ఓవర్లు జాగ్రత్తగా ఆడాలని, ఆ తర్వాతి 50 ఓవర్ల వరకూ స్కోర్ పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. బౌలర్లు సరైన ఏరియాల్లో బౌలింగ్ చేయాలి, అన్నిటికన్న ముఖ్యంగా జట్టు సభ్యులు ఐకమత్యంగా, పాజిటివ్‌గా ఉండాలని సచిన్ సలహాలిచ్చారు. తొలిటెస్ట్ ఓటమి జట్టును నిరాశకు గురి చేయదని నమ్ముతున్నట్లు సచిన్ పేర్కొంటూ, రెండో టెస్ట్ కచ్చితంగా జట్టు నిర్వాహకులకు పెద్ద సవాల్ అని, విదేశాల్లో భారత్ సత్తా ఏంటో నిరూపించే బాధ్యత ఉందని అన్నారు. సెంచరియాన్‌లో కూడా ఫాస్ట్ బౌలింగ్‌కి అనుకూలంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

48 బంతుల్లో నాయర్ సెంచరీ



విజయనగరం:
కర్ణాటక ఆటగాడు కరుణ్ నాయర్ సయ్యద్ ముస్తాక్ అలీ టీ 20 ట్రోఫీలో అద్భుత ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. శుక్రవారం తమిళనాడుతో జరిగిన మ్యాచ్‌లో కరుణ్ నాయర్ విశ్వరూపం ప్రదర్శించాడు. బౌండరీలే లక్ష్యంగా విరుచుకుపడిన నాయర్ 48 బంతుల్లో సెంచరీ సాధిం చాడు. ఈ మ్యాచ్‌లో ఎనిమిది ఫోర్లు, ఎనిమిది సిక్సర్లతో చెలరేగిన నాయర్ 111 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద అవుటయ్యాడు. అంతకముందు హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో నాయర్ సత్తాచాటిన సంగతి తెలిసిందే. 42 బంతుల్లో 77 పరుగులు సాధించి విజయంలో కీలక పాత్ర పోషించాడు. అదే ఊపును తమిళనాడుతో జరిగిన మ్యాచ్‌లో కూడా కొనసాగించిన నాయర్ శతకంతో మెరిశాడు. తద్వారా తొలుత బ్యాటింగ్ చేసిన కర్ణాటక 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 179 పరుగులు చేసింది. ఆపై భారీ లక్ష్యంతో బ్యాటింగ్ ఆరంభించిన తమిళనాడు 16.3 ఓవర్లలో 101 పరుగులకే ఆలౌటై పరాజయం పాలైంది.



చెరో సగం

- తొలిరోజు సఫారీలు 269/6
- మర్‌క్రామ్(94), హషీమ్ ఆమ్లా(82)
- రాణించిన అశ్విన్
- భారత్ ఫీల్డింగ్ కట్టుదిట్టం

భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య సెంచరియన్‌లో ప్రారంభమైన రెండో టెస్టు మ్యాచ్ మొదటిరోజు రెండు జట్లు పంచుకున్నాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన దక్షిణాఫ్రికా మొదటి రెండు సెషన్‌ల్లో తన ఆధిపత్యం చూపింది. టీ విరామ సమయానికి రెండు వికెట్లే కోల్పోయి భారీ స్కోరు దిశగా పయనిస్తున్న తరుణంలో ప్రొటీస్‌ను అశ్విన్ దెబ్బకొట్టాడు. దీనితో భారీస్కోరుకు బ్రేక్ పడింది. మొదటి టెస్టులో పేసర్లు ప్రభావం చూపితే రెండో టెస్టులో ఆ బాధ్యతను ఈ దఫా స్పిన్నర్లు తీసుకున్నారు.



సెంచరియన్:
భారత్-దక్షిణాఫ్రికా మధ్య జరుగుతున్న రెండో టెస్ట్ తొలి రోజు మ్యాచ్‌లో బ్యాటింగ్ ఎంచుకున్న సౌతాఫ్రికాకు ఓపెనర్లు జట్టుకు మంచి ప్రారంభాన్ని అందించారు. భోజన విరామం సమయానికి వికెట్ నష్టపోకుండా జాగ్రత్తగా ఆడారు. అయితే లంచ్ బ్రేక్ అనంతరం అశ్విన్ వేసిన 30వ ఓవర్ మూడో బంతిని డిఫెండ్ చేసేందుకు ప్రయత్నించి ఎల్గర్(31) సిల్లీ పాయింట్‌లో ఉన్న విజయ్‌కి క్యాచ్ ఇచ్చి ఔట్ అయ్యాడు. అనంతరం సెంచరీకి చేరువలో ఉన్న మార్‌క్రామ్(94) ఆదచీశీఅవగశ్విన్ వేసిన 48వ ఓవర్ మూడో బంతిని డిఫెండ్ చేసేందుకు ప్రయత్నించి కీపర్ పటేల్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఆ తర్వాత సఫారీ కీలక ఆటగాడు ఏబీ డివిలియర్స్ ఇషాంత్ శర్మ బౌలింగ్‌లో ఔట్ అయ్యాడు. ఇషాంత్ వేసిన 63వ ఓవర్‌లో డివిలియర్స్ క్లీన్ బౌల్డ్ అయ్యాడు. ఆ తర్వాత సౌతాఫ్రికా వరుసగా మూడు ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయింది. 81వ ఓవర్‌లో హాఫ్ సెంచరీ సాధించి సెంచరీ దిశగా దూసుకెళ్తున్న అమ్లాను(82) పాండ్య రనౌట్ చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన డికాక్(0) అశ్విన్ బౌలింగ్‌లో విరాట్‌కు క్యాచ్ ఇచ్చి ఔట్ అయ్యాడు. ఆ తర్వాత పాండ్యా ఓవర్‌లో ఫిలాండర్(0) రన్ తీసేందుకు ప్రయత్నించి రనౌట్ అయ్యాడు. దీంతో 85 ఓవర్లు ముగిసేసరికి దక్షిణాఫ్రికా 6 వికెట్ల నష్టానికి 256పరుగులు చేసింది. క్రీజ్‌లో డుప్లెసిస్(19), కేశవ్(4) ఉన్నారు. భారత బౌలింగ్‌లో అశ్విన్ 3, ఇషాంత్ 1 వికెట్ తీశారు. తీశాడు. రెండు వికెట్లు రనౌట్ల రూపంలో వచ్చాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ చేపట్టిన సఫారీలకు శుభారంభం లభించింది. ఓవరాల్‌గా చూస్తే తొలి రోజు ఆటలో టీమిండియాదే పైచేయి అయ్యింది.

మాజీ బాక్సర్ అనుమానాస్పద మృతి



గ్రేటర్ నోయిడా:
ఢిల్లీకి చెందిన మాజీ బాక్సర్ జితేంద్ర మాన్ అనుమానాస్పద స్థితిలో గ్రేటర్‌నోయిడాలోని ఆయన అపార్టమెంట్‌లో మృతి చెందాడు. బుల్లెట్ గాయాలతో అతను మరణించినట్టు పోలీసులు గుర్తించారు. 27 ఏళ్ల జితేంద్ర మాన్ స్థానిక ఆల్ఫా సెక్టార్‌లోని జిమ్‌లో శిక్షకుడిగా పనిచేస్తున్నాడు. ఈనెల 10 ఉదయం జిమ్‌కు మాన్ వెళ్లాడని, అప్పట్నించి అతని ఫోన్ స్విచ్‌ఆఫ్‌లో ఉందని పోలీసులు తెలిపారు. అపార్ట్‌మెంట్ తాళం కలిగి ఉన్న టొకాస్ అనే వ్యక్తి మాన్‌కు ఫోన్ చేసినప్పటికీ అతని నుంచి స్పందన లేకపోవడంతో అతని గదికి వెళ్లి , తలుపులు తెరిచి చూడగా మాన్ బుల్లెట్ గాయాలతో రక్తపు మడుగులో పడి ఉండటం కనిపించిందని, దాంతో అతను వెంటనే తమకు సమచారం ఇచ్చాడని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్ట్‌మార్టం కోసం పంపినట్టు రూరల్ ఎస్పీ సునితి సింగ్ తెలిపారు. మాన్ 2008లో హర్యానా స్టేట్ బాక్సర్‌గా నిలిచాడు. ఢిల్లీలోనే కాకుండా ఫ్రాన్స్, ఉజ్బెకిస్థాన్, క్యూబా, రష్యాలోనూ పలు బాక్సింగ్ ఈవెంట్లలో పాల్గొన్నాడని ఎస్పీ తెలిపారు. కొద్దికాలం క్రితం బాక్సింగ్‌ను అతను వదిలిపెట్టి జిమ్ ట్రైనర్‌గా పనిచేయడం ప్రారంభించినట్టు చెప్పారు. గ్రేటర్ నోయిడాలో ఒంటరిగానే ఉంటున్న మాన్ నాలుగు నెలల క్రితమే ఏవీజే హైట్స్ అపార్ట్‌మెంట్‌కు మారినట్టు తెలిపారు. ప్రాథమిక సమాచారం ప్రకారం దుండగులు మాన్‌ను కాల్చి చంపి, మొబైల్ ఫోన్, ఇంటి తాళాలు తీసుకువెళ్తూ డోర్ లాక్ చేశారన్నారు. సీసీటీవీ ఫుటేజ్ ద్వారా ఆగంతకులను గుర్తించి అరెస్టు చేస్తామని ఎస్పీ సింగ్ పేర్కొన్నారు.

తెలంగాణ టీ-20 లీగ్‌లో అఖిల్, సుధీర్

- హెచ్‌సీఏ క్రికెటర్లకు అవకాశం
- ఫిబ్రవరి 3 నుంచి సూపర్ లీగ్



హైదరాబాద్:
హెచ్‌సీఏ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వెంకటస్వామి స్మారక తెలంగాణ టీ-20 లీగ్‌కు టాలీవుడ్ స్టార్ అట్రాక్షన్ తోడవుతోంది. ఈ లీగ్‌లో సినీ నటులు అక్కినేని అఖిల్, సుధీర్ బాబు పోటీపడనున్నారు. రంగారెడ్డి జిల్లా ఫ్రాంచైజీ తరఫున ఈ ఇద్దరూ బరిలోకి దిగుతారని ఆ జట్టును కొనుగోలు చేసిన బీసీసీఐ జూనియర్ సెలెక్షన్ కమిటీ మాజీ చైర్మన్ వి. చాముండేశ్వర్ నాథ్ తెలిపారు. దేశవాళీల్లో ఆడుతున్న హెచ్‌సీఏ క్రికెటర్లు కూడా ఈ టోర్నీలో పాల్గొంటారని హెచ్‌సీఏ అధ్యక్షుడు జి. వివేకానంద్ శుక్రవారం ప్రకటించారు. ఈ లీగ్ రెండో దశ (సూపర్ లీగ్) వచ్చే నెల 3 నుంచి 22 వరకు జరుగుతుందన్నారు. 'తెలంగాణ జిల్లాల్లో క్రికెటర్లకు అవకాశాలు ఇవ్వడం కోసం మొదలుపెట్టిన ఈ లీగ్‌కు అద్భుతస్పందన వస్తోంది. లీగ్ తొలి దశ అంతర్ జిల్లాల పోటీల్లో ఆటగాళ్లు సత్తా చాటారు. 32 జట్లు బరిలోకి దిగిన ఈ దశలో 52 మ్యాచ్‌లు జరిగాయి. హెచ్‌సీఏ సెలెక్టర్లు ఎంపిక చేసిన 500 మంది క్రికెటర్లు పోటీపడ్డారు. ఇందులో ప్రతిభ చూపిన వంద మంది క్రికెటర్లను సూపర్ లీగ్‌కు ఎంపిక చేశామని, సూపర్ లీగ్‌లో ఉమ్మడి జిల్లాలతో కూడిన 10 జట్లు సింగిల్ రౌండ్ రాబిన్ పద్ధతిలో పోటీ పడుతాయని వివేక్ వెల్లడించారు. ఈ పది జట్ల కోసం నిర్వహించిన బిడ్డింగ్‌లో పాల్గొని టీమ్‌లను కొనుగోలు చేసిన యజమానుల పేర్లను ఆయన ప్రకటించారు. ప్రతీ జట్టులో 10 మంది జిల్లాల క్రికెటర్లు, రంజీలు సహా పలు దేశవాళీ టోర్నీల్లో హైదరాబాద్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎనిమిది మంది ఆటగాళ్లు ఉంటారు. హెచ్‌సీఏ ఎనిమిది ఆటగాళ్ల కోటాలో ఫ్రాంచైజీలు తమకు నచ్చిన ఇతర ఇద్దరిని ఎంచుకునే అవకాశం ఇస్తున్నట్టు వివేక్ చెప్పారు. ఈ కోటాలో తాము అఖిల్, సుధీర్ బాబును తీసుకుంటామని రంగారెడ్డి యజమాని చాముండేశ్వర్ తెలిపారు. ప్రతీ ఫ్రాంచైజీ తుది జట్టులో కచ్చితంగా ఐదుగురు జిల్లాల క్రికెటర్లకు చోటు కల్పించాల్సి ఉంటుందన్నారు. ఈ టోర్నీలో ప్రతిభ ఆధారంగా హైదరాబాద్ టీ-20 జట్లను ఎంపిక చేస్తామన్నారు. ప్రతిపాదిత స్టార్ ప్లేయర్లు, సీనియర్ క్రికెటర్లంతా ఈ లీగ్‌లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఈ ఏడాది ఆరంభించిన లీగ్‌కు హెచ్‌సీఏ నిధుల నుంచి ఒక్క రూపాయి కూడా ఉపయోగించడం లేదని స్పష్టం చేశారు. టోర్నీకి అవసరమయ్యే ప్రతీ పైసాను స్పాన్సరర్ విశాక, లీగ్ యజమానులే భరిస్తారన్నారు. టోర్నీకి మొత్తం 40 లక్షల ప్రైజ్‌మనీ ఉంటుందని, విజేత 15 లక్షలు, రన్నరప్ 7.5 లక్షలు దక్కించుకుంటాయని తెలిపారు.

హెచ్‌సీఏపై న్యాయ పోరాటం: అజార్



విశాలాంధ్ర - హైదరాబాద్ బ్యూరో:
హైదరాబాద్ క్రికెట్ సంఘంపై న్యాయపోరాటానికి ఇండియన్ మాజీ కెప్టెన్ మొహమ్మద్ అజరుద్దీన్ సిద్దమయ్యారు. గత ఏడాది జరిగిన హెచ్‌సీఏ ఎన్నికల్లో ఆయన్ను పోటీ చేయకుండా అడ్డుకున్న ప్రకాశ్ జైన్‌పై కేసు వేయాలని ఆయన నిర్ణయించుకున్నారు. శనివారం హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో అజర్ మీడియాతో మాట్లాడారు. తనకు బీసీసీఐ నుంచి క్లియరెన్స్ ఉందని, కానీ జైన్‌తో పాటు హెచ్‌సీఏ అధికారులు తనను ఎన్నికల్లో పోటీచేయకుండా అడ్డుకున్నారని, తనకు అర్హత లేదని రిటర్నింగ్ ఆఫీసర్‌కు తప్పుడు సమాచారం ఇచ్చారని అజర్ వాపోయారు. ఈ అంశంలో తాను న్యాయపోరాటం చేయాలని నిర్ణయించుకున్నట్లు మాజీ క్రికెటర్ వెల్లడించారు. తన దగ్గర బీసీసీఐ లేఖలు ఉన్నాయని, అందుకే ఈ కేసులో లీగల్‌గా వెళ్లాలని నిర్ణయించినట్లు అజార్ తెలిపారు. కేవలం ఎన్నికల్లో పోటీచేయకుండా ఉండేందుకు తనను అడ్డుకున్నారని, బీసీసీఐ నుంచి తనకు అనుమతి లేదని హెచ్‌సీఏ అధ్యక్షుడు జీ వివేకానంద తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని బీసీసీఐ ఇచ్చిన క్లియరెన్స్ లెటర్ తన దగ్గర ఉందని, ఇది ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడమే అని అజర్ మండిపడ్డారు. హెచ్‌సీఏ అధ్యక్షుడు వివేకానందతో కానీ ఇతర అధికారులపైన కానీ తనకు వ్యక్తిగత శత్రుత్వం ఏమీ లేదని, ప్రెసిడెంట్ వివేకానంద తన అధికారాలను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. జీ వెంకటస్వామి కప్ టోర్నీ నిర్వహణకు బీసీసీఐ అనుమతి లేదని, కానీ హెచ్‌సీఏ ఆ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నదని అజర్ తెలిపారు. ఇతర రాష్ట్రాలు టోర్నీల కోసం బీసీసీఐ పర్మిషన్ తీసుకుంటే, హెచ్‌సీఏ మాత్రం అలా చేయడం లేదన్నారు. బీసీసీఐ అధికారులైన వినోద్ రాయ్, రాహుల్ జోరీలను కలిసేందుకు తాను ముంబై వెళ్లనున్నట్లు తెలిపారు. తమ కేసును వ్యక్తిగతంగా బీసీసీఐ ముందు ఉంచాలన్నదే తమ ఉద్దేశమని, దీని పట్ల బీసీసీఐ సరైన చర్య తీసుకుంటుందని మాజీ క్రికెటర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయన కేసును ఓంబుడ్స్‌మన్ ఎల్ నరసింహారెడ్డి ప్రజెంట్ చేస్తున్నామని, అనుకూలమైన తీర్పు వస్తుందన్న ఆశాభావాన్ని అజార్ వ్యక్తం చేశారు. సుప్రీం ఆదేశాలకు కానీ లోధా సూచనలకు అనుకూలంగా హైదరాబాద్ క్రికెట్ సంఘం వ్యవహరించడం లేదన్నారు. క్యాబినెట్ మంత్రి హోదా ఉన్న వివేకానంద కూడా హెచ్‌సీఏ అధ్యక్షుడిగా అనర్హుడని, దానిపై రాష్ట్ర ప్రభుత్వం వివరణ ఇవ్వాలని అజార్ డిమాండు చేశారు.

అరసం నేత, సీనియర్ పాత్రికేయులు

గుర్రంకొండ శ్రీకాంత్‌కు కన్నీటి వీడ్కోలు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్:
సీనియర్ పాత్రికేయులు గుర్రంకొండ శ్రీకాంత్‌కు అశ్రునయనాలతో తుదివీడ్కోలు పలికారు. శీకాంత్ భౌతికకాయానికి శనివారం మధ్యాహ్నం మహాప్రస్థానంలో అంత్యక్రియలు జరిగాయి. పలువురు పాత్రికేయులు, అభిమానులు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. సీపీఐ సీనియర్ నాయకులు, ఇప్టా జాతీయ ఉపాధ్యక్షుడు కందిమల్ల ప్రతాప్ రెడ్డి, అరసం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.రాపోలు సుదర్శన్, టీవీ 99 డైరెక్టర్ చెన్నకేశవరావు, సంపాదకులు అజిత ప్రభృతులు భౌతికకాయం వద్ద పుష్పగుచ్ఛాలుంచి నివాళులర్పించారు. శ్రీకాంత్ (79) శుక్రవారం రాత్రి ఇక్కడి అత్తాపూర్‌లోని ఆయన స్వగృహంలో గుండె సంబంధ అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఐదు దశాబ్దాలకు పైగా పాత్రికేయునిగా కొనసాగారు. నెల్లూరు జిల్లా సీతారాంపురంలో జన్మించిన శ్రీకాంత్ విద్యార్థిగా ఉన్నప్పుడే విజయవాడ నుంచి వెలువడే 'యువజన' పత్రికకు వ్యాసాలు రాశారు. పాత్రికేయ జీవితానికి పడిన ఆ పునాది ఆ తర్వాత ప్రగతిశీల భావజాలం కారణంగా విశాలాంధ్ర పత్రికలో పాత్రికేయునిగా పనిచేయడానికి దోహదపడింది. చాలాకాలం పాటు విశాలాంధ్రలో సబ్ ఎడిటర్‌గా పనిచేశారు. అనంతరం మద్రాసు నుంచి వెలువడే 'సోవియట్ భూమి' పత్రికలో చేరారు. మూతపడేంత వరకు ఆ పత్రికకు సంపాదకుడిగా పనిచేశారు. ప్రతిభ, ప్రగతి పత్రికల సంపాదకవర్గ సభ్యుడిగా పనిచేశారు. ఆయన రాసిన గద్దలాడుతున్నాయి నవల విశాలాంధ్ర నవలల పోటీలో ప్రథమ బహుమతి పొందింది. ఆ తర్వాత ఎన్‌టీ రామారావు తెలుగుదేశం పార్టీ స్థాపనలో శ్రీకాంత్ ప్రముఖ పాత్ర పోషించారు. ఆయన ఆహ్వానం మేరకు మద్రాసు నగరాన్ని విడిచి హైదరాబాద్ చేరుకున్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు రూపాయల కిలో బియ్యం పథకం గురించి ఎన్టీఆర్ అనేక కోణాల్లో శ్రీకాంత్‌తో లోతుగా చర్చించారు. ఆపై ఎన్టీఆర్‌కు రాజకీయ ప్రసంగాలు తయారుచేసే కీలక భూమిక పోషించారు. ఎన్టీ ఆర్‌కు చివరి ప్రసంగాన్ని రూపొందించింది కూడా శ్రీకాంతే. ఎన్టీఆర్ మరణించేంత వరకూ గండిపేటలోని కుటీరంలోనే కుటుంబంతో కలిసి ఉండేవారు. అనంతరం 'వార్త' దినపత్రిక జర్నలిజం కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్య తలు చేపట్టి 400 మంది యువ పాత్రికేయులను తీర్చిదిద్దారు. ఆయన దగ్గర పాఠాలు నేర్చుకున్నవారు ప్రస్తుతం వివిధ పత్రికల్లో, టీవీ ఛానెళ్లలో పాత్రికే యులుగా పనిచేస్తున్నారు. పాత్రికేయుడిగా 'జర్నలిస్టు కరదీపిక' లాంటి పుస్తకాలతో పాటు సిపాయి చిన్నయ్య, ఒక ఊరి కథ లాంటి రెండు సినీ కథలు, దేవుళ్లారా మీ పేరేంటి, ప్రేమకు కత్తిపోట్లు, మనిషిలో మనీషి, గద్దల గుంపు, మదన సదనం లాంటి ఐదు సామాజిక నవలలు రాశారు. అనేక రచనలకు విమర్శకుడిగా వ్యవహరించారు. సోవియట్ లాండ్ నెహ్రూ అవార్డు, తాపీ ధర్మారావు కీర్తి పురస్కారం, మహాకవి శ్రీశ్రీ సాహిత్య పురస్కారం లాంటి అవార్డులు అందుకున్నారు. శ్రీకాంత్‌కు అరసం తుమ్మల, పులుపుల వెంకట శివయ్య సాహితీ సత్కారాలను అందించింది.



అరసం సంతాపం
శ్రీకాంత్ మృతికి అరసం సంతాపం తెలిపింది. శ్రీకాంత్ అరసంలో క్రియాశీలకంగా వ్యవహారించారని, అరసానికి ఆయన ఎంతో సేవ చేశారని, ఆయన మృతి అభ్యుదదయ సాహిత్యానికి తీరనిలోటని అరసం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, విశాలాంధ్ర సంపాదకులు ముత్యాల ప్రసాద్ పేర్కొన్నారు. శ్రీకాంత్ సహృదయుడని అరసం ఉభయ రాష్ట్రాలలో కార్యవర్గ సభ్యునిగా కొనసాగిన ఆయన ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా కొనసాగుతున్నారని తెలిపారు. ఆయన మృతికి సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. శ్రీకాంత్ మృతికి అరసం తెలంగాణ రాష్ట్ర నాయకులు డా॥ వి, వీరాచారి, వేల్పుల నారాయణ, డా॥ రాపోల్ సుదర్శన్, కేవిఎల్, పల్లేరు వీరాస్వామి తదితరులు సంతాపం తెలిపారు.

ఇస్రో శాస్త్రవేత్తలకు

సీపీఐ అభినందనలు

న్యూఢిల్లీ:
వందో ఉపగ్రహ ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించిన భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) శాస్త్రవేత్తలకు భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) కేంద్ర కార్యదర్శివర్గం అభినందనలు తెలిపింది. ఈ మేరకు కార్యదర్శి వర్గం శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఆ ప్రకటన ఇలా ఉంది. 31 ఉపగ్రహాలతో పీఎస్‌ఎల్‌వీ సీ40 రాకెట్ శుక్రవారం విజయ వంతంగా నింగిలోకి దూసుకుపోయింది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోటలోని షార్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుంచి ఈ ప్రయోగం నిర్వహించారు. పీఎస్‌ఎల్‌వీ-సీ40 రాకెట్ 31 ఉపగ్రహాలతో శుక్రవారం నింగిలోకి దూసుకెళ్లింది. వీటిలో భారత్‌కు చెందిన కార్టోశాట్-2ఇ, ఒక నానో శాటిలైట్, ఒక సూక్ష్మ ఉపగ్రహం ఉన్నాయి. 710 కిలోల బరువున్న కార్గోశాట్-2 ఇఆర్‌ను ఇస్రో సొంతంగా తయారుచేసింది. కార్గోశాట్-2 ఉపగ్రహం ద్వారా ఒక మీటర్ వ్యాసార్థంతో ఫొటో తీయవచుచన మ్యాపింగ్‌కు ఎంతో ఉపయోగపడుతుంది. వ్యవసాయం, సముద్ర గర్భంలో అన్వేషణ చేస్తుంది. ఇస్రో వాణిజ్య విభాగం యాంట్రిక్స్ కార్పొరేషన్ లిమిటెడ్‌తో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు ప్రయోగించిన 28 విదేశీ ఉపగ్రహాలలో మూడు మైక్రోశాటిలైట్లు. 25 నానో శాటిలైట్లు. అందులో 19 ఉపగ్రహాలు అమెరికావి, ఐదు దక్షిణ కొరియావి. బ్రిటన్, ఫ్రాన్స్, కెనడా, ఫిన్‌లాండ్ దేశాలకు చెందిన ఉపగ్రహాలు ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.